RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



11 జనవరి 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:190

# ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు.

హైదరాబాద్‌లోని గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (CII) జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పనిచేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని చెప్పారు.

“తెలంగాణ రైజింగ్ (TelanganaRising) లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. హైదరాబాద్‌లో సంపూర్ణంగా నెట్ జీరో లక్ష్యాలతో పనిచేస్తున్నాం.

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను సమకూర్చబోతున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్, రోడ్ టాక్స్‌లను పూర్తిగా రద్దు చేశాం. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయి.

వరదలు లేని నగరంగా, దేశంలోనే పర్యావరణ హితమైన హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించాం. 2050 నాటికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించాం.

తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అవుటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యన రేడియల్ రోడ్లను నిర్మించబోతున్నాం. ఆయా ప్రాంతాల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయబోతున్నాం.

360 కి.మీ పొడవు ఉండబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్‌ను నిర్మించాలని ప్రధానమంత్రి గారిని కోరాం. రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ తయారీ పరిశ్రమ, మార్కెటింగ్ కు అవసరమైన కేంద్రీకృత ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నది మా ఉద్దేశం.

చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని భావిస్తున్నాం. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నీచర్ సిటీ... ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ మార్కెటింగ్ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్నాం.

రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుంది. రింగ్ రోడ్డు ఆవలివైపున గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రీయ సాగు, రైతుల కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది.

తెలంగాణకు సముద్ర తీరప్రాంతం లేని కారణంగా డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నాం. పోర్టుతో అనుసంధానం చేయడానికి మచిలీపట్నం ఓడరేవు వరకు ప్రత్యేక రహదారి, రైల్వే కనెక్టివిటీని ప్రతిపాదించాం.

నైపుణ్యత పెంచడానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రధానంగా దృష్టి సారించాం. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభ పరిణామం. అత్యుత్తమ వ్యాపార సౌలభ్యాలను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. సీఐఐ కలిసిరావాలి. అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చని మా నమ్మకం” అని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

ఈ సమావేశంలో సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పూరి , వైఎస్-ప్రెసిడెంట్ ఆర్. ముకుందన్ , సీఐఐ డైరెక్టర్ చంద్రజీత్ బెనర్జీ , పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ దచీశీఅవగతో పాటు సీఐఐ ప్రతినిధులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.




## నేనూ మనిషినే, దేవుడ్ని కాదు- తప్పులు జరుగుతాయ్’-:ప్రధాని మోదీ

ఢిల్లీ, జనవరి 10 ప్రధాని నరేంద్ర మోదీ మొదటిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తోన్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కామత్ పలు ఆసక్తికర విషయాలను షేర్? చేసుకున్నారు. ఈ పాడ్?కాస్ట్?కు సంబంధించిన ట్రైలర్ వీడియోను నిఖిల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్? చేశారు. దీన్ని మోదీ రీపోస్ట్ చేశారు. అందులో గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో తానూ ఒక మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని చెప్పారు.దాదాపు రెండు నిమిషాలు ఉన్న ఈవీడియోలో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. పాడ్?కాస్ట్? ప్రారంభంలో నిఖిల్ కామత్ మాట్లాడారు. ‘ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది’ అని అన్నారు. దీనికి మోదీ బదులిస్తూ ‘ఇదే నా ఫస్ట్? పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు మరి’ అనడం వల్ల నవ్వులు పూశాయి.కాగా, రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటీ? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగారు. దానికి మోదీ బదులిచ్చారు. “రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్ తీసుకోవడం కోసం రావాలి. కానీ సొంత లక్ష్యాలు నెరవేర్చుకోవడం కోసం కాదు” అని అన్నారు. ఈ సందర్భంగా మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాత స్పీచ్?ల గురించి మాట్లాడారు. అప్పుడు తానే ఏదో అని ఉంటానని, పొరపాట్లు జరుగుతుంటాయన్నారు. తానూ మనిషినేనని భగవంతుడిని కాదు కదా అంటూ వ్యాఖ్యానించారు.

తొలి రెండు సార్లు ప్రధానిగా తన అనుభవాలను మోదీ షేర్? చేసుకున్నారు. ఈ పాడ్?కాస్ట్? వీడియోను ప్రధాని రీపోస్ట్ చేశి. ‘ఈ ఇంటర్వ్యూను మీరంతా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా’ అని క్యాప్షన్ జోడించారు. అయితే ప్రస్తుతం ఈ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ ట్రైలర్ వచ్చింది. పూర్తి విడియో ఎప్పుడొస్తుందన్న దానిపై క్లారిటీ లేదు

## గోశామహల్‌లో మరోసారి కుంగిన చాక్వాడి నాలా - నాలాలో పడిన క్రషర్ లారీ




హైదరాబాద్, జనవరి 10 హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ప్లైవుడ్ దుకాణాల ముందు చాక్వాడి నాలా మరోసారి కుంగింది. దీంతో నాలాపై ఉన్న క్రషర్ లారీ అందులో కూరుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. ఒకవైపు గతంలో కుంగిన నాలా పనులను పునరుద్ధరిస్తుండగా ఇప్పుడు అక్కడే మరో నాలా కుంగింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలాను పూర్తిగా పునరుద్ధరించాలని గతంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. తమ సమస్యను త్వరితగతిన వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రాణం పోతే ఎవరిది బాధ్యత? : ఈ నాలా అతిపురాతనమైనది కావడంతోనే ఇలా స్థానికులు కుంగినట్లు చెబుతున్నారు. ఇప్పటికీ ఈ నాలా కుంగడం మూడోసారి. ఈ నాలా పునరుద్ధరణ విషయంలో పదే, పదే మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నాలాలు కుంగడం వల్ల ప్రాణ నష్టం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీస్తూ పలు ప్రశ్నలను ప్రభుత్వానికి సంధించారు. ఈ నాలా కుంగడం కారణంగా నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చెప్పారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఈ నాలా విషయంపై పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరించారు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయాలలో ఉత్తరద్వారం ద్వారా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా



మెల్బోర్న్ ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో ఉన్నటువంటి మెల్బోర్న్ క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు.

క్రీడాకారులకు ఇస్తున్నటువంటి శిక్షణ ఎంపిక ప్రక్రియ తదితర అంశాల గురించి క్రికెట్ విక్టోరియా ప్రీమియర్ క్రికెట్ జనరల్ మేనేజర్ లియం మర్ఫీ గారితో చర్చించినట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు తెలిపారు.

ప్రజాబలం

11 జనవరి 2025 శనివారం

## కాంగ్రెస్ అంటే జీర్ణించుకోలేని ప్రధాని!

గతంలో జవహర్ లాల్ నెహ్రూ దగ్గర నుండి కాంగ్రెస్ పార్టీ 'హిందూ' ఫోబియాతో భారతీయ సామాజిక జీవనానికి చెప్పలేని విధ్వంసాలు సృష్టిస్తూ వచ్చింది. నాడు స్వాతంత్ర్య పోరాటంలో తిరుగులేని నాయకత్వం వహించిన కాంగ్రెస్ నేతల అవకాశవాద విధానాలను సవాల్ చేస్తూ ప్రజలలో ప్రాబల్యం పెంచుకుంటున్న హిందూ మహాసభపట్ల చెలరేగిన అభద్రతా భావమే అటువంటి ఫోబియాకు దారితీసిందని చెప్పవచ్చు. ఆ తర్వాత దేశవిభజన సమయంలో కాంగ్రెస్ నిస్తేజంగా మారడం, హిందువుల రక్షణ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అగ్రగామిగా నిలబడడంతో ఆ సంస్థ పట్ల అభద్రతా భావం చెలరేగింది. ముందుగా సర్దార్ పటేల్ ద్వారా కాంగ్రెస్ అనుబంధ స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ ను చేరమని అధికారికంగా కాంగ్రెస్ ఆహ్వానించింది. అందుకు ఆ సంస్థ విముఖత వ్యక్తం చేయడంతో ఆ పటేల్ ద్వారానే గాంధీజీ హత్యను సాకుగా తీసుకొని ఆ సంస్థపై నిషేధం విధించింది. ఆ తర్వాత జనతా ప్రభుత్వంలోని సోషలిస్టులలో సైతం ఆర్ఎస్ఎస్పట్ల అభద్రతా భావం ఏర్పడింది. ముందుగా ఆర్ఎస్ఎస్ సైతం జనతా పార్టీలో అనుబంధ సంస్థగా విలీనం కావాలన్నారు. అందుకు ఒప్పుకోకపోవడంతో 'ద్వంద సభ్యత్వం' వివాదంతో నాటి జనతా ప్రభుత్వాన్నే కూల్చివేశారు. కాంగ్రెస్ మొత్తం మీద మూడు సార్లు ఆర్ఎస్ఎస్పై నిషేధం విధించింది. కానీ సాధించింది ఏమీ లేదు. ఎమర్జెన్సీ సమయంలో స్వయంగా ఇందిరా గాంధీ నిషేధ సమయంలో ఆర్ఎస్ఎస్ ప్రతి మూలకు విస్తరించింది అంటూ చెప్పుకురావడం గమనార్హం. హిందూ అనే పదం హిందూ మహాసభ లేదా ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చింది కాదనే స్పృహ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఎంతో నష్టపోయి నేడు తన అస్తిత్వంకోసం పోరాడాల్సిన పరిస్థితి తెచ్చుకుంది. ఈ సంస్థలకన్నా ముందు చెన్నైలో 'ది హిందూ' అనే దినపత్రిక ప్రారంభమైంది. బెంగళూరులో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ అనే రక్షణ ఉత్పత్తుల సంస్థ ఏర్పడింది. పలు ప్రభుత్వ రంగ సంస్థలు 'హిందూ' పేరుతో వెలిశాయి. ఇప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి సైతం 'నెహ్రూగాంధీ', 'కాంగ్రెస్' ఫోబియాతో సతమతమవుతున్నట్లు కనిపిస్తున్నది. స్వతంత్ర భారత దేశంలో భారత సైన్యం సాంకేతికంగా గెలుపొంది, విదేశీ సైనికులు లొంగుబాటు ప్రదర్శించిన యుద్ధం 1971 మాత్రమే. ఆ ఘనమైన విజయానికి చిహ్నంగా పాక్ సైనికులు మనసైనికుల ముందు లొంగిపోయిన చిత్రాన్ని భారత సైన్యం తన ప్రధాన కార్యాలయంలో గత 50 ఏళ్లుగా ఉంచుతూ వచ్చింది. విదేశీ సైనికాధికారులు ఎవ్వరు వచ్చినా ఈ చిత్రం ముందే మన సైన్యాధిపతులతో భేటీ జరపడం, ఫోటో దిగడం జరుగుతూ వస్తోంది. ఈ చిత్రంలో ఇందిరా గాంధీ లేరు. అయినా దానిని చూడగానే ఆమె సాహసం, వైట్ హౌస్కు వెళ్లి 'కొన్ని వేల కిలోమీటర్ల దూరం నుండి వర్ధమాన దేశాలపై ఆధిపత్యం వహించాలి అంటే కుదరదు' అని హెచ్చరించిన ఆమె ధైర్యం ప్రజలకు గుర్తుకు వస్తాయనే భయంతో ఆ ఫోటోను మార్చివేశారు. అగ్రరాజ్యాల ప్రాపకం కోసం అర్రులు చేస్తున్న నేటి పాలకులలో ఓ విధమైన వణుకు వచ్చినట్లుంది. తమ ఘనమైన పాలన ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండే ప్రయత్నం చేయకుండా గత పాలకుల గుర్తులు చెరిపివేసే ప్రయత్నాలు గత పదేళ్లుగా పెద్ద ఎత్తున చేస్తూనే ఉన్నారు.

తాజాగా గత రెండేళ్లుగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరగడంలేదు. జనవరి 3 అంటే దేశంలో ఎక్కడో ఒకచోట సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాన మంత్రిగా ఎవ్వరుంటే వారు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ముగింపు సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. దేశంలోని కీలక శాస్త్రవేత్తలకు మాత్రమే కాకుండా, అంతర్జాతీయంగా కూడా సైన్స్రంగంలో గుర్తింపు పొందిన సమావేశాలు ఇవి. గత ఏడాది అయితే సమావేశాలను జరపడం లేదనే ప్రకటన చేశారు. ఈ సంవత్సరం అటువంటి ప్రకటన కూడా రాలేదు. 'కాంగ్రెస్' అంటే సమూహమని చెప్పొచ్చు. అమెరికాలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఏర్పడే సమూహాన్ని 'కాంగ్రెస్' అనే అంటారు. అయితే నేటి పాలకులకు కాంగ్రెస్ అనగానే అభద్రతాభావం పెల్లుబుకు వస్తున్నట్లు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలను రాష్ట్రాల్లో కూల్చి వేస్తూ వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పేరుతో ఉండే అన్ని రకాల సమావేశాలకు తిలోదకాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతుంది. ఇటీవల కాలంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అంతరాయం కలుగుతుంది. సమావేశాల ప్రధాన అంశాన్ని నిర్ణయించే విషయంలో కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ, సాంకేతిక మంత్రిత్వ శాఖకు, సమావేశాలను నిర్వహించే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్లకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈసమావేశాలు జరగడం లేదని తెలుస్తోంది. ఈ సమావేశాలకు ఆర్థిక వనరులను సమకూర్చే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ తాము సూచించిన అంశాలపైన చర్చించకపోతే నిధులు ఇవ్వమని స్పష్టం చేయడంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించలేకపోతున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కేవలం అధికారంలో ఉన్న నేతల ప్రచారానికి పనికివచ్చే అంశాలను సూచించడం, అందుకు శాస్త్రవేత్తలు అంగీకరించకపోవడంతో వివాదం ఏర్పడినట్లు భావించాల్సి వస్తుంది. 1914లో లక్నోలోని కానింగ్ కాలేజ్ ప్రొఫెసర్ పిఎస్ మాక్ మహన్, మద్రాసులోని రెసిడెన్సి కళాశాల ఆచార్యులు జెఎల్ సిమన్సేన్ సంయుక్తంగా చేసిన ఆలోచన తర్వాత కాలంలో ప్రతి ఏటా సైన్స్ కాంగ్రెస్ పేరున శాస్త్రవేత్తల సమ్మేళనం జరగడానికి కారణమైంది. తొలుత కొన్ని విభాగాలతోనే అది మొదలైనా క్రమంగా విస్తరించడం, దానికి తోడుగా స్వాతంత్ర్యోద్యమం కూడా కలవడం వల్ల అది మరింత బలపడింది. 1930 నుంచి ప్రాధాన్యత మరింత స్పష్టంగా పెరుగుతూ వచ్చింది. మరీ ముఖ్యంగా 1937లో జవహర్ లాల్ నెహ్రూ ఈ సమావేశాల్లో పాల్గొని సైన్సు ప్రాధాన్యత ఏమిటో, సమాజ నిర్మాణంలో అది ఎటువంటి పాత్ర పోషించగలదో వివరించిన ప్రసంగానికి చాలా ప్రాధాన్యత ఉంది. 1947 దాకా బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతీయ, ఐరోపా శాస్త్రవేత్తల కలయిక వేదికగా కొనసాగుతూ ఉండెడిది. కానీ తర్వాత కాలం లో ఈసమావేశాల్లో చేసిన ప్రతిపాదనల కారణంగానే పర్యావరణం సంబంధించి, సముద్ర వనరుల వినియోగం గురించి ప్రత్యేక దృష్టి సారించిన కారణంగానే తర్వాతి కాలంలో అవి ప్రత్యేక మంత్రిత్వ శాఖలుగా కూడా పరిణమించడం ఓ చరిత్ర. నాలుగు దశాబ్దాల క్రితం విశాఖపట్నంలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ప్రతి ఏటా ఒక ప్రత్యేక లక్ష్యంతో జరగాలని నిర్ణయం తీసుకోవడంతో దానికి తగ్గట్టుగా జరుగుతున్నాయి. ఇంత ప్రాధాన్యత ఉన్నా విమర్శలు కూడా క్రమంగా పెరుగుతూ వచ్చాయి. గట్టి కృషి కన్నా వట్టి ప్రచార పటాటోపమే ఎక్కువ అని, ఇంకా ఇది ఒక సైన్స్ కుంభమేళా వంటి సమ్మేళనమని కూడా తరచూ వినపడింది. అవినీతి ఆరోపణలు కూడా బాగానే ఉన్నాయి. అంతర్గత సంస్కరణల గురించి పట్టించుకోవడం లేదు. సైన్స్ కాంగ్రెస్ -2017ను నిర్వహించాల్సిన తమిళనాడులోని యూనివర్శిటీలో జరిగిన ఆర్థికపరమైన అవకతవకల కారణంగా అర్థాంతరంగా వేదికను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మార్చారు. కరోనా 2021, 2022 లలో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరగలేదు. గత ఏడాది నాగపూర్లో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాని నరేంద్ర మోడీ వర్చ్యువల్గా ప్రారంభించారు. జనవరి 2024లో జరిగే సైన్స్ కాంగ్రెస్కు ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు ఉండబోదని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ గత సెప్టెంబర్లో స్పష్టం చేయడంతో తొలుత సైన్స్ కాంగ్రెస్ వేదికగా నిర్ణయమైనా లక్నో యూనివర్శిటీ వెనకడుగు వేసింది. ఆ తర్వాత ముందుకొచ్చిన లవ్లీ యూనివర్శిటీ సైతం కొద్ది రోజుల ముందే చేతులెత్తేయడంతో మరో వేదిక ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాలేదు. వీలైతే వచ్చే నేల జరిపేందుకు నిర్వహణకు ముందుకు వచ్చే సంస్థలకు విజ్ఞప్తి చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ సక్సేనా ప్రకటించారు. ఐదు రోజుల పాటు సైన్స్ కాంగ్రెస్ జరిపే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ 5 కోట్లు ఇస్తుంది. సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి భారతీయ అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాలను జరుపుతుంది. తమ స్వతంత్ర నిర్వహణను కాపాడుకునేందుకు ప్రభుత్వ జోక్యాన్ని నిరసిస్తూ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ కోర్టు మెట్లు కూడా ఎక్కాల్సి వచ్చింది. ఏదిఏమైనా రాజకీయ వివాదాల సుడిగుండంలో ప్రతిష్ఠాకరమైన ఇండియా సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు అంతరించి పోనున్నాయా?

# ఉష్...అది ఆయుష్...!.?

### ప్రభుత్వం మారినా పాతవాసనలే..!
### అడ్డగోలు జి,ఓకు బలవుతున్న బడుగులు
### అంతా వారి కనుసన్నల్లోనే...
### అడిగితే అవమానాలు..వేధింపులు
### తీరు మారని ఆయుష్కు చికిత్స అత్యవసరం

ఆయుష్ శాఖ అంటే ఒకప్పుడు నిఖార్సైన శాఖ,రోగుల సేవ తప్ప మరో ధ్యాసలేని వైద్యులు,సిబ్బంది..అటెండర్ స్థాయి నుంచి డైరక్టర్ దాకా వారి వారి పనులు వారు నిశ్చింతగా చేసుకుంటూ పోయేవారు.అన్ని వ్యవస్థలలోనూ జోక్యం చేసుకుని వాటిని సర్వనాశనం చేసిన గత ప్రభుత్వం ఈ ఆయుష్లోనూ వైరస్లా జొరబడిరది. అలోపతి వైద్యవిధానంలో సైతం నయం కాని చాలా జబ్బులను నయం చేసే ఆయుష్ విభాగం తన శాఖలో జొరబడిన వైరస్ను కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటినా ఏమీ చేయలేని దుస్థితిలో వుంది.వై.ఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ హయాంలో తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలతో ఆయుష్లో వైద్యం తక్కువ వేదన ఎక్కువగా మారింది. మందుల కొనుగోలు, ఇష్టా రీతిన బదిలీలు,డెప్యుటేషన్లు చేపట్టి ప్రశాంతంగా వుండేశాఖలోఅలజడులుసృష్టించారు.చివరకు ఆయుష్ శాఖలో ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, అనుకూలమైన ప్రదేశాలకు బదిలీలకు కూడా గండి కొడుతూ 16.03.2024 న తీసుకువచ్చిన జి.ఓ 53 పూర్తిగా ఆయుష్ ఉసురుతీసేలా మారింది,ఈ జి.ఓ వల్ల ఎక్కువగా నష్టపోతున్నది ఎస్సీ,ఎస్టీ మైనారిటీలే.

ఆయుష్ శాఖలోని ఎస్సీ,ఎస్టీలకు చెందాల్సిన ఉన్నత పోస్టులను ఇతర పోస్టులకు మారుస్తూ గత ఆయుష్ కమిషనర్ 2024 ఏడాది ఫిబ్రవరిలో ఓ ప్రతిపాదన చేయడంతో అప్పటి ప్రభుత్వం ఆఘ మేఘా ల మీదఆయన ప్రతిపాదనలను కనీసం పరిశీలించకుండా, దాని లో టుపాట్లను ఏమాత్రంపరిగణనలోకి తీసుకోకుండా 16.03.2024న జి.ఒ.ఎం.ఎస్ నెం.53 ను విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోగుట్టుచప్పుడు లేకుండా తీసుకువచ్చిన ఈ జి.ఓ వల్ల అప్పటిదాకా కొనసాగుతున్న హేతుబద్ధత లేకుండా పోయింది.

ఆయుష్లో కేడర్ స్ట్రెంత్ విషయానికి వస్తే ఆరు పోస్టుల విభజనలో

4 ప్రాంతీయ ఉపసంచాలకుల పోస్టుల్లో రెండు పోస్టులు ఆయు ర్వేదం,ఒక పోస్టు యునాని,మరొకటి హోమియోకు కేటాయించారు. ఉదాహరణకు కర్నూలు జిల్లా బనగానిపల్లె ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి చీఫ్మెడికల్ ఆఫీసర్ పోస్టు జిల్లా అదనపు డైరక్టర్ ( ఆయుర్వేదం) గా అప్గ్రేడ్ చేయబడిరది.

ఇన్స్పెక్టర్ పోస్ట్ 2005 మార్చి 14న జారీ చేసిన జి.ఓ 67 ప్రకారం బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ కు చెందినది,1956లో ఆయుష్ శాఖ ఏర్పడిన తరువాత ఇన్స్పెక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్యులతో భర్తీ చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క యునానీ మెడికల్ స్టోర్ కూడా లేదు.ఆయుర్వేదం విషయానికి వస్తే రాష్ట్రవ్యాప్తంగా అనేక ఫార్మసీలు, డిస్పెన్సరీలు,ఆసుపత్రులు వుండటంతో ఇన్స్పెక్టర్ పోస్టును ఆయుర్వేద వైద్యులతో భర్తీచేశారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన ఉద్యోగ విభజనలో ఇన్స్పె క్టర్బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ పోస్టులను ఆయుర్వేద వైద్య విధానం కోసం రాష్ట్రానికి కేటాయించారు. ఇన్స్పెక్టర్ బోర్డ్ఆఫ్ఇండియన్ మెడిసిన్ తోపాటు తత్స మానమైనసూపరింటెండెంట్ /సి.ఎం.ఓ/ ఆర్.ఎం.ఓ పోస్టులుకేంద్రంసూచించిన మార్గనిర్దేశనంలో పేర్కొన బడ్డాయి.ఈ కేడర్ స్ట్రెంత్ 4గా మారుతుంది.

ఇదిలా వుండగా రీజన్ డిప్యూటీ డైరక్టర్ పోస్టులు నాలుగు ఆంధ్రప్రదేశ్కు 2 పోస్టులు తెలంగాణకు కేటాయించారు.ఆ నాలుగు రీజనల్ డిప్యూటీ డైర్టర్ పోస్టులను ఆయుర్వేదం,యునానీ,హోమియో విభా గాలకు 2:1:1 నిష్పత్తిగా పంపిణీ చేశారు.దీంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించేది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 53 జి.ఓ ప్రకారం పరిపాలనా విభాగం పూర్తిగా గందరగోళంగా మారింది.యునానిలో ఆసు పత్రీలేదు, ఫార్మసీలేదు అయినా 2023లో జరిగిన సాధారణ బదిలీలలో ఇన్స్పెక్టర్ బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ పోస్టు యునాని విభాగంతో భర్తీ చేశారు. దీంతో కేడర్ స్ట్రెంత్ నాలుగుకు పడిపోయింది, కేడర్స్రెంత్ 6 కంటే తక్కువ వుంటే పదోన్నతులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించదు,దీని పర్యవసానంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ,ఎస్టీల కేడర్ తగ్గి వారు రూల్ ఆఫ్ రిజర్వేషన్కు దూరం అయ్యారు. ఇది ఒక రకంగా రాజ్యాంగం ఎస్సీ.ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రక్రియకు విఘాతం కలి గించడమే అవుతుంది.ఇన్ని సున్నితమైన అంశాలను పక్కనబెట్టి మొండిగా ఈ జి.ఓను అప్పటి ప్రభుత్వంలో అమలుచేసిన కీలక అధికారులే ఇప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.జి.ఓ నెం53 మీద అనేక మంది అనేక రకాలుగా తమ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా అవి ప్రభుత్వ పెద్దలదాకా వెళ్ళ కుండా చేయడంలోనూ ఆ కీలక అధికారులు తమ చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

కేవలం కొందరు వ్యక్తుల ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే ఈ జి.ఓ తీసుకువచ్చి కొన్ని పోస్టులను తొలగించారు.ఈ జి.ఓను కూడా ఎన్నికల నియమావళి అమలులో వున్నపుడు నోట్ఫైల్ ద్వారా కేబినెట్ ఆమోదం తీసుకుని అమలుచేయడం వెనుక ఎందరు పెద్దల హస్తం వుందోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ చీకటి జి,ఓ వెనుక ఎ.పి సెక్రటేరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడుగా అప్పట్లో పనిచేసిన వెంకటరామిరెడ్డి కీలక పాత్ర పోషించా రన్నది నిర్వివాదాంశం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నియమితులైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికీ ఆ శాఖ మీద పూర్తి పట్టు సాధించలేదు.ఆయన మాట కీలక అధికారులు పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.శాఖలో పెత్తనం అప్పుడూ..ఇప్పుడూ ఒకరిద్దరు కీలక అధికారులదే. వీరు తమ శాఖలో ఎన్ని లొసుగులు వున్నా వాటిని తమ పలుకుబడితో కప్పేస్తుంటారని ఆ శాఖలో ఎవరిని అడిగినా చెబుతారు.సాక్షాత్తూ ముఖ్యమంత్రిని కూడా తప్పుదోవ పట్టించే శక్తి సామర్థ్యాలున్న కీలక అధికారుల విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే ఉద్యోగుల్లో తీవ్ర నిరసనలు ఎదురవ్వక తప్పదు.

#### మందుల కొనుగోలులో దారుణాలు

ఇక గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో మందుల కొనుగోలు అంశలో కూడా అనేక అక్రమాలు జరిగాయి. ఆయుష్ మందుల కొనుగోలు కోసం జగన్ ప్రభుత్వం గోవాకు చెందిన ఓ కంపెనీ నుంచి 20 కోట్లతో కొనుగోలు చేశారు.ఈ కంపెనీకి మన ప్రభుత్వం ఆర్డ్స్ ఇచ్చే నాటికే పలు రాష్ట్రాలు ఆ కంపెనీని బ్లాక్లిస్టులో పెట్టాయి.ఇక్కడ ఇంకో ముఖ్య మైన అంశం పరిశీలిస్తే ఆ కంపెనీ మందులు సరఫరా చేయక మునుపే మొత్తం నగదును చెల్లించేశారు.దీని వెనుక అప్పటి సి.ఎం.ఓలో ఓ కీలక అధికారితో పాటు,వైద్య ఆరోగ్యశాఖ,ఆయుష్ విభాగంలోని కీలక అధికారుల పాత్ర వుందని తెలిసింది.గత ప్రభుత్వ హయాంలో ఆయుష్ విభాగంలో కీలక అధికారిగా వున్న ఓ అధికారి కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా మూడునెలల పాటు కొనసాగారు.మందుల కొనుగోలు విషయంలో వచ్చిన ఆరోపణలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశింగా 14 డిస్పెన్సరీలలో తనిఖీలు చేయగా అసలు చాలా చోట్ల మందులే కని పించలేదు.విశాఖపట్టణం,ఏలూరు,ఒంగోలు,కడప ప్రాంతీయ విభాగాల పరిధిలో విచారణ మొదలు కాగానే కొందరు ఉన్నతాధికారుల ఒత్తిడితో ఆ విచారణ అర్ధంతరంగా ముగిసింది. అప్పటికే విచారణ బృందం శాంపుల్గా చేసిన తనిఖీలలో దాదాపు 2 కోట్ల రూపాయల విలువచేసేమందులు కనిపించలేదు. ఇక పూర్తి స్థాయిలో విచారణచేసి వుంటే మరింత అవినీతి బయటపడేది.

ఇక మరో అంశం విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదం,యునాని వైద్యవిధానాలను గ్రామీణుల చెంతకు ఆశా వర్కర్ల ద్వారా తీసుకువచ్చేందుకు దాదా పు 5 కోట్ల రూపాయలు కేంద్రం నిధులు మంజూరు చేసింది.ఈ నిధులు పూర్తిగా తమకు కావాల్సిన వారికి దొడ్డిదారిన చెల్లించి తూతూ మంత్రంగా ఈ కార్యక్రమాన్ని ముగించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచి వున్న ఆయుష్లో కీలక అధికారి కూటమి ప్రభుత్వలోనూ తన హవా కొనసాగించారు.చివరకు కొందరు మహిళా ఉద్యోగుల ఫిర్యాదుతో అతనని తప్పించి మరొకరిని కూటమి ప్రభుత్వం నియమించింది,ఎంతో ఉన్నతాశయంతో ఏర్పడ్డ ఆయుష్ విభాగానికి మంచి నిబద్ధత కలిగిన అధికారి అప్పగించి తిరిగి గాడిన పెట్టాలని,ఆ దిశగా ప్రభుత్వం యోచిస్తుందని ఆశిద్దాం.

# ఆదివాసీలపై వరాల జల్లు...

### అధికారికంగా కొమురం భీం జయంతి.. వర్ధంతిx
### ఆదివాసీలపై పెట్టిన ఉద్యమ కేసులు ఎత్తివేస్తాం...
### ఆదివాసీ విద్యార్థులకు వంద శాతం ఓవర్షిప్ స్కాలర్షిప్లు
### x ప్రతి నాలుగు నెలలకోసారి నాయకులతో సమావేశం
### ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
### గోండీ భాషలో బోధనపై సమగ్ర నివేదికకు ఆదేశం




సాగుకు ఉచితంగా సోలార్ పంపు సెట్లుహైదరాబాద్: ఆదివాసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి.. వర్ధంతిని అధికారికంగా (స్టేట్ ఫంక్షన్గా) నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వుల జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ప్రాంతాల్లో రవాణా, సాగు, తాగునీటి సరఫరా, తమపై నమోదైన, నమోదవుతున్న కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. ప్రతి సమస్యను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారు లేవనెత్తిన పలు సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపారు. మరికొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇది తొలి సమావేశం మాత్రమేనని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు సీఎం తెలిపారు. ఏడాదికి మూడు సార్లు జరిగే సమావేశాల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రాబోయే కాలంలో పరిష్కరించుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామని ఆదివాసీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభయమిచ్చారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని... ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు దిగవద్దని సీఎం సూచించారు. ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదయితే భవిష్యత్లో అవి వారి ఉద్యోగ అవకాశాలకు గండిపెడతాయని సీఎం తెలిపారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని.. ఈవిషయంలో అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాను పీసీసీ అధ్యక్షునిగా అయిన తర్వాత తొలి సమావేశం ఇంద్రవెల్లిలోనే పెట్టానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీ నాయకులకు గుర్తు చేశారు. నాటి సమావేశంలో తన దృష్టికి వచ్చిన ఇంద్రవెల్లి అమరుల స్మృతివనం ఏర్పాటు, అమరుల కుటుంబాలకు ఇళ్ల మంజూరు వంటి వాటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేశామని సీఎం తెలిపారు. రాజకీయాలపరంగా ఆదివాసీలకు అన్యాయం చోటుచేసుకుండా చూస్తున్నామని, సీతక్కను ఆదిలాబాద్ జిల్లాకు ఇన్ఛార్జిగా మంత్రిగా పెట్టామని ముఖ్యమంత్రి అన్నారు.



# శాస్త్రి మృతిపై తీరని సందేహాలు

భారత దేశ మలి ప్రధాని, స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు, జై జవాన్ జై కిసాన్ నినాదంతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై సందేహాలు తీరనే లేదు. తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడినా, అది ప్రణాళికా బద్ధమైన హత్యగా చర్చకు తెర లేపింది. 1965 ఆగస్టులో, పాకిస్తాన్ తన సేనలను ప్రయోగించి జమ్మూ కాశ్మీరులోని కచ్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. తద్వారా జమ్ము కాశ్మీరులోని ప్రజలు ఉద్యమించి, భారతదేశం నుండి విడిపోతారని ఆశించింది. పాకిస్తాన్ ఆక్రమణ గురించి తెలుసుకున్న లాల్ బహదూర్ శాస్త్రి వెంటనే త్రివిధ దళాలకు నియంత్రణ రేఖను దాటి లాహోరును ఆక్రమించు కోవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. భారత సైన్యం విజయానికి చేరువలో ఉండగా శాస్త్రి పై అమెరికా తీవ్ర ఒత్తిళ్లు తెచ్చింది. 1965 యుద్ధం తీవ్రస్థాయికి చేరిన సమయంలో పాకిస్థాన్– అమెరికా, భారత్– అమెరికా మధ్య జరిగిన పలు దౌత్య కార్యక్రమాలు జరిగాయి. యుద్ధంలో పాక్ ఓటమి దశకు చేరిన సమయంలో నాటి పాక్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, విదేశాంగమంత్రి జుల్ఫీకర్ అలీ భుట్టోలను పాక్‌లో అమెరికా రాయబారి వాల్టర్ ప్యాట్రిక్ మెక్‌కోటే కలిసి యుద్ధ విరమణకోసం చర్చలు జరిపారు. ఈ దశలో ఐక్యరాజ్య సమితి పాక్‌తో విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. ఈ దశలో ఒప్పందానికి అంగీకరించే విధంగా శాస్త్రిపై తాష్కెంట్‌లో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు ఉన్నాయి. 1965 లో పాకిస్తాన్తో కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత, శాస్త్రి, అయుబ్ ఖాన్ తాష్కెంట్ లో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. 1966 జనవరి 10న ఒప్పందాలపై సంతకాలు చేసిన మర్నాడే జనవరి 11న ఆయన హృద్రోగంతో అక్కడే మృతి చెందాడు. ఓ దేశాధినేత అదీ మరో దేశానికి అతిథిగా ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు వెళ్ళి అక్కడే అసహజ, అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం చరిత్రలో అంతకు ముందెప్పుడూ లేదు. ఈ మరణం హృద్రోగం వల్ల సంభవించిందని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం దీన్నే ధ్రువీకరించింది. అనుమానాలు వ్యక్తం అయినా శాస్త్రి భౌతిక ఖాయానికి పోస్టుమార్టం నిర్వహించ లేదు. అంతకు ముందెప్పుడూ శాస్త్రికి ఎలాంటి అనారోగ్యం లేదు. విషప్రయోగం వల్లే శాస్త్రి మరణించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. శాస్త్రి ఆఖరుగా ఆయన కుమార్తె సుమన్‌తో మాట్లాడాడు. పాలుతాగి పడుకుంటానని చెప్పాడు. ఈలోగా ఫోన్‌లైన్ డిస్కనెక్ట్ అయింది. తర్వాత దాదాపు పదిహేను నిమిషాలకు పైగా సుమన్ లైన్ కోసం ప్రయత్నించింది. ఆ తర్వాత లైన్ దొరికింది కానీ శాస్త్రి ఎత్తలేదు. సోవియట్‌కు చెందిన ఓ అధికారి ఫోన్ ఎత్తాడు. మీ తండ్రిగారు ఇప్పుడే మరణించారని సుమన్‌కు చెప్పాడు. అంతవరకు ఎలాంటి అరోగ్యకర ఇబ్బందుల్లేని వ్యక్తి 15 నిమిషాల్లో మృతి చెందినట్లు చెప్పాదంపై సందేహాలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. శాస్త్రి వెంట ఆయన వ్యక్తిగత వైద్యుడు ఆర్ఎన్ చుగ్ కూడా తాష్కంట్ వెళ్ళాడు. అతనూ పక్కగదిలోనే ఉన్నా, కనీసం శాస్త్రికి గుండెపోటు వచ్చిందన్న విషయాన్ని ఆయనకు కూడా సోవియట్ అధికారులు వెల్లడించలేదు. మరణించిన తర్వాతే ఆ విషయాన్ని చెప్పారు. భారత్‌కు తెచ్చిన శాస్త్రి భౌతిక కాయం నీలంరంగులోకి మారి ఉంది. శరీరంపై కొన్ని గాట్లు కూడా గమనించినట్లు ఆయన భార్య లలితాశాస్త్రి గుర్తించారు. శాస్త్రి విష ప్రయోగం వల్ల మరణించాడని ఆయన భార్య లలితా శాస్త్రి ఆరోపించింది. 1978 లో క్రాంత్ ఎం.ఎల్.వెర్మా హిందీలో "లలితా కె ఆంసు" పేరుతో పుస్తకాన్ని రాసి ప్రచురించాడు. ఈ పుస్తకంలో శాస్త్రి మరణం గురించి విషాద కథ లలిత శాస్త్రిచే వ్యాఖ్యానించ బడింది. ఆయన మరణం చుట్టూ ఇప్పటికీ సందేహాలు ఉన్నాయి. ఆయన కుమారుడు సునీల్ శాస్త్రి, తండ్రి మరణానికి వెనుక ఉన్న మర్మాన్ని తెలియ చేయ వలసినదిగా ప్రభుత్వాన్ని కోరాడు. 1966 లో ఆయన మరణం తరువాత భారత దేశానికి తీసుకువచ్చిన భౌతిక కాయంపై నీలం రంగు మచ్చలు, కొన్ని గాట్లు ఉన్నట్లు అనుమానాలను వ్యక్త పరిచాడు. పోస్టు మార్టం చేయ బడనప్పటికీ శరీరంపై గాట్లు ఏర్పడానికి కారణాన్ని గూర్చి అడిగాడు. శాస్త్రి మనవడు సంజయ్... తమ తాతకు తాష్కెంట్‌లో హోటల్ బుక్ చేయాలనుకుని, ఆయనకు సోవియట్ ప్రభుత్వం ఒక కాటేజ్ కేటాయించిందని, అందులో టెలీప్రింటర్, టెలిఫోన్ కూడా లేవని పేర్కొన్నారు. మృతదేహం దిల్లీకి వచ్చినప్పుడు చూస్తే ఆయన నోరు, ముక్కు నుంచి రక్తం కారడం కనిపించిందని, ఆయన ఒంటిపై గాట్లు ఉన్నాయని, అమ్మమ్మ నెయ్యిలో ఆయన చేతులను ముంచిం పెదాలకు నెయ్యి పూస్తే నెయ్యి నీలిరంగులో కనిపించిందని, ఆయన వ్యక్తిగత డైరీ, ఆయన రోజువారి కార్యక్రమాలను రాసుకొనే యాక్షన్ ప్లాన్ పుస్తకం కనిపించలేదని సంజయ్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. 1977లో శాస్త్రి మరణంపై దర్యాప్తుకు ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు డాక్టర్ చుగ్ బయలు దేరాడు. కారులో ఢిల్లీ వైపు ప్రయాణిస్తుండగా ఎదురుగా ఓ లారీ వచ్చి ఢీ కొనగా, చుగ్ అక్కడి కక్కడే మరణించాడు. అలాగే శాస్త్రి వ్యక్తిగత సేవకుడు రామ్‌నాథ్ కూడా ఆయనతో పాటు తాష్కంట్ వెళ్ళాడు. మృతదేహం వెంటే ఆయనా తిరిగొచ్చాడు. ఆయనను కూడా కమిటీ సాక్షిగా పరిగణించింది. వాంగ్మూలం నమోదుకు పిల్చింది. మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని తన నివాసం నుంచి ఆయన ఒక్కడుగు బయట కేయగానే ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌నాథ్ రెండుకాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన గతాన్ని మర్చిపోయాడు. తాష్కెంట్ ఒప్పందం గూర్చి శాస్త్రి రష్యా వెళ్ళిన తరువాత పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ నుండి పాకిస్థాన్ భవిష్యత్తులో భారత్ పై బలగాలను ఎప్పుడూ ప్రయోగించ రాదనే వాగ్దానాన్ని కోరాడు. కానీ చర్చలు కొనసాగలేదు. తరువాత రోజు శాస్త్రి మరణించాడు. భారత ప్రభుత్వం ఆయన మరణం గురించి ఎటువంటి సమాచారం అందించలేదు. భారత దేశంలో ఈ కుట్ర జరిగే సాధ్యాసాధ్యాలను "అవుట్ లుక్ మ్యాగజైన్" ప్రచురించింది. 2009లో దక్షిణాసియాపై సిఐఎ దృష్టి పేరిట అనుజ్‌ధార్ అనే రచయిత పుస్తకం రాసేందుకు ఉపక్రమించాడు. ఇందుకోసం శాస్త్రి మరణానికి సంబంధించిన పత్రాలు కావాలంటూ సమాచార హక్కు చట్టం క్రింద భారత ప్రధాని కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వీటి జారీకి పిఎమ్ఓ నిరాకరించింది. పైగా ఈ పత్రాల జారీ భారత సార్వ భౌమత్వానికి, అంతర్గత భద్రతకు, ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. సిఐఎ ప్రమేయాన్ని కూడా తక్కువగా అంచనా వేయలేం. పైగా ఆ సమయంలో సిఐఎలో డైరెక్టర్ ఆఫ్ ప్లాన్స్‌గా ఉన్న రాబర్ట్ క్రోలీ అమెరికాకు చెందిన గ్రెగరీడగ్లస్ అనే జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తూ శాస్త్రితో పాటు భారత అణు పితామహుడు డాక్టర్ హోమీబాబా మరణాలకు సిఐఎ ప్రణాళికలు రచించి అమలు చేసిందని వెల్లడించారు. అయితే తన మరణానంతరమే ఈ ఇంటర్వ్యూను ప్రచురించాలని ఆయన డగ్లస్‌ను కోరాడు. శాస్త్రి, హోమీబాబా మరణాలు ఒకే నెలలో జరిగాయి. రెండింటికి మధ్య రెండు వారాల వ్యవధే ఉంది. పైగా ఈ రెండు దేశానికి వెలుపలే చోటు చేసుకున్నాయి. 60వ దశకంలో అమెరికాకు సహకరించని వివిధ దేశాల నేతల్ని హతమార్చడం సిఐఎ పనిగా పెట్టుకుంది. దీనిపై కేంద్రం రాజ్‌నారాయణ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం నివేదిక ఇప్పటివరకు వెలుగు చూడలేదు. ఆఖరికి ఇది భారత పార్లమెంట్ లైబ్రరీలో కూడా అందుబాటులో లేదు.

## ఇంటి పేరును విక్టరీగా మార్చుకున్న వీరమాచనేని

వి.మధుసుదనరావు (వీరమాచనేని మధుసూదనరావు) తెలుగు సినిమా ప్రముఖ దర్శకులు.తెలుగు సినీ రంగంలో అర్థ శతాబ్దం పాటు ఎన్నో చిత్రాలకు దర్శకునిగా పని చేసి, విజయవంతం కావడానికి కృషి సల్పి, విజయం సాధించి, "విక్టరీ" మధుసూదన్ రావుగా పేరు గాంచారు. ప్రజానాట్య మండలి నేపథ్యం నుంచి సినిమా రంగానికి వచ్చిన ఉత్తమ కళా పిపాసి ఆయన. తెలుగు చిత్ర సీమలో మకుటం లేని మహారాజులుగా చెలామణి అయిన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లతో ఎన్నో విజయ వంతమైన చిత్రాలు తీశారు. తరవాతి కాలంలో శోభన్ బాబు, కృష్ణం రాజు, కృష్ణ వంటి హీరోలతో ఎన్నో చిత్రాలను అందించి, సక్సెస్ఫుల్ డైరెక్టర్ గా గుర్తింపు పొందారు.1962 లో సూపర్ స్టార్ కృష్ణని పరిచయం చేస్తూ "పదండి ముందుకు" తీశారు.హీరోలు నాగార్జునను "విక్రం" ద్వారా, జగపతి బాబును "సింహ స్వప్నం" ద్వారా,రమేష్ బాబుని "సమ్రాట్" చిత్రం ద్వారా తెలుగు వెండి తెరకు పరిచయం చేశారు. ప్రముఖ దర్శకులైన కె.రాఘవేంద్ర రావు, కోదండ రామిరెడ్డి, పి.సి.రెడ్డి, శేఖర్, బోయిన సుబ్బారవు, వంశీ, శివ నాగేశ్వరరావు, మున్నగు వారు ఈయన దగ్గర శిష్యరికం చేసినవారే.విక్టరీ" నే యింటి పేరు చేసుకొన్న వి.మధుసూదన రావు గారు 1923 జులై 27 జన్మించి లో కృష్ణా జిల్లాలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. ఆ తరువాత మద్రాసు వెళ్లి ఐ.ప్రసాద్, తాతినేని ప్రకాశరావు వంటి వారి పరిచయంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయన కె.ఎస్.ప్రకాశరావు వద్ద చలనచిత్రీకరణ పాఠాలు నేర్చుకొని, 1958 లో చదలవాడ కుటుంబరావు నిర్మించిన "సతీ తులసి" పౌరాణిక చిత్రానికి మొదటిసారిగా దర్శకత్వం వహించి, దర్శకుడయ్యారు. కమ్యూనిస్ట్ భావజాలం ఒంట పట్టించుకున్న ఆయనకు తొలి సినిమాగా 'సతీ తులసి' పౌరాణిక సినిమా దర్శకత్వ అవకాశం రావడం యాదృచ్ఛికమే అయినా, చిత్తశుద్ధితో, వృత్తి నిబద్ధతతో కృషి చేసి, విజయం సాధించడం విశేషం. ఆయన తీసిన ప్రతీ భక్తి రస ప్రధాన పౌరాణిక చిత్రాలు ఘనవిజయం సాధించడం ఆయన అంకితభావానికి నిదర్శనం. ఆ తరువాత వి.బి.రాజేంద్ర గారి "జగపతి" వారి "అన్నపూర్ణ" సినిమాకు దర్శకత్వం వహించగా అది 100 రోజులు నడిచి విజయవంత మయింది. ఒక దశలో జగపతి సంస్థకు మధుసూదనరావు గారే రెగ్యులర్ దర్శకుడు. మద్రాసు నుండి హైదరాబాద్ వచ్చి మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ స్థాపించి ఎంతో మందిని నటులుగా తీర్చి దిద్దారు. 1964 లో తనతో పాటు ప్రజా నాట్య మండలిలో పనిచేసిన సరోజినిని ఆదర్శాలకు కట్టుబడి వివాహం చేసుకున్నారు. ఆమె తరువాత పూర్తిగా మహిళలతో సినిమా తీసి గిన్నిస్ రికార్డుకి ఎక్కారు. తెలుగు చలన చిత్ర సీమలో 50 సంవత్సరాలుగా కొనసాగుతూ నాలుగు భాషలలో కలిపి 71 చిత్రాలకు దర్శకత్వం వహించి "వీరమాచనేని"కి బదులు "విక్టరీ" నే ఇంటి పేరుగా చేసుకున్నారు. రక్తసంబంధం, ఆరాధన, ఆత్మబలం, గుడిగంటలు, మంచి కుటుంబం, లక్ష్మీ నివాసం, కళ్యాణ మంటపం, మంచి రోజులు వచ్చాయి, కృష్ణవేణి, జేబుదొంగ, చక్రధారి, ఎదురీత, విచిత్ర జీవితం, అంగడిబొమ్మ, మల్లెపూవు, శివమెత్తిన సత్యం, సంసారం, సంతానం, విక్రమ్, సామ్రాట్ , ప్రాణ స్నేహితులు, ఆత్మకథ, సింహస్వప్నం, పాపే మా ప్రాణం లాంటి 23 సినిమాలు రీమేక్ చేయగా, అన్ని విజయ వంతం కావడం గమనార్హం. నవలలని సినిమాలుగా మలిచి ప్రజాదరణ పొందడంలో అందెవేసిన చేయిగా ఖ్యాతిని ఆర్జించారు. సతీ తులసి (1959), వీరాభిమన్యు (1965), ట్యాక్సీ రాముడు (1961), ఆరాధన (1962), పదండి ముందుకు (1962), రక్త సంబంధం (1962), లక్షాధికారి (1963), ఆత్మ బలం (1964), అంతస్థులు (1965), గుడి గంటలు (1965), మంచి కుటుంబం (1965), ఆస్తి పాస్తులు (1966), డ్రైవర్ ఆనంద్ (1966), జమీందార్ (1966), లక్ష్మీ నివాసం (1968), అదృష్ట వంతులు (1968), ఆత్మీయులు (1969), మనుషులు మారాలి (1969), లవ్ కుశ్ (హింది), దేవి (1970), సమాజ్ కొ బదల్ డాలో (1970)), కళ్యాణ మండపం (1971), మంచి రోజు లొస్తాయి (1972), కన్న కొడుకు (1973), భక్త తుకారాం (1973), కృష్ణవేణి (1974), ప్రేమలు పెళ్ళిళ్ళు (1974), జేబు దొంగ (1975), చక్రధారి (1977), ఎదురీత (1977), ఈ తరం మనిషి (1977), అంగడి బొమ్మ (1978), మల్లెపూవు (1978), జూదగాడు (1979), శివమెత్తిన సత్యం (1979), ఛండీ ప్రియ (1980), జీవిత రథం (1981), పులి బిడ్డ (1981), బంగారు కానుక (1982), విక్రమ్ (1986), సామ్రాట్ (1987), కృష్ణగారి అబ్బాయి (1989) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తన 95వ ఏట, 2012 జనవరి 11న అనారోగ్యంతో మరణించారు.



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:గోషామహల్ నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రీ డివిజన్ నవ్‌బాత్‌పాడ్ బస్తీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యాక్రమంలో పాల్గోన్న గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులు రాధాక్రిష్ణ జీహెచ్ఎంసీ అధికారులు భాస్కర్ , రమేష్, యూసూబ్

## డిజిటల్ యుగంలోనూ శ్రమ దోపిడీ

ఒక నిస్సహాయ దుర్భర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తి శ్రమను ఉచితంగా లేదా అత్యల్ప వేతనమిచ్చి దోచుకోవడం, వెట్టిచాకిరి, బంధించి లేదా భయపెట్టి గృహ పనులను చేయించుకోవడం, బలవంతంగా పడుపు వృత్తిలోకి దించి వ్యాపారం చేయడం, మోసం చేస్తూ బలహీనులను వాడుకోవడం, మానవ హక్కుల హననాలు లాంటి చర్యలను "మానవ అక్రమ రవాణా"గా పేర్కొంటాం. నేటి అత్యాధునిక సమాజంలో కూడా ఇలాంటి భయంకర, అభ్యంతరకర దురాచారాలు కొనసాగడం అత్యంత ఆక్షేపణీయం. ఈ దురాచారాలు నేడు విశ్వవ్యాప్తంగా కొనసాగడం, మిలియన్ల అభాగ్యుల జీవితాలు చీకట్లోనే కలిసి పోవడం జరుగుతున్న సమయంలో ఇలాంటి మానవ అక్రమ రవాణా, అపరిమిత శ్రమ దోపిడీలను సామాన్య ప్రజానీకానికి అవగాహన పర్చడానికి అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన "జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం" వేదికలను ప్రతి ఏట 11 జనవరిన పలు దేశాల్లో నిర్వహించడం ఆనవాయితీగా మారింది. బలవంతంగా అతి కష్టమైన పనులను అక్రమార్కులు తమ స్వార్థం కోసం చేస్తుండడం, ఎదిరించిన కుటుంబాలను సహితం బెదిరించడం లేదా హింసించడం, మహిళల్ని బలవంతంగా పడుపు వృత్తిలోకి దించి వ్యాపారాలు చేయడం, శ్రమకు తగిన వేతనాలు చెల్లించకపోవడం, కనీస ఆహారాన్ని అందించకపోవడం, నిద్రకు కూడా తగు సమయం ఇవ్వకపోవడం, బయటి ప్రపంచానికి దూరంగా చీకటి గదుల్లో బంధించడం, వారి గుర్తింపును దాచడం, పాస్‌పోర్ట్/వీసా లాంటివి లాక్కోవడం లాంటి మానవ అక్రమ రవాణా దురాగతాలు జరుగకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నప్పటికీ సాధారణ పౌర సమాజ చొరవ కూడా అవసరం అవుతుందని గమనించాలి. జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం–2025 థీమ్‌గా "అక్రమ రవాణా లోపాలను సవరిస్తూ బలమైన సమాజ నిర్మాణం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. మానవ అక్రమ రవాణా, శ్రమ దోపిడీలను తగ్గించడానికి లేదా నివారించడానికి స్థానిక సమాజ చొరవ, కార్యకర్తలను శిక్షణలు, సమాచార వ్యాప్తి, బాధితులను ఆదుకోవడం, దోపిడీ ముంగిట్లో నిలబడిన అభాగ్యుల రక్షణ, అవసర నైపుణ్యాలు, గుర్తించే నెట్‌వర్క్ వ్యవస్థల స్థాపన, ప్రభుత్వంతో పౌర సమాజం కలిసి పని చేయడం, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంస్థల చొరవ, పాలసీలను రూపొందించి అమలు పరచడం, విద్యావంతుల విస్తృత ప్రచారం, అక్రమార్కులకు కఠిన శిక్షలు అమలు పరచడం లాంటి పలు చర్యలు దోహదపడతాయి. మానవ అక్రమ రవాణా, శ్రమ దోపిడీల పట్ల అవగాహన కలిగి ఉండడం మనందరి కనీస పాత్ర. మానవ హక్కులకు పట్టం కట్టడం, అక్రమార్జనపరుల భరతం పట్టడం, 11 జనవరి రోజుల బ్లూ రంగు దుస్తులు ధరించి అన్యాయానికి గురవుతున్న అభాగ్యులకు మన సంఘీభావాలను వ్యక్తం చేయడం మరిచి పోరాదు. శ్రమ దోపిడీ కనిపించని ప్రపంచ నిర్మాణంలో మనం కూడా భాగం అవుదాం, చీకటి గుహల్లో మగ్గుతున్న అస్థిపంజరాల జీవితాల్లో వెలుగులు నింపుదాం.

## పర్యావరణానికీ రాజకీయాలు..

తీవ్ర వాతావరణ సంఘటనల సంవత్స రంగా, అత్యంత ఉష్ణోగ్రతల కాలంగా చరిత్రలో నిలిచిపోతూ 2024 మన నుంచి సెలవు తీసుకుంది. ఎప్పుడూ ఎరగని వడగాడ్పులు, భయంకరమైన చలిగాలులు మనల్నే కాదు శ్రీలంక, మాల్దీవుల్ని కూడా ఈ ఏడాది అతలాకుతలం చేశాయి. మొన్నటికి మొన్న 'ఫంగల్' తీరం దాటుతున్నప్పుడు పాండిచ్చేరిలో ఒకేసారి 50 సెంటీమీటర్ల వర్షం కురిసింది! 2023లో ఆకాశానికి రంధ్రం పడినట్లు ఒకే రోజు 95 సెంటీమీటర్ల వాన కాయపట్నాన్ని (తూత్కుడి) ముంచెత్తింది! ప్రతి ఏటా ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్పంలో సగటున ఇలాంటి నాలుగు తుఫాన్లు తప్పవని ఇటీవల భారత వాతావరణ శాఖ మొహమాటం లేకుండా ప్రకటించింది. ఇక మొత్తం భూమండలాన్ని పలిశీలిస్తే 1.5 డిగ్రీలకు మించి భూమి ఉష్ణోగ్రత పెరగరాదని మనం పెట్టుకున్న లక్ష్మణ రేఖ ఉత్తుత్తి గీతగా మిగిలిపోయిందనీ, 2035 నాటికి 3.1 సెల్సియస్ డిగ్రీలు పెరిగినా ఆశ్చర్య పోనక్కరలేదని హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే ఆంత్రోపోసిస్ యుగం మనల్ని అంతుబట్టని తీరాలకు చేర్చడం ఖాయం. మాంట్రియల్ ప్రోటోకాల్ (1989) ముందుకు తెచ్చిన ఓజోన్ పొర రక్షణ, క్యోటో ప్రోటోకాల్ (2005) ప్రతిపాదించిన గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు, పారిస్ ఒప్పందపు (2016) ఉష్ణోగ్రతల తగ్గింపు, గ్లాస్గో క్లైమేట్ ప్యాక్ లోని శూన్య ఉద్గార దేశాలకు నష్టపరిహార చెల్లింపు వంటివి పర్యావరణ ప్రియులందరూ గొప్ప మైలురాళ్ళుగా చెప్పుకుంటారు. వాటి విలువను తక్కువ అంచనా వెయ్యలేము. మొన్నటికి మొన్న 'బాకు' నగర అంతర్జాతీయ సదస్సులో ఆమోదించిన 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కార్బన్ మార్కెట్' స్థాపన, కార్బన్ ఉద్గారాల నికర డేటా డాక్యుమెంటేషన్ వ్యవస్థ ఏర్పాటు కూడా గొప్ప ముందడుగుగా భావించవచ్చు.

కానీ పేద దేశాలకు అందించే నష్టపరిహారంపై ధనిక దేశాలు గొప్ప ఉదారతను ప్రదర్శించినట్టు అంతర్జాతీయ మీడియా కొనియాడ్డమే ఆశ్చర్యం కలిగిస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షైన్ బమ్ (ఆమె పర్యావరణ శాస్త్రవేత్త కూడా) లాగా 2050 నాటికి తాము శూన్య ఉద్గార దేశంగా మారి తీరుతామని బల్ల గుద్ది మరీ చెప్పిన అధినేత ఒక్కరంటే ఒక్కరూ లేరు. అలాగే 2040 కల్లా బొగ్గు గనులన్నీ మూసేస్తామని చెప్పిన ఇండోనేషియా లాంటి దేశం ధనిక దేశాల్లో ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఉద్గారాల వరుసలో ముందున్న 24 దేశాలన్నీ పేద దేశాలకు ఆర్థిక సాయం గురించి మాట్లాడాయే తప్ప 'నెట్ జీరో' సాధిస్తామని మాట వరసకైనా చెప్పలేదు. "మేం పర్యావరణ ధ్వంసం చేస్తాం. పేద దేశాలు విలవిలలాడుతాయి. వాటికి అంతో ఇంతో సాయం చేస్తాం" ఇదీ వాటి తీరు! ఇక నష్టపరిహారం కిందా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసమూ ఇస్తామంటున్న నిధులు కూడా బ్యాంకులో, కార్బన్ మార్కెట్లో, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సమకూరుస్తాయి తప్ప ప్రభుత్వాలు మాత్రం పూర్తి బాధ్యత తీసుకోవట! విచిత్రం ఏమంటే సంపన్న దేశాల్లో ఎంత శాస్త్ర సాంకేతికత పెరిగినా కర్బన ఉద్గారాలేమీ తగ్గడం లేదు. ఉద్గారాల 'లెక్కల్లో లాఘవం' మాత్రం పెరుగుతోంది. ఏకీకృత అంతర్జాతీయ వ్యవస్థ ఏదీ మన భూగోళం గురించి పట్టించుకునేది లేకపోవడం పెద్ద విషాదం.ఇక కాప్ 29 సదస్సులో ఆయిల్ గ్యాస్ కంపెనీల అధినేతలు "మేం లేకుంటే మానవుడు మళ్ళీ గుహల్లో బతకాల్సిందే" అంటూ ప్రారంభ సభలోనే బెదిరింపులకు దిగడం విచిత్రాల్లోకల్లా విచిత్రం. కాలం అలా వుంది మరి! ఎప్పుడూ ఎరగని అసమానతల వైపరీత్యం ఒకవైపు, బహుళ జాతి కంపెనీల విశ్వరూపం మరోవైపు, పర్యావరణ సమస్యనే అంగీకరించని నాయకులు పీఠాలెక్కడం ఇంకోవైపు ముప్పేట ముసురుకొస్తున్న కాలం మనది. ఇలా ప్రకృతి నియమాలూ పర్యావరణ రాజకీయాలూ శత్రు శిబిరాలుగా మారిన కాలం మనది. సమస్య మన అభివృద్ధి నమూనాలో, ఆర్థిక విధానాల్లో, మితవాద రాజకీయ పోకళ్ళలో వుందని చెప్పే వారే కరువైన కాలం కూడా మనది.

దీనికి సమాధానంగా ప్యారిస్ పరిసరాల్లో పదేళ్ళ క్రితం ఏడు రోజుల పాటు స్వేచ్ఛగా చర్చోప చర్చలు జరిపిన దేశ విదేశీ విద్యార్థులు "అందరూ అడిగే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు సముద్రాలూ అమెరికాను నిలదీస్తాయి. వాతావరణమూ చైనాను నిగ్గదీస్తుంది" అంటారు. చూడ్డానికిది భావకవిత్వంగా కనిపించ వచ్చునేమో గాని ఇలాంటి భావితరం కన్నా పుడమి తల్లి రక్షణకు ప్రస్తుతానికి భరోసా ఎక్కడుంది?

# ఆ పది మందికి మంత్రులకు డేంజర్ బెల్స్

విజయవాడ, జనవరి 10 ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొందరు మంత్రులతో ప్రభుత్వానికి తలనొప్పులు తప్పడం లేదు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధుల వంటి విషయాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల కంటే కొందరు మంత్రుల వ్యవహారాలకే జనంలో ఎక్కువ పబ్లిసిటీ లభించింది.

ముఖ్యమంత్ర పదేపదే చెబుతున్నా వాటిని పట్టించుకోకుండా సాగిస్తున్న వ్యవహారాలతో చికాకులు తప్పడం లేదు.ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం అంత సులువుగా ఏమి జరగలేదు. ఐదేళ్ల ప్రతి పక్షంలో సవాళ్లు, అవమానాలు, కష్టాలని అధిగమించి అధికారంలోకి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు 53 రోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఆర్నెల్ల లోనే ఈ విషయాలు మర్చిపోయినట్టు వ్యవహరిస్తున్నారు.అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ముఖ్య మంత్రి పదేపదే చెబుతున్నా కొందరి తీరు మాత్రం మారడం లేదు. ఆర్నెల్లలోనే దాదాపు పది మందికి పైగా మంత్రుల పని తీరుపై తీవ్ర ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వారి పేర్లపైనే ఎందుకు చర్చ జరుగుతోందనే వాదన కూడా లేకపోలేదు. ఇప్పటి వరకు ఆరోపణలు వచ్చిన వారంతా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే కావడం మరో రకమైన చర్చకు కారణం అవుతోంది.ఏపీ మంత్రుల్లో అందరి కంటే ముందు రవాణా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అందరికంటే ముందు వార్తల్లో నిలిచారు. మంత్రి భార్య ఎస్కార్ట్‌గా రాలేదని పోలీస్ అధికారిని దుర్భాషలాడటం చర్చనీయాంశం అయ్యింది. ఆ తర్వాత అదే బాటలో ఇతర మంత్రులు నడిచారు.ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో చాలామంది తొలిసారి మంత్రి పదవుల్ని దక్కించుకున్న వారే ఉన్నారు. సీనియర్లను కాదని జూనియర్లకు మంత్రి పదవులు ఇస్తే వారంతా సొంత వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రులంతా అదే ఫాలో అవుతున్నారు. ఏదొక వివాదాన్ని తలకు ఎత్తుకుంటున్నారు.రామ్ ప్రసాద్ రెడ్డి తర్వాత వాసం శెట్టి సుభాష్ వ్యవహార శైలిపై టీడీపీ అధినేత చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీనియర్లను కాదని టీడీపీల వాసంశెట్టి సుభాష్‌కు అవకాశం కల్పించడంతో సొంత పార్టీ నేతలు ఆయనకు వ్యతిరేకంగా మారారు. ఆ తర్వాత మంత్రి పార్ధ సారధి, హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సివిల్ సప్లైస్ మంత్రి నాదెండ్ల, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇలా ఒకరి తర్వాత ఒకరు కూటమి పార్టీల్లో నేతలు వార్తల్లో నిలిచారు.అయా శాఖల్లో అవినీతి వ్యవహారాలపై పత్రికల్లో ప్రముఖంగా కథనాలు రావడమో, మంత్రులు సంబంధం లేని వ్యవహారాల్లో తల దూర్చి బొప్పి కట్టించుకోడమో జరిగాయి. కొన్ని శాఖల్లో మంత్రులు శృతి మించి సంపాదనపై పడ్డారనే ప్రచారం జరగడంతో ప్రభుత్వానికి ఆర్నెల్లలోనే బోలెడు అప్రతిష్టను మూటగట్టేలా చేసింది. పోస్టింగులు, ప్రమోషన్లలో కొందరు మంత్రులు గల్లాలు తెరవడం, ఆ విషయాలు బయటకు పొక్కడం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేలా చేసింది.అయితే మంత్రుల అవినీతి వ్యవహారాల్లో కొందరి పేర్లే ప్రముఖంగా బయట ప్రచారం జరగడం కూడా వ్యూహాత్మకమేనని భావన కూటమి పార్టీ నేతల్లో ఉంది.

అయా పార్టీల్లో అంతర్గతంగా ఉన్న పరిస్థితులతో పాటు సమయం దాటిపోతే మళ్లీ అవకాశం వస్తుందో రాదోననే ఆందోళనతోనే మంత్రులు రెచ్చిపోతున్నారనే వాదన ఉంది.ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో తాము చేసిన పొరపాట్లు, తప్పుల్ని కవర్ చేయడానికి కులం, సామాజిక కార్డులను తెరపైకి తీసుకురావడం కూడా అయా పార్టీలకు కొత్త చిక్కులకు కారణమవుతోంది. తాము మాత్రమే తప్పు చేస్తున్నామా, మిగతా వారు శుద్ధపూసలా తరహా చర్చలతో ప్రధానంగా టీడీపీ ఇరకాటంలో పడుతోంది. కీలక శాఖలు, బాధ్యతలన్నీ కొందరి చేతుల్లో ఉంటే నిధులు లేని, ప్రాధాన్యత శాఖలపై ప్రచారం ఏమిటని వాదిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావంతో పాటు కూటమి పార్టీల తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# పార్టీలో నేతలు చెరో దారి

కాకినాడ, జనవరి 10, తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా పేరు పడింది. పార్టీ పుట్టినప్పటి నుంచి 1999, 2019 మినహా ప్రతి ఎన్నికలోనూ టిడిపినే ఇక్కడ గెలిచింది. పార్టీ కష్టాల్లో ఉన్న 2004,2009లో సైతం కొవ్వూరులో తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అలాంటి చరిత్ర ఉన్న కొవ్వూరులో టీడీపీని చేజేతులా పార్టీ అధిష్టానమే నాశనం చేసుకుంటుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కారణం అక్కడ పార్టీలో పెరిగిపోయిన వర్గ పోరు.. కుమ్ములాటలు.కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరైనా అక్కడ శాసనం మాత్రం దొమ్మేరు దివాణందే. దొమ్మేరు జమీందార్లుగా పేరున్న పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు), ఆయన సోదరుడు అచ్చిబాబు చెప్పిన మాటే వేదంగా అక్కడ చెల్లుబాటు అయ్యేది. కృష్ణ బాబు ఐదుసార్లు కొవ్వూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొవ్వూరు ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అప్పటి నుంచి టీవీ రామారావు, ఖా జవహర్, తానేటి వనిత (వైసీపీ), ముప్పిడి వెంకటేశ్వర రావు కొవ్వూరు నుంచి గెలిచారు. వీరి గెలుపు వెనుక ఉన్నది పెండ్యాల కుటుంబమే అన్నది బహిరంగ రహస్యం. దాదాపు 23 ఏళ్ళు ఓంం గా పని చేసిన చరిత్ర ఉన్న కృష్ణ బాబు అనూహ్యంగా 2012లో వైసీపీలో చేరారు. దీంతో కంగారుపడిన టిడిపి శ్రేణులకు ఆయన సోదరుడు అచ్చిబాబు అండగా నిలబడ్డారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఖా జవహర్ టీడీపీ నుంచి గెలిచి మంత్రి అయ్యారు. 2019లో జగన్ హవాలో తానేటి వనిత కొవ్వూరులో గెలిచి హోం మంత్రి అయ్యారు. ఆ గెలుపు వెనక ఉన్నది కృష్ణ బాబు అల్లుడు రాజీవ్ కృష్ణ అని ఆయన వర్గం ప్రచారం చేసుకుంది. ఆ టైంలో వైసిపిలో రాజీవ్ కృష్ణ ఒక వెలుగు వెలిగారు. అయితే 2024లో సీన్ మారింది. కూటమి ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఇక్కడ నుంచి గెలిచారు. ఆ గెలుపునకు అచ్చిబాబు మద్దతు తోడ్పడింది. ఈ తరుణంలో కృష్ణబాబు మృతి చెందడం, ఆయన అల్లుడు రాజీవ్ కృష్ణ టిడిపి గూటికి చేరడం జరిగిపోయాయి. అయితే ఈ చేరిక తనకు తెలియకుండానే జరిగిందని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తనను కలిసిన కార్యకర్తలతో చెప్పినట్టు తెలుస్తోంది. అటు అచ్చిబాబు కూడా అధిష్టానం వైఖరితో అలకబూనారు. 2019-24 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నప్పుడు వారికి అండగా నిలబడింది స్థానిక తెలుగుదేశం నాయకులు.

అయితే తమకు తెలియకుండా రాజీవ్ కృష్ణను అధిష్టానం పార్టీలో చేర్చుకోవడంపై వారు మనస్థాపం చెందినట్టు చెబుతున్నారు. ఎవరైతే తమని ఇబ్బందులు పెట్టారో వాళ్లకి పార్టీలో పెద్దపీట వేయడం ఏంటనేది వారి వాదన. మరోవైపు అన్ని సర్దుకుంటాయని పార్టీ హై కమాండ్ భావిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆలా కనిపించడం లేదు. మొదటి నుంచి మాజీ మంత్రి జవహర్‌ను కొవ్వూరు టీడీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు రాజీవ్ కృష్ణ, జవహర్ ఏకం అయ్యారు అనేది వారి వెర్షన్. రాజీవ్ కృష్ణ, జవహర్ ఆశీస్సులతో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు వెలియడాన్ని సాక్ష్యంగా చెబుతున్నారు. నిజానికి 2024లో కొవ్వూరు సీటు తనకే అని జవహర్ భావించారు. 2019 ఓటమి తర్వాత టిడిపిలో బలంగా వాయిస్ వినిపించిన వాళ్లలో ఆయన ఒకరు. కానీ గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధిష్టానం ఎమ్మెల్యే సీటు ఇవ్వడంతో జవహర్ సైలెంట్ అయ్యారు. అంతా చల్లబడింది అనుకున్న సమయంలో కొవ్వూరులో కొత్త గ్రూపులు బయలుదేరడం నియోజకవర్గంలో కుమ్ములాట్లకు కారణమైంది. వైసీపీని ఇబ్బందులు పెట్టాలనుకునే ప్రయత్నంలో ఆ పార్టీ నాయకులను ఆకర్షించి సొంత పార్టీలో కుమ్ములాట్లకు కారణం అవుతోంది అద్దిష్టానం అనేది కొవ్వూరు పరిస్థితులను గమనిస్తున్న వారి విశ్లేషణ. టిడిపి హై కమాండ్ మేల్కొని కొవ్వూరు గ్రూపు తగాదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టకపోతే పార్టీ కంచుకోటగా ఉన్న కొవ్వూరు చేజారిపోయే ప్రమాదం లేకపోలేదు.

# తొక్కిసలాట వెనుక అనుమానాలు

తిరుపతి, జనవరి 10, తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించిన ఘటన అందరినీ కలచి వేసింది. నిజంగా ఇది దురదృష్టకరమే. కానీ ఇందులో గత ప్రభుత్వం నిర్వాకం కారణం కూడా ఉందన్నది వాస్తవం. గతంలో ఎన్నడూ లేని విధంగా 2019 నుంచి 2024 మధ్య కాలంలోనే తిరుమలలో ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో వైకుంఠ ఏకాదశికి ఒకరోజు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఉండేది. అదీ కాకుంటే మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ దర్శనాలు కొనసాగేవి. భక్తుల రద్దీని బట్టి వైకుంఠ ద్వార దర్శనాన్ని పొడిగించేవారు. కానీ గత ప్రభుత్వం దీనిని పూర్తిగా మార్చివేసింది. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భక్తులకు సౌకర్యం కల్పించడం మాట దేముడెరుగు కానీ.. టీటీడీ ఆదాయాన్ని పొందడానికేనన్నది వాస్తవం. ఎంత మంది భక్తులు వస్తే అంత హుండీ నిండుతుందన్న కారణంతోనే అత్యాశతో గత ప్రభుత్వం ఈ ఆనవాయితీని తొలిసారిగా ప్రారంభించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిని కంటిన్యూ చేసింది. దీంతో పాటు గత ప్రభుత్వం వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుపతిలో ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించింది. అసలు తిరుమలలో శ్రీవెకంటేశ్వరస్వామి కొలువై ఉంటే తిరుపతిలో టిక్కెట్లను ఎందుకు విక్రయిస్తున్నారన్నది ఆ వెంకటేశ్వరస్వామికే ఎరుక. ఈ సంప్రదాయాన్ని కూడా ఈ పాలకమండలి కంటిన్యూ చేయడంతోనే ఈ ఘోర దుర్ఘటన తలెత్తింది. నిజానికి తిరుమలలో ఎన్ని గంటలైనా భక్తులు వేచి చూస్తూ క్యూ లైన్ లో శ్రీవారిని దర్శంచుకునే వారు. అక్కడ తొక్కిసలాట సమస్య ఉండదు. బ్రహ్మోత్సవాల సమయంలోనూ తిరుమలకు లక్షల సంఖ్యలో గరుడ వాహన సేవరోజు వచ్చినా ఇలాంటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదు.కారణంగానే ఈ ఘటన జరిగిందని చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం అంగీకరించారు. అది ఈ పాలకవర్గం చేసిన తప్పు అని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మరొక అనుమానం కూడా అందరిలోనూ నెలకొంది. కావాలని ఈ దుర్ఘటనకు బాధ్యులు అయిన వారు పోలీసుల్లో ఉన్నారా? అన్న అనుమానం కూడా పాలకపక్షం నుంచి వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు పదకొండు వందల మంది అక్కడ ఉన్నప్పటికీ దుర్ఘటన జరిగిందంటే ఏదో బలమైన కారణం ఉండి ఉంటుందన్న వారి అనుమానాన్ని జ్యుడిషియల్ విచారణలోనే తేలనుంది. మొత్తం మీద తిరుపతి ఘటనపై జగన్ బ్యాచ్ చుట్టూ అనేక అనుమానాలు కలుగుతున్నాయి.అంటే పోలీసుల్లోనే జగన్ అంటే అభిమానం ఉన్న వారు ఈ పనికి పాల్పడ్డారా? అన్నది విచారణలో తేలనుంది. బుడమేరు విజయవాడను ముంచెత్తినప్పుడు కూడా ఇదే తరహా ఆరోపణలు వినిపించాయి. కృష్ణా బ్యారేజీ వద్ద బోట్లు అడ్డుకట్ట వేసి గేట్లు విరగేటట్లు కొందరు ప్రయత్నం చేశారని అప్పట్లో అధికార పార్టీ నేతలు ఆరోపించారు. ఆ బోటును అక్కడి నుంచి తొలగించడానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అలాగే గేటును పునర్నించేందుకు అష్టకష్లాలు పడాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా తిరుపతి ఘటనపై కూడా అలాంటి అనుమానాలు కలుగుతున్నాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. పోలీసులు కావాలనే తొక్కిసలాటకు కారణమయ్యారని ప్రత్యక్ష సాక్షులతోపాటు బాధితులు కూడా చెబుతున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

# అడ్డంగా బుక్కైన పేర్ని నాని

విజయవాడ, జనవరి 10, మాజీ మంత్రి పేర్ని నాని చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. రేషన్ బియ్యం పక్కదారిపై పోలీసులకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. మచిలీపట్నంలోపౌరసరఫరాల శాఖకు సంబంధించి గోదాములు దాదాపు 7వేల బస్తాల బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఆ గోదాములు పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పేర్ని నాని భార్యతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజ కు సైతం నోటీసులు జారీ చేశారు. అటు పేర్ని నాని భార్య పోలీస్ విచారణకు సైతం హాజరయ్యారు. ఇంకోవైపు నానికి సైతం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ తరుణంలో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా.. బియ్యం పక్కదారి పట్టించినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకోసం మినీ వ్యానులను వాడినట్లు తెలుస్తోంది.పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఇక్కడ గోదాములు ఉన్నాయి. వైసిపి హయాంలో పౌరసరఫరాల శాఖకు ఈ గోదాములను అద్దెకు ఇచ్చారు. రేషన్ బియ్యం ఈ గోదాముల్లో నిల్వ చేస్తుంటారు. వీటికి మేనేజర్ గా మానస తేజ్ ఉన్నారు. ఆయన నెలవారి జీతం 12 వేల రూపాయలు. అయితే ఒకేసారి మానస తేజ అకౌంట్ నుంచి పేరుని నాని ఎకౌంటుకు లక్ష 75 వేల రూపాయలు బదిలీ చేయడంపై అనుమానాలు ఉన్నాయి. తన యజమాని భర్తకు అంత మొత్తంలో మేనేజర్ పంపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మానస తేజ అకౌంట్లో సుమారు 25 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు కూడా గుర్తించారు. అందులో ఆయన వ్యక్తిగత అవసరాల కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు కూడా పోలీస్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. తక్కువ జీతానికి పనిచేస్తున్న మానస తేజకు అంత మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు విచారణ చేపడుతున్నారు. పోలీసులకు కీలక ఆధారాలు లభించడంతో.. కోర్టు అనుమతితో ఒకరోజు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ బ్యాంకులో నగదు లావాదేవీల విషయంపై ప్రశ్నించినట్లు సమాచారం. మేనేజర్ మానస తేజ తో పాటు డ్రైవర్ మంగారావు, మిల్లర్ ఆంజనేయులను పోలీసులు విచారించారు. అయితే మేనేజర్ పోలీస్ విచారణకు సహకరించలేదని తెలుస్తోంది. దీంతో నిందితులను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మంత్రిగా ఉంటూ పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన చుట్టూ ఈ కేసు తిరుగుతోంది. అయితే నిందితులు పేర్ని నాని పేరు ఎక్కడ బయట పెట్టడం లేదు. రేషన్ బియ్యం తరలించడంలో మాజీమంత్రి నానికి సంబంధం లేదని.. తామే విక్రయించామని వారు పోలీసులకు చెబుతున్నారు. ఇంతటి భారీ మొత్తంలో బియ్యం తరలించడం అక్కడ పనిచేసే వారితో సాధ్యం కాదని.. కచ్చితంగా నాని హస్తం ఉందని అనుమానిస్తున్నారు. అందుకే ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. మొత్తానికైతే ఈ రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# టీడీపీకి తొక్కిసలాట బాధ

తిరుపతి, జనవరి 10, ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని మానని గాయాలు ఉంటాయి. మరపురాని సంఘటనలు ఉంటాయి. కానీ టిడిపి ప్రభుత్వహయాంలో గోదావరి పుష్కరాలతో పాటు తాజాగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఒక మాయని మచ్చ. 2015, జూలై 14న గోదావరి పుష్కరాల తొలి రోజున తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది గాయపడ్డారు. ఇందులో మహిళలతో పాటు చిన్నారులే అధికంగా ఉన్నారు. తాజాగా తిరుపతిలోజరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయితే ఇది అనుకోకుండా జరిగిన ప్రమాదాలే అయినా.. రెండు ఘటనలు టిడిపి ప్రభుత్వ హయాంలో జరగడం విశేషం.నాడు టిడిపి అధికారంలో ఉంది. మహా పుష్కరాల పేరుతో నెలల తరబడి అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే తొలి రోజు పుష్కర స్నానాన్ని ప్రారంభించాలనుకుని భావించారు సీఎం చంద్రబాబు. ఆయన పుష్కర స్నానం చేసిన కొద్దిసేపటికి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 52 మంది గాయపడ్డారు. చంద్రబాబు ప్రచార యావ కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అప్పట్లో దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కు పుష్కర క్రతువును చిత్రీకరించే బాధ్యతను అప్పగించినట్లు ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలోనే పుష్కర ఘాట్లో తన కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు పుష్కర స్నానం ఆచరించారు. దాదాపు రెండు గంటలపాటు ఆయన ఘాట్లోనే ఉండిపోవడంతో జన రద్దీ పెరిగిందని.. దానికి కారణంగానే ఒక్కసారిగా తూపులాట జరిగిందన్నది విపక్షాల ఆరోపణ. నాడు చంద్రబాబుతో పాటు మంత్రుల కాన్వాయ్ లో 20 వాహనాలు ఘాట్లో గంటల ఉండిపోయాయని కూడా ఆరోపణలు వెల్లువెత్తుతాయి. అప్పట్లో చంద్రబాబు సర్కార్ రిటైర్డ్ జడ్జి సోమయాజులతో కూడిన ఏకసభ్య కమిషన్ ను వేసింది. అయితే నాటి పుష్కర వీడియోలు బయటకు రాకపోవడం విశేషం.తెలుగుదేశం కూటమి ప్రభుత్వంఉంది. ఈనెల 10 నుంచి తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీకి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది టీటీడీ. అయితే ఒక్కసారిగా ఇక్కడ తొక్కిసలాట జరగడంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వంతో పాటు టీటీడీపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. ఈ సాయంత్రానికి కొందరు అధికారులపై వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు తిరుమల చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.అయితే కేవలం టిడిపి ప్రభుత్వ హయాంలోఇటువంటి ఘటనలు జరగడం మాయని మచ్చగా నిలుస్తోంది. చంద్రబాబుకు పాలనాథుడిగా పేరు ఉంది. కానీ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణలో లోపాలు వెలుగు చూస్తుండడం.. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుండడం మైనస్ గా మారుతోంది. అయితే ఈ ఘటన తర్వాత కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెరిగింది. దీనిని టిడిపి కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. మొత్తానికి అయితే ఇటువంటి ఘటనలు ఏ ప్రభుత్వం ఉన్నా మాయని మచ్చగా నిలవడం ఖాయం. గతంలో గోదావరి పుష్కరాలు టిడిపి ప్రభుత్వానికి మైనస్ చేశాయి. ఇప్పుడు తిరుపతిలో తొక్కిసలాట ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన కూటమి పార్టీల్లో కనిపిస్తోంది.

# ఏడు నెలల కాలం...మౌనమేలేనోయి..

విజయవాడ, జనవరి10, నసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా మారారు. వైసీపీని అధికారం నుంచి దించి కూటమి ప్రభుత్వాన్ని ఏపీలో తేవడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అయితే పదేళ్ల నుంచి ప్రశ్నించడానికే వచ్చానన్న పవన్ కల్యాణ్ కేవలం జగన్ ను మాత్రమే ప్రశ్నిస్తూ పాలనలో లోపం జరిగినా, ప్రభుత్వ వైఫల్యం జరిగినా ఆయన పట్టించుకోవడం లేదు. ప్రశ్నించడం పూర్తిగా మానేసినట్లుందని నెట్టింట విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం పవన్ కల్యాణ్ పొగడ్తలకే పరిమితమయ్యారంటున్నారు. ఏడు నెలల కాలంలో కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదన్న విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు. పవన్ కల్యాణ్ అంటే సినీ హీరో గా అందరికీ అభిమానం ఉంటుంది ఆయన రాజకీయ రంగంలోనూ అలాగే వెలుగొందుతారని అభిమానులు నమ్మకం పెట్టుకున్నారు. అలాగే సొంత సామాజికవర్గమైన కాపులు కూడా ఎన్నికలకు ముందు పవన్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాయిస్ మాత్రం పూర్తిగా మ్యూట్ అయిపోయింది. ఏ ఘటన జరిగినా కనీసం ముందుగా స్పందించే పవన్ తన ప్రభుత్వంలో జరిగిన ఘటనలపై మాత్రం పెదవి విప్పకపోవడాన్ని విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పార్టీ పదవుల విషయం సంగతి పూర్తిగా పక్కన పెట్టేశారని జనసేన నేతలే అంటున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా తమకు అన్యాయం జరిగిందని నేతలు భావిస్తున్నారుఇదే సమయంలో తిరుపతి తొక్కిసలాట జరిగి గంటలు గడుస్తున్నా పవన్ కల్యాణ్ స్పందించకపోవడంపై నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నీ ప్రశ్నలేమయ్యాయ్యా? అంటూ నిలదీస్తున్నారు. గేమ్ ఛేంజర్ ఈవెంట్ కు వచ్చి రోడ్డు ప్రమాదంలో అభిమానులు చనిపోతే గత వైసీపీ ప్రభుత్వం రోడ్లు వేయకపోవడమే కారణమని, అందుకే ప్రమాదం జరిగిందని అన్న పవన్ కల్యాణ్ తిరుపతి ఘటనపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలకు జనసేనాని వద్ద సమాధానం లేదు. ఆయన మౌనంగా ఉండటానికి కారణాలేంటని కూడా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ లో పుష్ప సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అందరినీ తప్పుపట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరని అడుగుతున్నారు. ఇక నిన్న విశాఖలో జరిగిన బహిరంగ సభలోనూ ప్రధాని మోదీని, ముఖ్యమంత్రి చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడానికే పవన్ కల్యాణ్ ఎక్కువ సమయం గడిపారని, అదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఊసు కూడా ఎత్తలేదంటూ కార్మిక సంఘాలు అంటున్నాయి. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు అప్పటి వైసీపీ ప్రభుత్వమే ప్రయివేటీకరణకు కారణమని పదే పదే విమర్శలు చేయడమే కాకుండా విశాఖకు వెళ్లి కార్మికుల ఆందోళనకు మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ కు ప్రధానిని సభలో ఆ విషయం అడగకుండా ఎందుకు ఉన్నారని కార్మిక సంఘాలు నిలదీస్తున్నాయి. అందుకే అధికారం అనేది ఎవరి చేతుల్లో ఉన్నా చేతులు, నోళ్లు మూతబడిపోతాయని అనుకోవడానికి పవన్ కల్యాణ్ ఉదాహరణ అని కామెంట్స్ వినపడుతున్నాయి.

# భక్తులతో కిటకిటలాడుతన్న వైష్ణావలాయాలు

తిరుపతి,భద్రాచలం, జనవరి 10, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో రద్దీ పెరిగింది. మరికాసేపట్లో వైకుంఠ ద్వారదర్శనానికి టోకెన్ తీసుకున్న భక్తులను అనుమతిస్తారు. పదిరోజులపాటు సాగే వైకుంఠద్వార దర్శనాల కోసం వేలాదిగా వస్తున్న భక్తులతతో తిరుమల కొండం కిక్కిరిసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల కొండలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మలయప్ప స్వామి స్వర్ణరథంపై దర్శనమిస్తారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాభయ్యాయి. ప్రసిద్ధ వైష్ణవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయాలకు క్యూ కట్టారు. శ్రీమన్నారాయణుడిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాచలం ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉత్తర ద్వారం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనమిస్తున్నారు. మరోవైపు గోదావరి నదిలో శ్రీ సీతారామ చంద్రుల వారు, లక్ష్మణుడు, హనుమంతుడి సమేతంగా హంసవాహనంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు రాములవారిని దర్శించుకున్నారు.యాదగిరిగుట్టలో గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇస్తున్నారు. ఉదయం 5:30 గంటలకు నుంచి స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇవాళ స్వామి వారికి గరుడు సేవత్సవం, తిరువీధిసేవ నిర్వహించనున్నారు.అటు, చిన తిరుపతిగా పిలిచే ఏలూరులోని ద్వారకా తిరుమలలో ఉత్తర ద్వారం గుండా చిన వెంకన్నను భక్తులు దర్శించుకుంటున్నారు. ఉదయాన్నే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోవింద నామ స్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి.

# స్టీల్ ప్లాంట్ పై నోరు విప్పని మోడీ



విశాఖపట్టణం, జనవరి 10, విశాఖలో ప్రధాని పర్యటన విజయవంతంగా పూర్తయింది. దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు సంబంధించి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. అంతకుముందు నగరంలో భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రధాని కీలక ప్రసంగం చేశారు. కానీ ఎక్కడా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేకుండా పోయింది. దీంతో కార్మిక, ఉద్యోగ వర్గాలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నాయి. రెండు లక్షల కోట్ల పెట్టుబడులు మాట దేవుడెరుగు.. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను మాత్రం ప్రైవేటీకరిస్తారా అని ప్రశ్నిస్తున్నారు కార్మిక వర్గాలు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై పవన్ చేసిన కామెంట్స్, ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నారు.ప్రభుత్వ హయాంలో కొన్నేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను( ప్రైవేటీకరిస్తామని ప్రకటించింది. అప్పటినుంచి కార్మికులతో పాటు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దాదాపు ఏడాదిన్నరకు పైగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధాని మోడీ పర్యటనతో దీనిపై స్పష్టతనిస్తారని అంతా భావించారు. కానీ ప్రధాని తన సుదీర్ఘ ప్రసంగంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించకపోవడం కార్మిక వర్గాల్లో ఆందోళనకు గురిచేస్తోంది. కూటమిలో మిత్రపక్షంగా ఉన్న పవన్ కళ్యాణ్, చంద్రబాబుఎలాగైనా ప్రధాని మోదీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని చెప్పిస్తారని కార్మికులు ఎంతగానో ఆశించారు. కానీ అటువంటిదేమీ లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ విషయంలో పవన్ తీరును విపరీతంగా ఆక్షేపిస్తున్నారు.వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీనిపై కార్మికులు ఉద్యమ బాట పట్టారు. ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఈ తరుణంలో జనసేన అధినేత పవన్ స్పందించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ చర్యలను తప్పు పట్టకుండా.. వైసిపి ప్రభుత్వ చర్యలను ఎండగట్టారు. వైసిపి తీరుతోనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని.. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని.. అవసరమైతే తమ గళాన్ని వినిపిస్తామని హామీ ఇచ్చారు పవన్ కళ్యాణ్ కానీ నిన్న జరిగిన సభలో కనీసం విశాఖ స్టీల్ ప్రస్తావన లేకుండా ప్రధాని ప్రసంగం ముగించడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు విశాఖ నగర ప్రజలు, ఉత్తరాంధ్రవాసులు. మరో ప్లాంట్ పై ఆందోళన అనకాపల్లిప్రాంతంలో మరో స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడంపై కూడా కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ నునిర్వీర్యం చేసేందుకే ఈ ప్రాంతంలో మరో ప్రైవేటు స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నారని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది బలిదానాలతో నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తీరును ఎండగడుతున్నారు. నిత్యం చంద్రబాబు భజన తోనే పవన్ సరిపెడుతున్నారని.. కనీసం విశాఖ స్టీల్ అంశాన్ని ప్రధానితో చెప్పించలేకపోయారని తప్పు పడుతున్నారు. ఈ విషయంలో పవన్ పై ముప్పేట విమర్శలకు దిగుతున్నారు.

# బాపట్లలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

గుంటూరు, జనవరి 10, పట్ల జిల్లాలుగా విడిపోయింది. గుంటూరు ఎంపీగా ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్ సెంట్రల్ మినిస్టర్ పదవి తగ్గించుకున్నారు. పల్నాడు ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు గెలిచారు. బాపట్ల ఎంపీగా మాజీ ఐపీఎస్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ కూటమి నుంచి విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు ఎంపీ స్థానాలను తెలుగుదేశం పార్టీనే కైవసం చేసుకుంది.గుంటూరు ఎంపీగా గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ తన పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు అందరితో కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నారు. ఏదైనా అధికార కార్యక్రమం గనుక గుంటూరులో నగరంలో జరిగితే తప్పకుండా ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరవుతున్నారు. ఒకటో రెండో సందర్భంలో తప్ప మిగిలిన సందర్భాల్లో వారి మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. పల్నాడు జిల్లాలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా నరసరావుపేటలో ఏదైనా కార్యక్రమం జరిగితే స్థానిక ఎమ్మెల్యేలతో కలిసికట్టుగా ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.గుంటూరుతో పోలిస్తే పల్నాడు జిల్లాలో అంతగా అందరు కలిసి పనిచేస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యేలు మాత్రమే కార్యక్రమాలకు హాజరవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఎంపీతో ఎలాంటి విభేదాలు లేకపోయినప్పటికీ పల్నాడు జిల్లాలో ఉన్న నేతలంతా కూడా సీనియర్లు అవ్వడంతో వారి కార్యక్రమాలు వాళ్లే నిర్వహించుకుంటున్నారు.బాపట్ల జిల్లాకు సంబంధించి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు.. బాపట్ల ఎంపీకృష్ణ ప్రసాద్‌ల మధ్య విభేదాలు ఉన్నట్లు సోషల్ మీడియా కోడై కూస్తుంది. అయితే దాన్ని ఎమ్మెల్యే ఖండిస్తున్నప్పటికీ ఎంపీ ఆ ప్రచారం గురించి అసలు పట్టించుకోవడం లేదు. అయితే గెలిచిన రోజు నుంచి బాపట్ల పరిధిలోని ఎమ్మెల్యేలకి ఎంపీకి కొంత డిస్టెన్స్ ఉందనేది మాత్రం వాస్తవం అంటున్నారు కూటమినేతలు.. మరీ తీవ్రస్థాయి విభేదాలు లేవు కానీ, ఏదో చిన్న గ్యాప్ ఉందని అందుకే ఆ ఇద్దరు కార్యక్రమాల్లో కలిసికట్టుగా పాల్గొనడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.గుంటూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పెమ్మసాని చంద్రశేఖర్ సెంట్రల్ మినిస్టర్‌గా ఉన్నా నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలందర్నీ కలుపుకుని వెళ్తున్నారు. ఎమ్మెల్యేలు కూడా ఆయనకు అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితేఅలాంటి పరిస్థితి బాపట్ల జిల్లాలో బాపట్ల పార్లమెంటు పరిధిలో లేదంటున్నారు. గతంలో బాపట్ల ఎంపీలుగా గెలిచిన అనేకమంది కేంద్ర స్థాయిలో కూడా చక్రం తిప్పిన వాళ్ళు ఉన్నారు.ప్రస్తుతం ఎంపీ కృష్ణ ప్రసాద్ రాజకీయాలకు కొత్త అయినప్పటికీ విద్యాధికులు కావడం, పోలీసు అధికారిగా రాజకీయాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తి కావడంతో బాపట్ల జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తారని అందరూ భావించారు. అయితే అలాంటి పరిస్థితి కనిపించడం లేదని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే అంటున్నారు. ఎంపీతో ఎమ్మెల్యేలు సమావేశాలు పెట్టుకోవడం.. ఎంపీ చొరవ తీసుకుని కోఆర్డినేషన్ మీటింగులు పెట్టడం కాని జరగకపోతుండటంతో ఎంపీకి ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ ఉందని గట్టిగా ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన వర్మ, ఎంపీ కృష్ణ ప్రసాద్‌ల మధ్య గ్యాప్‌పై తీవ్ర స్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే మాత్రం అటువంటిదేమీ లేదని ప్రెస్ మీట్ పెట్టి మరీ ఖండస్తున్నారు.అయితే ఎవరు ఏ కార్యక్రమంలో కలిసి పాల్గొనక పోవడం, ప్రజా సమస్యలకు సంబంధించి కీలకమైనటువంటి నిర్ణయాలు ఇద్దరు కలిసి తీసుకోకపోవడం వల్లే అలాంటి ప్రచారం జరుగుతుంని స్థానికులు అంటున్నారు. మరి ఆ ఇద్దరు అలాంటి ప్రచారాలకి ఫుల్‌స్టాప్ పెట్టేలా కలిసి కనిపిస్తారోలేదో చూడాలి.

## ఇండియా కూటమి రద్దేనా

న్యూఢిల్లీ, జనవరి 10, (న్యూస్ పల్స్) భారత కూటమిలో వచ్చిన బీటలు ఇప్పుడిప్పుడే బయటపడ్డాయి. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ తర్వాత, ఇప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో ఎజెండా లేదా నాయకత్వం లేదని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమి సభ్యులందరినీ సమావేశానికి పిలవాలని ఆయన అన్నారు. ఈ కూటమి లోక్‌సభ ఎన్నికలకే పరిమితమైతే దానిని త్వరలో ముగించాలన్నారు. కానీ అది అసెంబ్లీ ఎన్నికలు కూడా అయితే, మనం కలిసి కూర్చుని కలిసి పనిచేయాల్సి ఉంటుందని అబ్దుల్లా ఇక్కడ విలేకరులతో అన్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా బ్లాక్‌లో చీలిక తెరపైకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి సహా అనేక పార్టీలు కాంగ్రెస్‌ను దాటవేసి ఆప్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇండియా బ్లాక్ లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే అని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తనకు గుర్తున్నంత వరకు దానికి ఎటువంటి కాలపరిమితి నిర్ణయించబడలేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు అన్నారు. సమస్య ఏమిటంటే ఇండియా బ్లాక్ సమావేశాన్ని పిలవలేదు.ప్రధాన నాయకత్వం, పార్టీ లేదా భవిష్యత్తు వ్యూహం (ఇండియా బ్లాక్‌లో) ఎజెండా గురించి స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. పొత్తు కొనసాగుతుందా లేదా అనేది కూడా స్పష్టంగా లేదు. బహుశా ఢిల్లీ ఎన్నికల తర్వాత, ఇండియా బ్లాక్ సభ్యులను సమావేశానికి పిలిపించి, అప్పుడు పరిస్థితి స్పష్టమవుతుందని అబ్దుల్లా అన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్ కు పెరుగుతున్న మద్దతు గురించి మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ, “ఢిల్లీ ఎన్నికలతో మాకు ఎటువంటి సంబంధం లేదు కాబట్టి నేను ఇప్పుడే దాని గురించి ఏమీ చెప్పలేను” అని అబ్దుల్లా అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు బిజెపిని ఎలా బలంగా ఎదుర్కోవాలో నిర్ణయిస్తాయి. గతంలో కూడా ఢిల్లీలో ఆప్ రెండుసార్లు విజయం సాధించిందని అబ్దుల్లా పేర్కొంటూ, “ఈసారి ఢిల్లీ ప్రజలు ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాలి” అని అన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా అలయన్స్ ఓటమి తర్వాత, ఇండియా అలయన్స్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం గురించి ప్రశ్న లేవనెత్తుతూ ఇండియా బ్లాక్‌కు నాయకత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ తర్వాతే ఇండియా బ్లాక్ గురించి చర్చ మొదలైంది.

మోడీ చెప్పినట్టుగానే...

ఇండియా కూటమికి బీటలు వారాయి అని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహార సాగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల వరకే ఇండియా కూటమి అని అనుకుంటే తప్పనిసరిగా దాని మూసివేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి వ్యూహాలు రచించకపోవడం.. ఒకవేళ అవి రచించినా అమల్లో పెట్టకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రీయ జనతా నేత తేజస్వి యాదవ్ ఇండియా కూటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంటు ఎన్నికల వరకే ఇండియా కూటమి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలు తమ అవసరాల దృష్ట్యా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. కలిసి పోటీ చేయాలని సందర్భం వచ్చినప్పుడు.. ఒంటరిగానే ఎన్నికల బరిలో ఉండి.. తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చని పేర్కొన్నారు. తేజస్వి యాదవ్ ఈ వ్యాఖ్యలు చేయడంతో? జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ‘‘ ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇకపై ఆ కూటమి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. ఈ లెక్కన చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు నిజమవుతున్నాయి. ఇవే గనుక మునుముందు కొనసాగితే దేశంలో బలమైన ప్రతిపక్షం అంటూ ఉండదు. మోడీ ఆడుతున్న గేమ్లో ఇండియా కూటమి చిక్కి విలవిలలాడిపోవడం అత్యంత దారుణమని” రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# మళ్లీ వచ్చిపడుతున్న మాయదారి వైరస్ లు

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే ప్రపంచం. అందుకే ఇప్పుడు తుమ్మినా దగ్గినా భయం. రోగనిరోధక శక్తి తక్కువుంటేనో, సీజన్ మారితేనో.. చిన్నాచితకా అనారోగ్య సమస్యలు కామన్. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నాలుగురోజుల్లో అంతా నార్మల్. కానీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన తర్వాత ఇప్పుడు కాస్త పడిశం పట్టినా, గొంతు గరగరమన్నా గుండెల్లో దడే. కడుపులో కాస్త మందంగా అనిపిస్తే ఒకప్పుడు ఓ పూట పత్యంచేస్తే సెట్టయ్యేది. కానీ ఇప్పుడు ఏ దిక్కుమాలిన వైరస్ శరీరంలోకి ప్రవేశించిందోనని అనుమానం హార్ట్‌బీట్ పెంచేస్తోంది. ఏం చేస్తాం మరి.. మళ్లీ వచ్చిపడుతున్నాయ్ మాయరోగాలు.చైనాకు రోగమొచ్చింది. ప్రపంచమంతా వణికిపోతోంది. కేసుల ఊసులేదు. ఊహాజనిత ప్రచారాలే తప్ప అధికారికంగా మరణాల సంఖ్య కూడా తెలీదు. చైనాలో మెడికల్ ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారంటూ అనధికార వార్తలు. హెచ్‌ఎంపీ వైరస్ ..హ్యూమన్ మెటా న్యూమో వైరస్. కరోనాకి కజిన్‌లాంటిదే ఈ వైరస్ కూడా. కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది. లక్షల ప్రాణాలను గాల్లో కలిపేసింది. మరి హెచ్‌ఎంపీవీ కూడా అంతే ప్రమాదమా అంటే అవునని చెప్పలేం. ప్రాణాంతకం కాదని కొట్టిపారేయలేం. ఎందుకంటే కరోనా సీజన్‌లో భయమే మనిషిని చంపేసింది. కరోనా వేరియంట్లలాగే హెచ్‌ఎంపీ వైరస్ టార్గెట్.. మన శరీరంలోని ఊపరితిత్తులే. అసలే కరోనా ప్రభావంతో లంగ్స్ వీకైపోయాయి. ఈ టైంలో కొత్త వైరస్ ఎఫెక్ట్‌పడితే ఏం జరుగుతోందనని భయం.ఓపక్క వైరస్‌ల పుట్టినింట్లో హెచ్‌ఎంపీ వైరస్ కల్లోలం సృష్టిస్తోందన్న ప్రచారం జరుగుతున్న సమయంలోనే.. అగ్రరాజ్యంలో నోరో వైరస్ వణికిస్తోంది. మరోవైపు పక్షులు, పశువులకే పరిమితమనుకునే బర్డ్‌ఫ్లూతో అమెరికాలో తొలిసారి ఒకరు మృత్యువాత పడ్డారు. అడవి పక్షులకు దగ్గరగా వెళ్లడంతో హెచ్5ఎన్1 సోకి ప్రాణాలు కోల్పోయాడు 65ఏళ్ల వ్యక్తి. వాస్తవానికి కరోనా తర్వాత ప్రపంచమంతా అంతగా చర్చ జరుగుతోంది హెచ్‌ఎంపీ వైరస్ గురించే. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడుతున్నట్లు కథనాలొస్తున్నాయి. శీతాకాలం అంటువ్యాధులు త్వరగా ప్రబలుతుంటాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఈ సీజన్‌లో సర్వసాధారణం. చాలామంది వీటికి ఏ టాబ్లెట్టో వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. కానీ ఇప్పుడు కొంపదీసి కొత్త వైరస్సేమో అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇమ్యూనిటీ సిస్టమ్ తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులపై హెచ్‌ఎంపీ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్దగా భయపడాల్సిన పన్లేదన్న మాట బలంగా వినిపిస్తున్నా.. కోవిడ్ 19కంటే తక్కువ ప్రమాదమేం కాదన్న వాదనకూడా వినిపిస్తోంది. ప్రస్తుతానికైనా ఈ వైరస్‌కి వ్యాక్సిన్ లేదు. అలాగని ఇదేం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన వైరస్ కాదు. హెచ్‌ఎంపీ వైరస్ ప్రచారంతోనే జనం ఉక్కిరిబిక్కిరవుతుంటే.. మరోవైపు నోరో వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు మరింత భయపెడుతున్నాయి. అమెరికాలో నోరో వైరస్ రోజురోజుకీ తీవ్రమవుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం ఆ దేశంలో నోరో వైరస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. నవంబరు నుంచీ అగ్రరాజ్యంలో ఆ వైరస్ బాధితులు పెరుగుతున్నారు. నోరో వైరస్ జీర్ణకోశానికి సోకే వ్యాధి. బాధితులనుంచి నోరో వైరస్ ఇతరులకు వేగంగా సోకే అవకాశముంది. 12నుంచి 48 గంటల తర్వాత లక్షణాలు కనిపిస్తాయి. అతిసారం, వాంతులు, వికారం, కడుపు నొప్పి, జ్వరం, తలనొప్పి, బాడీ పెయిన్స్ ఉంటాయి. వైరస్ సోకిన రెండు రోజులపాటు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుముఖం పడుతుంది. నోరో వైరస్ కూడా కొత్తదేం కాదు. అమెరికాకి ఇప్పుడు సోకింది కాబట్టే ప్రపంచం ఉలిక్కిపడుతోందంతే. గతంలోనే తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ లక్షణాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో 100కు పైగా కేసులు నమోదయ్యాయి. పాతబస్తీలో తొందరగా వ్యాప్తిచెందిన నోరో వైరస్‌పై అప్పట్లో జీహెచ్‌ఎంసీ ప్రజలను అప్రమత్తంచేసింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల జాబితాలోనే నోరో వైరస్ కూడా ఉంది. పారిశుద్ధ్యం, కలుషిత ఆహారంతోనే ఈ వైరస్ వ్యాప్తిచెందుతుందని గుర్తించారు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, వృద్ధులు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో కిడ్నీ ఇన్ఫెక్షన్స్ కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నోరో వైరస్ కంటే బర్డ్‌ఫ్లూనే ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ఓ పక్క ఈ మాయదారి రోగాలేంటని ప్రజలు తలపట్టుకుంటుంటే.. అటు మార్కెట్లు కూడా షేకవుతున్నాయి. చైనా తర్వాత భారత్‌ను తాకిన హెచ్‌ఎంపీవీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలి సారిగా స్పందించింది. ఈ వైరస్ ను సాధారణ వైరస్‌గా చిఊటా అభివర్ణించింది. హెచ్‌ఎంపీ వైరస్ అంటే హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కొత్తది కాదని..దీనిని 2001లోనే గుర్తించామని సంస్థ తెలిపింది. ఇది చాలా కాలంగా ప్రజలలో ఉంది.. ఈ వైరస్ ప్రభావం శీతాకాలంలో పెరుగుతుందని పేర్కొంది.

చైనాలో అనేక హెచ్‌ఎంపీ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఈ వైరస్ కేసులు భారతదేశంలో కూడా వెలుగులోకి రావడం మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆందోళన మరింత పెరిగింది. ఈ వైరస్ కూడా కరోనా లాంటి వినాశనానికి కారణమవుతుందా అంటూ రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజలు భయాందోళన చెందవద్దని ఇటీవల ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు చిఊటా కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది.ప్రపంచంలో ఎక్కడ యుద్ధమేఘాలు కమ్ముకున్నా, ఎక్కడ ఏ వైరస్ వ్యాపించినా ముందు కుప్పకూలేది స్టాక్‌మార్కెట్లే. హెచ్‌ఎంపీ వైరస్ ప్రభావం ప్రజలపైనే కాదు.. ఇటు స్టాక్‌మార్కెట్లపైనా పడింది. దేశంలో కొత్త వైరస్ కేసులు వెలుగుచూడగానే భల్లూకపు కౌగిట్లో చిక్కుకుంది మన స్టాక్‌మార్కెట్. ఈ వారం రోజుల్లోనే దాదాపు 15లక్షలకోట్ల మేర మదుపరుల సంపద ఆవిరైంది.

# ప్రాణాలు తీస్తున్న మంజా...

హైదరాబాద్, జనవరి 10 చైనా మాంజా.. ఇది సాధారణ దారం కంటే గట్టిగా, పదునుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని.. నైలాన్, సింథటిక్ దారానికి గాజు, ప్లాస్టిక్ పొడి పూసి మాంజా తయారు చేస్తారు. గాజుముక్కలను ఇతర రసాయన విషాలను కలపడం వల్ల ఈ దారం కత్తిలాగా మారుతోంది. అదే ఇప్పుడు మనిషి పాలిట ఉరితాడుగా మారింది. 2017లోనే చైనా మాంజా ఉత్పత్తి, నిల్వ, అమ్మకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధం విధించింది. ఈ దారం పర్యావరణానికి ప్రమాదమని భావించిన జాతీయ హరిత ట్రైబ్యునల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా సంక్రాంతికి చైనా మాంజా విక్రయాలు ఇష్టారీతిన సాగుతున్నాయి. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఎక్కడపడితే అక్కడ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ చైనా మాంజా కారణంగా ప్రతి సంక్రాంతి సమయంలో ఎంతో మంది చనిపోతున్నారు. తీవ్రంగా గాయపడిన వారు ఆసుపత్రుల పాలవుతున్నారు.

ఈ మాంజాతో పతంగులు ఎగురవేసే వారికి కూడా అనేక గాయాలవుతున్నాయి. అయినా మార్కెట్‌లో మాత్రం చైనా మాంజా విక్రయానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పోలీసులు సోదాలు చేసి కేసులు నమోదు చేస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల చాలామంది.. గాయపడ్డ ఘటనలు నమోదయ్యాయి. ఈ దుస్థితి నెలకొనడానికి కారణం అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల అత్యాశ, పతంగులు ఎగురవేసే వారి బాధ్యతారాహిత్యం అని చెప్పాలి.చైనీస్ మాంజా కారణంగా పక్షుల మరణాలకు లెక్కేలేదు. గాలి పటాలు ఎగరేసినప్పుడు తెగిపోయిన మంజా దారాలు చెట్లు, కరెంట్ తీగలు, స్తంభాలు, ఇళ్ల మధ్య వేలాడుతూ ఉంటాయి. పక్షులు ఎగిరివచ్చి వాటిలో చిక్కుకుపోయి మృత్యువాతపడుతున్నాయి. అందులో అరుదైన పక్షులు ఉంటున్నాయని, మాంజా కారణంగా కొన్ని జాతులు అదృశ్యమైపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా బైక్స్ మీద వెళ్లేవారికి ఈ మాంజా కారణంగా ముప్పు ఏర్పడుతుంది. అందుకే కొందరు వాహనదారులు ప్రత్యామ్నాయ దారులను అన్వేశిస్తున్నారు.

తాజాగా గుజరాత్‌లో ఓ వాహనదారుడు.. చైనా మాంజా ముప్పు నుంచి తప్పించుకునేందుకు తన స్కూటీకి ముందు ఓ ఇనుప కడ్డీతో షీల్డ్‌లా ఏర్పాటు చేసుకున్నాడు. మా బాధను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. మాంజా తగిలితే ప్రాణం పోవడం ఖాయం. అందుకే ఈ ఏర్పాటు అంటున్నాడు.

ఈ ఐడియా బాగుందని.. ఫాలో అయితే బెటర్ అని చాలామంది నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# 250 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాదీనం..

## ముగ్గురిపై కేసు నమోదు..





జోగులాంబ గద్వాల పట్టణం గంజిపేట లోని సితార ఇండస్ట్రీస్ లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ బయటపడింది. ఎస్సై కళ్యాణ్ కుమార్ బృందం తనిఖీలుచేసి 100 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్,రసాయానాలు స్వాదీనం చేసుకుంది. అమీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసారు. హైదారాబాద్ కాటేదాన్ నుంచి గద్వాల కి బొలెరో వాహనంలో తెచ్చిన 150 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాదీనం మరో ఇద్దరిపై కేసు నమోదు చేసారు.

# ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు..

# వచ్చే ఏడాది నుంచిరద్దు

విజయవాడ, జనవరి 10,తాజాగా ఇంటర్మీడియట్ విద్యామండలి కొత్తగా ప్రతిపాదించిన సంస్కరణల గురించి వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. అయితే ఈ విధానం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. పబ్లిక్ పరీక్షలకు బదులుగా అంతర్గత పరీక్షల విధానం వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు అమల్లోకి వస్తుందని ఇంటర్ బోర్డు పేర్కొంది. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, విద్యార్థులందరూ పరీక్షలకు సిద్ధమవ్వాలని సూచించింది.ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో కళాశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత కావల్సి ఉంటుంది. అయితే ఈ మార్కులను ప్రామాణికంగా తీసుకోరు. నైతికత–మానవ విలువలు, పర్యావరణం పరీక్షలు యథాతథంగా ఉంటాయి. వీటిలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో మార్పులు చేయనున్నారు. కళాశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో సైతం భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రానికి 30 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ యథాతథంగా జరుగుతాయి. మిగతా అన్ని సబ్జెక్టులకు 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయి.కొత్త విధానం ప్రకారం ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఒక్క ఏడాది మాత్రమే ఇంటర్ బోర్డు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ విధానం 2026–27 విద్యా సంవత్సరంలోనే అమల్లోకి వస్తుంది. వచ్చే ఏడాది 2025–26లో ఇంటర్ ఎన్‌సీఈఆర్టీ పాఠ్యప్రణాళికకు అనుగుణంగా కొంత సిలబస్ తగ్గిస్తారు. అయితే పరీక్షలు మాత్రం పాత విధానంలోనే జరుగుతాయి. ఇంటర్ సెకండ్ ఇయర్ సిలబస్‌తోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుతం గణితం ఏ, బీ పేపర్లుగా 75 చొప్పున 150 మార్కులకు ఉండగా.. రెండింటినీ కలిపి కొత్త పద్ధతిలో వంద మార్కులకు పబ్లిక్ పరీక్ష ఉంటుంది. అలాగే బైపీసీలో ప్రస్తుతం జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం సబ్జెక్టులు విడివిడిగా ఉండగా.. ఈ రెండూ కలిపి 50 చొప్పున 100 మార్కులకు ఉంటాయి. ఈ రెండింటినీ కలిపి జీవశాస్త్రంగా పరిగణిస్తారు. అంతేకాకుండా ప్రస్తుతం పబ్లిక్ పరీక్షల్లో ఒక మార్కు ప్రశ్నలు లేవు. కొత్త విధానంలో 10 శాతం వరకు ఒక మార్కు ప్రశ్నలు ఇవ్వనున్నారు. 8 మార్కుల ప్రశ్నలు తొలగించి 5 లేదా 6 మార్కుల ప్రశ్నలు ప్రవేశపెట్టనున్నారు.గణితంతో బైపీసీ చదివే సదుపాయం విద్యార్థికి లభిస్తుంది. ప్రస్తుతం ఇది సీబీఎస్ఈలో ఉండగా.. ఇప్పుడు రాష్ట్ర బోర్డులోనూ తీసుకురానున్నారు. ఎంబైపీసీ చదివినవారు ఇంజినీరింగ్, నీట్ రెండింటికీ అర్హులే. ప్రస్తుత విధానంలో ఎంపీసీ గ్రూపు తీసుకుంటే గణితం–1ఏ, 1బీ విడివిడిగా.. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంతో పాటు మొదటిభాషగా ఆంగ్లం, రెండో భాషగా తెలుగు/సంస్కృతం/ఇతర భాషలను చదువుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తీసుకురానున్న కొత్త విధానంలో గణితానికి ఒకే పేపర్ ఉంటుంది. భౌతిక, రసాయనశాస్త్రాలు ప్రాక్టికల్స్‌తో కలిపి విడివిడిగా వంద మార్కులకు ఉంటాయి.మొదటిభాష ఆంగ్లం తప్పనిసరి. రెండోభాష స్థానంలో ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో భాషలతో పాటు ప్రధాన సబ్జెక్టులనూ ఎంపిక చేసుకోవచ్చు. మొత్తం 23 సబ్జెక్టులు అందుబాటులో ఉంటాయి. ఐదు సబ్జెక్టులు తప్పనిసరి కాగా.. ఆరో సబ్జెక్టునూ విద్యార్థి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ విద్యామండలి పోర్టల్‌లోని 23 సబ్జెక్టుల్లో ఏదో ఒకటి చదువుకోవచ్చు. ఒకవేళ ప్రధాన ఐదు సబ్జెక్టుల్లో ఏదైనా ఒక సబ్జెక్టులో ఫెయిలైతే ఆరో సబ్జెక్టు మార్కులను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందులో ఉత్తీర్ణులైతే మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లే. ఇక ఇంటర్ సెకండియర్‌లో ఇచ్చే మార్కుల మెమోలో ఐదు సబ్జెక్టులను ఒక చోట 500 మార్కులకు ఇచ్చి, ఆరో సబ్జెక్టును ప్రత్యేకంగా చూపుతారు. ఆర్ట్స్ గ్రూపు వాళ్లు సైన్స్ సబ్జెక్టులను, అలాగే సైన్స్ వాళ్లు ఆర్ట్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు.

# భద్రాద్రిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు




భద్రాచలం వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా భద్రాద్రి రామయ్య ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు ఆ వైపు ప్రత్యేక సెక్టార్లు ఏర్పాటు చేసి స్వామి దర్శనం కల్పించారు. తెల్లవారుజామునే పండితులు రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం భక్తులు మెట్ల గుండా గుడిలోకి ప్రవేశించి స్వామి సేవలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలపై కాంగ్రెస్ ఫోకస్

హైదరాబాద్, జనవరి 10, తెలంగాణలో త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. గతేడాదిలోనే జరుగుతాయని అంతా భావించినప్పటికీ?. వాయిదా పడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం పల్లెల్లో, వార్డుల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే? వెంటనే షెడ్యూల్ ప్రకటించేందుకు ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది.స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో అధికార కాంగ్రెస్ వ్యూహాలకు పదును పెట్టే పనిలో పడింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని భావిస్తున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. నిజానికి ఏడాదిలోపే స్థానిక ఎన్నికలకు కూడా వెళ్లాలని భావించింది. అయితే క్షేత్రస్థాయిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే? గతేడాది కాకుండా ఈ ఏడాదిలోనే ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయింది. తాజాగా గాంధీ భవన్ లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ అయింది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీపై చర్చించారు.స్థానిక ఎన్నికలకు వెళ్లే క్రమంలో కాంగ్రెస్ పార్టీ కొన్ని అంశాలను ప్రధాన అస్త్రాలుగా భావిస్తోంది. ఇందులో రుణమాఫీతో పాటు రైతు భరోసా వంటివి ఉన్నాయి. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేశామనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. జనాల్లోకి వెళ్లనుంది. అంతేకాకుండా రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నామని చెప్పనుంది.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను పట్టాలెక్కించే విషయాన్ని హస్తం పార్టీ జనాల్లోకి తీసుకెళ్లనుంది. వీటికితోడు ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ను మరో అస్త్రంగా భావిస్తోంది. ఫ్రీ బస్సు పథకం, ఉచిత విద్యుత్ తో పాటు ఈ ఏడాది కాలంలో సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని యోచిస్తోంది.తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లోసత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో? క్షేత్రస్థాయిలో పార్టీకి గత వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఇటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. అంతేకాకుండా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చాలా మంది హస్తం గూటికి చేరారు. ఈ పరిణామాలన్నింటిని అనుకూలంగా మలుచుకోవం ద్వారా? గ్రామ, మండల, జిల్లా పరిషత్ పీఠాలపై హస్తం జెండా ఎగరవేయాలని బలంగా భావిస్తోంది.

## మరువలేని 'నిరాడంబర ప్రధాని' లాల్ బహదూర్ శాస్త్రి

### –నేడు ఆయన వర్ధంతి



భారతదేశ రెండో ప్రధానమంత్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్రధారి లాల్ బహాదుర్ శాస్త్రి. భారతదేశపు నిరాడంబర ప్రధానులలో ఒకరైన లాల్ బహదూర్ శాస్త్రి ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్ సరాయ్ గ్రామంలో 1904 అక్టోబర్ 2న జన్మించారు. ఎంతో దేశభక్తిగల ఆయన 1921లో సహాయ నిరాకరణోద్యమంలో అడుగుపెట్టారు. స్వాతంత్ర్య పోరాటంలో మొత్తం 9 సంవత్సరాలపాటు జైలులోనే గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఉత్రప్రదేశ్ రాష్ట్రమంత్రిగా పనిచేసి ఆ తరువాత 1951లో లోక్ సభ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మహాత్మా గాంధీ ప్రభావంతో అతను మొదట మహాత్మా గాంధీకి, తరువాత జవహర్‌లాట్ నెహ్రూకు నమ్మకస్తుడైన అనుచరుడయ్యాడు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అతను భారతదేశ ప్రభుత్వంలో చేరి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో మొదట రైల్వే మంత్రిగా (1951?56), తరువాత హోంమంత్రిగానేకాక ఇతర బాధ్యతలను కూడా చేపట్టాడు. నెహ్రూ అనంతరం ప్రధానమంత్రి పదవిని చేపట్టాడు. అతను 1965 ఇండో–పాకిస్థాన్ యుద్ధం కాలంలో దేశాన్ని నడిపించాడు. అతని నినాదం "జై జవాన్ జై కిసాన్" యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి వచ్చి ప్రస్తుత కాలం వరకు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోయింది. ఈ యుద్ధం 1966 జనవరి 10న తాష్కెంట్ ఒప్పందం ద్వారా యుద్ధం పూర్తి అయినది. ఒప్పందం జరిగిన తరువాత దినం తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడింది. కానీ ఈ మరణానికి అనేక కారణాలు చెప్పబడినప్పటికీ అది సి.ఐ.ఎ ద్వారా జరిగిన ప్రణాళికాబద్ధమైన హత్యగా చెప్పబడింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా పనిచేస్తూ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత రవాణా మంత్రిగా, హోంమంత్రిగా పనిచేశారు. 1964లో జవహర్ లాల్ నెహ్రూ ఆకస్మిక మరణం తర్వాత లాల్ బహదూర్ శాస్త్రిగారు ప్రధానమంత్రి అయ్యారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంటే గ్రీన్ రివల్యూషన్‌కు బాటలు వేశారు. భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య ఒప్పందం కోసం రష్యా చేరిన లాల్ బహదూర్ శాస్త్రి తాష్కెంట్ ఒప్పందంపైన 1966 జనవరి 10న సంతకాలు చేశారు. ఆ మర్నాడు 1966 జనవరి 11న గుండెపోటుతో తాష్కెంట్‌లోనే ఆయన మరణించారు. మరణానంతరం 1966లో భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' ఇచ్చి గౌరవించింది.

# వరంగల్ లో ఆన్ లైన్ మోసం

వరంగల్, జనవరి 10, ఆన్ లైన్ ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు పేరున వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీని సైబర్ కేటుగాళ్లు మోసం చేయగా.. సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీ మెయిల్ ఐడీకి 2024 సెప్టెంబర్ 18న గవర్నమెంట్ జాబ్స్, ఇతర ఆన్ లైన్ ఎగ్జామ్స్ కండక్ట్ చేసేందుకు సెంటర్ ఏర్పాటు కోసం బెంగళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ నుంచి మెయిల్ వచ్చింది.బెంగళూరు కు చెందిన సంస్థ, కాలేజీతో కలిసి సంయుక్తంగా ఆన్ లైన్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు అంగీకారం కోసం మెయిల్ పంపించగా.. ఇక్కడి కాలేజీ యాజమాన్యం అందుకు ఓకే చెప్పింది. దీంతో అవతలి వైపు నుంచి పరీక్షల నిర్వహణ కోసం అప్లికేషన్ ఫామ్ ను మెయిల్ ద్వారానే పంపించగా.. దానిని కాలేజీ యాజమాన్యం ఫిల్ చేసి తిరిగి అదే మెయిల్ ఐడీకి పంపించేశారు.ఆ తరువాత ఎగ్జామినేషన్ సెంటర్ అగ్రిమెంట్ కోసం డాక్యుమెంట్స్ పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ యాజమాన్యం ఆ పని కూడా పూర్తి చేసింది.కాలేజీ యాజమాన్యం ఎగ్జామినేషన్ సెంటర్ నిర్వహణకు అగ్రిమెంట్ కాపీలు పంపించగా. రిజిస్ట్రేషన్ కోసం రిఫండబుల్ ఫీజు పేరున రూ.42,600 పంపాల్సిందిగా అవతలి నుంచి రిప్లై వచ్చింది. దీంతో వారు చెప్పిన ప్రకారం కాలేజీ యాజమాన్యం అమౌంట్ పంపించింది. ఆ తరువాత కాలేజీ బిల్డింగ్ ప్లాన్, ఓనర్ షిప్ డాక్యుమెంట్స్, కరెంట్ బిల్, ఇంటర్నెట్ కనెక్షన్ వివరాలు సేకరించి, గత డిసెంబర్ నెలలో ఎగ్జామినేషన్ ఎక్విప్ మెంట్ సంయుక్తంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.2.95 లక్షలు పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ అకౌంట్ నుంచి పంపించారు.తరువాత అదే నెలలో ఎక్విప్ మెంట్, ఫర్నిచర్ ట్రాన్స్ పోర్ట్ కోసం రూ.79 వేలు , ఫర్నిచర్ ఇన్సురెన్స్ పేరున రూ.2.6 లక్షలు పంపించాల్సిందిగా మళ్లీ మెయిల్ చేయడంతో ఆ మొత్తాన్ని కూడా వారు చెప్పిన అకౌంట్ కు బదిలీ చేశారు. ఇంతవరకు బాగానే ఉండగా, ఆ తరువాత సంబంధిత కంపెనీ నుంచి కాలేజీ యాజమాన్యానికి ఎలాంటి ఫోన్ కానీ, మెయిల్ కానీ రాలేదు.ఇదివరకు కాలేజీ యాజమాన్యానికి కాల్స్ వచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసినా కలవకపోవడంతో సంబంధిత వివరాలు జోడించి ఈ నెల 6వ తేదీన పోలీసులకు కాలేజీ ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ 318(4), ఐటీ యాక్ట్ 66డీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కున అందజేసిన బీజేపీ ఎమ్మెల్సీ ఏ వి ఎన్ రెడ్డి





**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి:** అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) బీజేపీ ఎమ్మెల్సీ ఏ వి ఎన్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు.

రామంతపూర్ వెంకట సాయి నగర్( సాయి కృష్ణానగర్), చెందిన జ్యోతి భర్త శివ కు ,బాలకృష్ణ నగర్ కు చెందిన మానస తండ్రి కి శుక్రవారం 42, 000/- ,29,000 /- రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్సీ ఏవి ఎన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏ వి ఎన్ రెడ్డి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం లాంటిదని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఏ విజయేందర్ రెడ్డి, ఐలేష్ యాదవ్, రమేష్, రాజు, శివ,ఆర్ గోవింద్, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్, అశోక్ నవీన్, తదితరులు పాల్గొన్నారు

# ట్రాన్స్ జెండర్లకు పెరిగిన గౌరవం

హైదరాబాద్, జనవరి 10, తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవ ఉపాధి అవకాశాలు కల్పించడంలో చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోంది. మహబూబాబాద్‌కు చెందిన శ్రావణి, ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ట్రాఫిక్ అసిస్టెంట్ పోస్టుల్లో ఉద్యోగం పొందారు. హైదరాబాద్‌కు చెందిన ప్రేం లీలా, జూట్ బ్యాగ్ మాన్యుఫాక్చరింగ్ వ్యాపారంలో రాణించి మార్పుకు ప్రతీకగా నిలుస్తున్నారు. సురారం ప్రాంతానికి చెందిన జాస్మిన్ స్వయంగా పిండి వంటల వ్యాపారాన్ని ప్రారంభించారు.శ్రావణి, చిన్ననాటి నుంచి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని, తెలంగాణ ప్రభుత్వంతో ట్రాఫిక్ అసిస్టెంట్‌గా పనిచేయడానికి అవకాశాన్ని పొందారు. "చిన్నప్పుడు స్కూల్‌కు వెళ్లడం నాకు ఎంతో కష్టంగా అనిపించేది. తోటి పిల్లల మాటలు, పెద్దల అంగీకారం లేకపోవడం నా జీవన ప్రయాణంలో ప్రతీ అడుగునా ఇబ్బందికరంగా మారాయి," అని శ్రావణి చెప్పారు."ప్రారంభ దశలో నాకు సాధారణ ఉపాధి అవకాశాలు కూడా లభించలేదు. 'భిక్షాటనే మాకు జీవనోపాధి' అని, నేను నా పాత జీవితాన్ని గుర్తు చేసుకుంటున్నాను. కానీ తెలంగాణ ప్రభుత్వం గౌరవంగా ఈ ఉద్యోగాన్ని ఇచ్చింది. 20 రోజుల శిక్షణ అనంతరం నేను ప్రస్తుతం చిలకలగూడా పరిధిలోని ఆలుగడ్డబావి సర్కిల్‌లో డ్యూటీ చేస్తున్నాను. మాకు అన్నివిధాలుగా చక్కటి ట్రానింగ్ ఇస్తున్నారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సార్, తెలంగాణ సీఎం రేవంత్ సార్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు," అని శ్రావణి తెలిపారు.

ప్రేం లీలా: స్వయం ఉపాధికి ఆదర్శం

ప్రేం లీలా, 2021లో తెలంగాణ ప్రభుత్వ నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ తీసుకుని, 'ప్రేం లీలా క్రియేషన్స్' అనే తన బ్రాండ్‌ను స్థాపించారు. ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్‌ల తయారీలో తనదైన గుర్తింపు పొందారు. "నా జీవితంలో నేను ఏదోకటి సాధిస్తాను అన్న నమ్మకాన్ని ఎప్పటికీ కోల్పోలేదు. మాకు అవకాశం వస్తే మార్పు తథ్యమని తెలుసు," అని ప్రేం లీలా తెలిపారు."ఇది కేవలం వ్యాపారం కోసం మాత్రమే కాదు; ట్రాన్స్‌కమ్యూనిటీ వారికి ఉద్యోగ అవకాశాలు కూడా మున్ముందు కలిపించడానికి నేను కృషి చేస్తున్నాను," అని ఆమె చెప్పారు. తెలంగాణ ఇంద్ర మహిళా శక్తి పథకం ద్వారా త్వరలో శిల్పరామంలో పర్మనెంట్ స్టాల్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది"ఎన్నో సంవత్సరాలుగా మా ట్రాన్స్‌జెండర్స్‌కు ఉద్యోగ అవకాశాలు లేక అనేక కష్టాలు అనుభవించాము. సమాజంలో మమ్మల్ని ఛీ కొట్టిన వారే ఎక్కువ. ఇప్పుడు మేమంతా కలిసి మా సొంత వ్యాపారాలాను ప్రారంభించాం. చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌లో మాకు ఒక పర్మినెంట్ స్టాల్, ట్రాలీ స్టాండ్‌ను కేటాయించారు. నేను స్వయంగా తయారుచేసే తెలుగు పిండి వంటల స్నాక్స్‌తో ఒక వ్యాపారం నడుపుతున్నాను. 'జనమ్ తో జస్మిన్' అనే యూట్యూబ్ ఛానల్‌ను కూడా నిర్వహిస్తున్నాను. నా ఛానెల్‌లో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారతపై కంటెంట్‌ను ప్రొడ్యూస్ చేస్తాను," అని జాస్మిన్ తెలిపారు."త్రిపుర సుందరీ, సహస్రా అనే ఇద్దరు ట్రాన్స్ మహిళలు కూడా ఇక్కడ జ్యూట్ బ్యాగ్స్ తయారు చేసి, తమ ఉత్పత్తులను స్టాల్‌లో ఉంచారు," అని జస్మిన్ పేర్కొన్నారు.ఈ విధంగా, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు గౌరవ ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో వివక్షను తొలగించడమే కాకుండా, వారికి గౌరవంగా జీవించే అవకాశాలు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. "ప్రతి ఒక్కరికి గౌరవంతో జీవించే హక్కు ఉంది. ఇవి చిన్న అడుగులే అయినా, సమాజ మార్పుకు ఉదాహరణగా నిలుస్తాయి," అని శ్రావణి అభిప్రాయపడ్డారు.

# కమిటీ లేకుండానే ఐనవోలు జాతర

వరంగల్, జనవరి 10,రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన ఐనవోలు మల్లికార్జునస్వామి మహా జాతరకు సమయం ఆసన్నమైంది. ఇంకో మూడు రోజుల్లోనే స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే ఈ జాతరకు భోగి నుంచి కనుమ రోజుల్లోనే దాదాపు 10 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంటుంది.రద్దీ తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యతను ఆలయ పాలకవర్గం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ గత మూడేళ్ల నుంచి ఐనవోలు ఆలయ ట్రస్ట్ బోర్డు వ్యవహారంలో కోర్టు కేసులో చిక్కుకోవడంతో ఇప్పటి వరకు పాలకవర్గ ఏర్పాటుపై ఎలాంటి క్లారిటీ రాలేదు.

ఇదిలాఉంటే కొంతమది నాయకులు తామే పాలకవర్గ సభ్యులమంటూ చెప్పుకుంటుండగా.. అధికారులు మాత్రం అధికారికంగా కమిటీ మాత్రం ప్రకటించలేదు. దీంతో ట్రస్ట్ బోర్డు ఉన్నట్టా.. లేనట్టా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.2023 జాతర సమయంలో జనవరి 10 తేదీన దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు కారణంగా ఆలయంలో వివాదం చెలరేగింది. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ తనకు సన్నిహితుడిగా ఉండే మజ్జిగ జయపాల్కు ఆలయ చైర్మన్ ఇస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు 14 మంది సభ్యులను ఎంపిక చేసి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపించారు. ఆ తరువాత జనవరి 10న దేవాదాయ శాఖ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఇందులో మజ్జిగ జయపాల్ కు చైర్మన్ పదవి హామీ ఉండగా.. ఆయనే చైర్మన్ గా ఎన్నుకునేందుకు అంతా రంగం సిద్ధం చేశారు. కానీ ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయంలో వాటాదారుగా ఉన్న వ్యక్తులకు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం ఇవ్వకూడదు. కానీ రూల్ ను పట్టించుకోకుండా ఆలయంలో వాటాదారుగా ఉన్న జయపాల్ కు చైర్మన్ పదవి ఇచ్చేందుకు కసరత్తు చేయడంతో హనుమకొండకు చెందిన పైళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు చెల్లదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ దానిపై విచారణ జరుగుతుండగానే గత ఆగస్టు 30న దేవాదాయ శాఖ నూతన ధర్మకర్త మండలి ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించింది.దీంతో కోర్టులో కేసు కొనసాగుతుండగా.. నూతన పాలకవర్గం ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించడం సరికాదని, అలా కాదని ఎంపిక చేపడితే తాము కోర్టు నుంచి సవాల్ చేస్తామంటూ అప్పట్లో వివాదంలో చిక్కుకున్న కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కోర్టు తీర్పు వెలువడే వరకు ట్రస్ట్ బోర్డు ఎంపిక వాయిదా వేయాలని అటు ప్రభుత్వ పెద్దలతో పాటు ఆఫీసర్లు కూడా నిర్ణయానికి వచ్చారు. కాగా 2023 జాతర నుంచి ట్రస్ట్ బోర్డుపై వివాదం నడుస్తుండగా.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర సంక్రాంతి నుంచి ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. భోగి పండుగ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. కేవలం ఈ మూడు రోజుల్లోనే దాదాపు 10 లక్షల మందికిపైగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇంత పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడంలో పాలకవర్గానిదే కీలకపాత్ర. కానీ ట్రస్ట్ బోర్డు విషయం కోర్టు పరిధిలో ఉండటంతో టెంపరరీగా జాతర కమిటీ వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్ధన్నపేటకు చెందిన వ్యక్తిని జాతర కమిటీ చైర్మన్ గా ప్రకటించేందుకు ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నట్లు తెలిసింది. కాగా అదే కమిటీ ట్రస్ట్ బోర్డుగా ఉంటుందని స్థానికంగా ప్రచారం కూడా జరుగుతోందిప్రతిసారి జాతర సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు తదితర వసతులు సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

జాతర సమయంలో టెంపరరీ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నా అవి కూడా జనాలకు సరిపోవడం లేదు. దాంతో జాతరలో శానిటేషన్ కూడా ప్రధాన సమస్యగా మారింది.ప్రతిసారి పంచాయతీలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది దాదాపు 500 మందితో పనులు చేయిస్తున్నా.. అక్కడ సేవలందలేని పరిస్థితి నెలకొంటోంది.

దీంతో ఈసారి కూడా జాతర సమయంలో భక్తులు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఓ వైపు పాలకవర్గం లేకపోవడం, ఆఫీసర్లపైనే భారమంతా పడుతుండటం ఇబ్బందిగా మారగా.. అదనపు సిబ్బందిని కేటాయించి భక్తులకు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# టార్గెట్ కేసీఆర్... రేవంత్ వ్యూహం అదేనా

హైదరాబాద్, జనవరి 10. తెలంగాణలో ఎన్నికలు ముగిసి ఏడాది గడిచినా.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ఆగడం లేదు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ వేవారు. తర్వాత విద్యుత్ కొనుగోలు ఒప్పందంపైనా విచారణ కమిషన్‌ను నియమించారు. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూసింది. వీటితో రేవంత్ సర్కార్ కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావును ఇరుకున పెట్టాలని భావిస్తోంది. అయితే ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. తాజాగా ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ విదేశీ సంస్థకు చెల్లించిన రూ.56 కోట్ల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. విచారణకు పిలిచింది. అనేక ట్విస్టుల తర్వాత కేటీఆర్ విచారణకు హాజరయ్యారుఎన్నికలు జరిగి ఏడాది గడిచినా.. బీఆర్ఎస్ శాసన సభా పక్ష నేతగా ఎన్నికైన కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. రేవంత్ ముందు తాను ప్రతిపక్షంలో కూర్చోలేకనే రావడం లేదన్న వాదన ఉంది. గతంలో కాలు విరిగిందని సాకులు చెప్పిన గులాబీ నేతలు ఇప్పుడు కేసీఆర్ గైర్హాజర్‌పై నోరు మెదపడం లేదు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావే అన్నీ చూసుకుంటున్నారు. అయితే సీఎంగా రేవంత్ ఉన్న నేపథ్యంలో ఆయన ఎదుట ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కూర్చోవడం ఇష్టం లేకనే రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరోవైపు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి బయటకు రప్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఈ ఫార్ములా కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేసింది. మరోవైపు హరీశ్‌రావును కూడా కాళేశ్వరం కేసులో ఇరికించే అవకాశం ఉంది. ఈ చర్యలతో అయినా కేసీఆర్ బయటకు వస్తారని భావిస్తోంది.ఇదిలా ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి తరచూ ప్రశ్నిస్తున్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సూచనలు తమకు అవసరమని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని, తెలంగాణ ప్రగతికి ఆయన తెలివి ఎందుకు ఉపయోగించడం లేదని నిలదీస్తున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లారు. స్వయంగా కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇక మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌కు నివాళు లర్పించేందుకు ఏర్పాటుచేసిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి రావాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కేసీఆర్‌కు స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. అయినా కేసీఆర్ ఫామహౌస్ దాటలేదు.కొడుకు కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉంది. హరీశ్‌రావును కూడా ఏదో ఒక కేసులో అరెస్టు చేయవచ్చన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే పార్టీ బాధ్యతలు ఎవరు చూస్తారన్న చర్చ ఇప్పుడు బీఆర్ఎస్‌లో జరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే కేసీఆర్ కూతురు కవిత నేనున్నానంటూ మళ్లీ యాక్టివ్ అయ్యారు. అయితే ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవిత పార్టీ బాధ్యతలు నిర్వహించడంపై పార్టీలోనే కొందరు విముఖంగా ఉన్నారు. ఈ క్రమంలో కేసీఆర్ ఫాంహౌస్ వీడతారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ రాకుంటే క్యాడర్ చీలిపోయే ప్రమాదం ఉంది. పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుంది.

# ఇప్పుడు తెరపైకి ల్యాండ్ క్రూయిజర్

హైదరాబాద్, జనవరి 10,రాజకీయాలు వెనుకటి కాలంలో ఎన్నికల సమయంలోనే సందడిగా ఉండేవి. ఆ తర్వాత చప్పగా సాగిపోయేది. అరుదైన సందర్భంగా మాత్రమే సంచలనాలు చోటు చేసుకునేవి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు సంచలనమే నమోదవుతుంది. రాజకీయ నాయకులు వ్యక్తిగత కక్ష్యలను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేస్తుండడంతో సరికొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.తెలంగాణలో ప్రస్తుతం రాజకీయాలు రోజుకో తీరుగా మారిపోతున్నాయి. మొన్నటిదాకా అల్లు అర్జున్ వివాదం సంచలనం సృష్టించగా.. ఇప్పుడు "ఫార్ములా ఈ" కేసు కలకలం రేపుతోంది. పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పుడు 55 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విదేశీ కంపెనీకి బదలాయించడాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుపడుతోంది. ఈ విషయాన్ని క్యాబినెట్లో కూడా చర్చించలేదు. నేరుగా డబ్బును విదేశీ కంపెనీకి పంపించారు. దీనివల్ల కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ కేసులోకి ప్రవేశించాయి. మొత్తంగా ఏసీబీ, ఈడి రంగంలోకి దిగాయి. ఫలితంగా ఈ కేసు కొత్త మలుపులు తీసుకుంటున్నది. పైగా హైకోర్టు కూడా ఈ కేసు విచారణలో తాము ఏమీ చేయలేమని.. దర్యాప్తు సంస్థలు విచారణ చేపడితే అడ్డుకోబోమని స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే ఈ వ్యవహారంలో కేటీఆర్ ను మరింత లోతుగా కార్నర్ చేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. రేవంత్ రెడ్డి ఒకప్పుడు కేసీఆర్ బాధితుడు కాబట్టి.. నాడు తన కూతురు పెళ్లికి ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చారు కాబట్టి.. పగ తీర్చుకోవడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య ఉప్పు నిప్పులాగా వ్యవహారం సాగుతోంది. అయితే ఇంతలోనే ల్యాండ్ క్రూయిజర్ ఇందులోకి ప్రవేశించింది. అయితే దీనికి దానికి సంబంధం ఏంటి అని అనుకుంటున్నారా.. ఆగండి ఆగండి అక్కడిదాకే వస్తున్నాం.. ముందే మనం చెప్పుకున్నాం కదా రాజకీయాలు ఒకప్పటిలాగా లేవని.. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ ను అడ్డంగా బుక్ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేయడానికి భారత రాష్ట్ర సమితి కూడా తన వంతు ప్రయత్నాలను మొదలుపెట్టింది.భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షించే డాక్టర్ మన్నె క్రిషాంక్ సంచలన విషయాన్ని వెలుగులోకి తెచ్చారు.. కొడంగల్ లో పలు కాంట్రాక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కే ఎల్ ఎస్ ఆర్ అనే కంపెనీకి కట్టబెట్టిందని.. దానికి ప్రతిగా ఆ కంపెనీ ల్యాండ్ క్రూయిజర్ వాహనాన్ని ముఖ్యమంత్రికి అందించిందని ఆరోపించారు. ఆ వాహనం నెంబర్ కూడా ఖా 07 ఈఈ 009 అని క్రిషాంక్ పేర్కొన్నారు. కే ఎల్ ఎస్ ఆర్ అనే కంపెనీ 168 కోట్ల కాంట్రాక్టులను పొందిందని క్రిషాంక్ ఆరోపించారు. ఇది క్విడ్ ప్రో కో కు బలమైన ఉదాహరణ అని ఆయన ఆరోపించారు. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించింది. ఆ వాహనం ఏదో కాంట్రాక్ట్ కంపెనీ బహుమతిగా ఇచ్చింది కాదని.. ముఖ్యమంత్రి సోదరులు గతంలోని కొనుగోలు చేశారని వివరించింది. దానికి సంబంధించి రవాణా శాఖ జారీ చేసిన ధ్రువపత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే ఫార్ములా ఈ కేసులో రోజుకో తీరుగా సంచలనాలు నమోదు అవుతుండగా.. ఇప్పుడు కొత్తగా ఇందులోకి ల్యాండ్ క్రూయిజర్ రావడం సరికొత్త చర్చకు దారితీస్తోంది.

# మంత్రులలో అసంతృప్తి దేనికో

హైదరాబాద్, జనవరి 10.మర్యాద కరువైతే మనసు చివుక్కుమంటుంది. పదవులు కట్టబెట్టినా.. పవర్ ఇచ్చినా.. మర్యాద తక్కువైతే.. మనసు తట్టుకోలేదు.

తెలంగాణ మంత్రులకు ఇప్పుడలాంటి కష్టమే వచ్చింది.. అదేంటి అసలే మంత్రులు.. ఎక్కడికెళ్లినా మర్యాద టన్నుల కొద్దీ ఉంటుంది. అలాంటి వాళ్లు ఎందుకు ఫీలయ్యారనే డౌట్ పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ డిబేట్ పాయింట్‌గా మారింది.తెలంగాణలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారి పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సమావేశమైంది. ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ సమక్షంలో, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో ఆ సమావేశం జరిగింది. అదే ఇప్పుడు తెలంగాణ మంత్రుల అలకకు కారణమైందట. ఈ సమావేశం జరుగుతుందని తెలిసినప్పటి నుంచి ఏం విషయాలు మాట్లాడాలో, ఏయే అంశాలను ప్రస్తావించాలో పెద్ద హోంవర్క్ చేశారట మంత్రులు.కాంగ్రెస్ పెద్దలు సమావేశానికి పీఏసీ సభ్యులను మాత్రమే ఆహ్వానించి మంత్రులకు బిగ్ ట్విస్ట్ ఇచ్చారు.. దీంతో ఇన్విటేషన్ లేని మంత్రులు అవమానంగా ఫీలవుతున్నారనేది గాంధీభవన్‌లో వినిపిస్తున్న గాసిప్.మొదటి నుంచి పీఏసీ మీటింగ్ అని చెప్పుకొచ్చారు. పీఏసీ సభ్యులను ఎలాగూ ఆహ్వానిస్తారు.

ఇక మంత్రులను కూడా పిలుస్తారని ఊహించుకున్నారు. కానీ వారి ఆశలు అడియాశలు అవ్వడంతో ఆ మంత్రులంతా గుర్రుగా ఉన్నారట. ఇంతకీ పీఏసీ సమావేశానికి మంత్రులెందుకు అంత ఆసక్తి కనబరిచారనేది బహిరంగ చర్చగా మారిందిఏఐసీసీ సంస్థాగత జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ పీఏసీ మీటింగ్‌కు హాజరవుతున్నారని తెలిసి మంత్రులంతా ఇంట్రెస్ట్ చూపించారు. కానీ నాలుగేళ్ల కింద నియమించిన 23 మంది పీఏసీ సభ్యులకు మాత్రమే ఆహ్వానాలు అందాయని టాక్.. దీంతో అసంతృప్తికి గురైన సదరు మంత్రులు పార్టీ ముఖ్య నేతలకు ఫోన్లు కొట్టి తమ అసంతృప్తిని తెలియజేస్తున్నారనేది టాక్. నాలుగేళ్ల కింద వేసిన కమిటీని అప్‌డేట్ చేయలేదు, కనీసం కేసీ వచ్చిన సందర్భంగానైనా గౌరవప్రదంగా పిలుపు లేదని నారాజ్ అయ్యారంట.. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై చర్చలో తమ భాగస్వామ్యం అవసరం లేదా అని ప్రశ్నించారట.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పలు సూచనలు ఇవ్వాలని భావించారట మంత్రులు.. కానీ కీలకమైన సమావేశానికి ఆహ్వానించకుండా అవమానించారని రగిలిపోతున్నారని టాక్.. మరి ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్టానం ఎలా డీల్ చేస్తుంది? మంత్రులను ఎలా సముదాయిస్తారనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# పంచాయితీల నుంచి ట్రాక్టర్లు జప్తు

అదిలాబాద్, జనవరి 10.పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కోనుగోలు చేసిన చెత్త సేకరణ ట్రాక్టర్ల బకాయిల పంచాయితీ ముదిరింది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్రాక్టర్ల కొనుగోలుకు సం బంధించి కిస్తీలు చెల్లించకపోవడంతో టాక్టర్లను జప్తు చేస్తామంటూ షోరూం యజమా నులు పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్మల్ జిల్లా అధికారుల్లో కలవరం సృష్టిస్తున్నది. లీడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికే కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో షోరూంల యజమానులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి సంప్రదింపులకే పరిమితమవుతున్నారని బకాయిలు చెల్లించడం లేదని యజమానులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని 2021-22 సంవత్సరంలో ప్రభుత్వ గ్యారంటీ కింద టాక్టర్లు మంజూరు చేసింది. జీరో ఆడ్వాన్స్ కింద ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనాలని అప్పట్లో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. జిల్లా మొత్తం 396 గ్రామ పంచాయతీలు ఉండగా 396 ట్రాక్టర్లను లీడ్ బ్యాంక్ అధికారుల ప్రోత్సాహంతో కిస్తీల రూపంలో చెల్లిం చే విధంగా టాక్టర్లు కొన్నారు.కొన్ని నెలల వరకు కిస్తీలు చెల్లించినా.. ఆ తర్వాత ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అంతా తలకిందులైంది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటం, ప్రభుత్వాలు ప్రతి నెల విడుదల చేయాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో కిస్తీల చెల్లింపు నిలిచి పోయాయి. నిర్మల్ జిల్లాలో 92 పంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీల బకాయిలు పేరుకుపో యాయి.మొత్తం రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బకాయి ఏడాది క్రితమే చెల్లించా ల్సి ఉండగా నిధులు లేమితో చెల్లించకపోవడంతో వడ్డీ వేయడంతో మరింత భారం పడుతున్నది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆలోపే బకాయిలు చెల్లించాలని బ్యాంకర్లు, షో రూ ం యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో ట్రాక్టర్‌ల కిస్తీలు బకాయిలు ఉన్న మాట నిజమే. నిధుల కొరత కారణంగా చెల్లింపులో ఆలస్యమవుతున్నది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న పంచాయతీల కిస్తీలు చెల్లించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్దుబాటు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మిగిలిన బకాయిలు చెల్లిస్తాం. నిర్మల్ జిల్లాలో బ్యాంకు గ్యారంటీ కింద అధికారుల ఆదేశాల మేరకు వివిధ వివిధ బ్యాంకుల ద్వారా 396 పంచాయతీలకు టాక్టర్ రుణాలు ఇచ్చాం. ఇప్పటికి జిల్లాలో 92 టాక్టర్ల కిస్తీలు రూ.65 లక్షలు బకాయి ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక బకాయిలు చెల్లించడంలేదు. ఉన్నతాధికారుల నుంచి బాకాయిల చెల్లింపుల కోసం ఒత్తిడి తేవడంతో ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. బాకాయిలు చెల్లిస్తామని చెపుతున్నారుగానీ చెల్లించడంలేదు. కిస్తీలు కట్టకుంటే షో రూం యజమానులు ట్రాక్టర్లను తీసుకెళ్తామంటున్నారు.

# కూర్మ నరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం

## ప్రత్యేక పూజ చేసిన మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ దంపతులు



తూప్రాన్, జనవరి, 10. ప్రాజబలం ప్రతినిధి.వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తూప్రాన్ పట్టణం లోని అతి ప్రాచీనమైన మహిమాన్విహితుడైన శ్రీ కూర్మ నరసింహస్వామి దేవస్థానంలో, రామాలయ దేవాలయల్లో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు మామిండ్ల జ్యోతికృష్ణ ముదిరాజ్ ప్రత్యేక పూజలుచేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ మాట్లాడుతూ స్వయంభూగా వెలసిన కూర్మ నరసింహస్వామి అత్యంత మహిమాన్వితమైన ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కూర్మ నరసింహ స్వామి భక్తితో కొలిస్తే కోరిన కోరికలు తీర్చే స్వామిగా పిలువబడే కూర్మ నరసింహ స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అహోబిలం ప్రవీణ్ శర్మ,రామయ్య పంతులు,రిటైర్డ్ ఏఎస్ఐ విద్యాసాగర్,కొడిప్యాక వెంకటేశం గుప్తా , డాక్టర్ ప్రదీప్ సింహ, చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్, ధనరాజ్, దుర్గం నాగేష్, బొల్లు వెంకట్, అశోక్, రవి బాలయ్య ముదిరాజ్, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# జియాగూడ రంగనాధ ఆలయంలో భక్తుల ఇక్కట్లు

హైదరాబాద్ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జియాగూడలోని ప్రసిద్ధ రంగనాథ స్వామి దేవాలయంలో తెల్లవారుజామున రెండు గంటల నుండి భక్తులకు వెంకటేశ్వర స్వామి దర్శనం ఇచ్చారు. పోలీసులు, వాలంటీర్లపై సాధారణ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జియాగూడ రంగనాథస్వామి కేవలం విఐపి లకే పరిమితం అయ్యారని పోలీసులకు, వాలంటీర్లకు తెలిసిన వారైనా పంపిస్తున్నారని చిన్నపిల్లలను పెట్టుకుని తెల్లవారుజామున రెండు గంటల నుండి సుమారు మూడు గంటల పాటు లైన్లో నిలపడ్డ స్వామి దర్శనం వారికి దక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు పోలీసులపై దృష్టి పెట్టాలని కోరారు.

# వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజల్లో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

పెద్దపల్లివైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న ఎంపీ ప్రజల శ్రేయస్సు, పాడి పంటల సమృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఎంపీ శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పెద్దపల్లి ప్రజల ఆధ్యాత్మిక జీవనంలో ముఖ్యమైనదిగా వెలుగొందుతున్నాదన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన ఎంపీ లాడ్స్ నిధులను వినియోగిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# సినిమా



## కావేరి పాత్ర ఛాలెంజింగ్‌గా అనిపించింది



వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్' చిత్రంతో అలరించనున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. సంక్రాంతి కానుకగా ఆదివారం 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ "అఖండ, డాకు మహారాజ్, అఖండ -2.. ఈ విధంగా బాలకృష్ణతో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. డాకు మహారాజ్ లాంటి మంచి సినిమాలో బాలకృష్ణతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. డాకు మహారాజ్ ఘన విజయం సాధిస్తుందని, ఈ చిత్రంలోని నా పాత్రను ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఇందులో నేను కావేరి పాత్ర పోషించాను. నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర ఇది. డీ గ్లామరస్ రోల్ చేశాను. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. కావేరి పాత్రను బాబీ డిజైన్ చేసిన తీరు బాగుంది. ఈ పాత్ర నాకు నటిగా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కావేరి పాత్రతో పాటు ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. బాబీ కథ చెప్పినప్పుడే ఇది మంచి చిత్రం అవుతుందని నమ్మాను. నేను ఊహించిన దానికంటే గొప్పగా ఈ చిత్రాన్ని రూపొందించారు. బాలకృష్ణని సినిమాలో చాలా కొత్తగా చూపించారు. విజువల్స్ కూడా అద్భుతంగా ఉంటాయి. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నాగవంశీ గొప్ప నిర్మాత. దర్శకులను, టీంని ఎంతో నమ్ముతారు.

## ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే 'హత్య'




'మధ' వంటి సైకలాజికల్ థ్రిల్లర్‌తో అందరినీ మెప్పించిన దర్శకురాలు శ్రీ విద్య బసవ 'హత్య' అనే మరో థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం ఈనెల 24న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాను మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుక గురువారం జరిగింది. నటుడు రవివర్మ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, "మధ' తరువాత థ్రిల్లర్ జోనర్‌లోనే రెండో సినిమా కూడా చేస్తున్నాను. ఇది అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. చాలా హార్డ్ వర్క్, ఎఫర్ట్స్ పెట్టి స్క్రీన్ ప్లే రాసుకుని చేసిన సినిమా ఇది. ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేసిన నటీనటులు ధన్య బాలకృష్ణ, రవివర్మ, పూజా రామచంద్రన్ సహా అందరికీ థ్యాంక్స్. నరేష్ అద్భుత మైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి. అనిల్ ఎడిటింగ్ సినిమాను మరింత క్యూరియస్‌గా మార్చింది. మా నిర్మాత ప్రశాంత్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. "మధ' సినిమా టీజర్ చూడగానే నేను శ్రీవిద్యకు కాల్ చేశాను. నేను కూడా సినిమాలో భాగం అవుతానని అన్నాను. చాలా చిన్న పాత్ర ఉందని చెప్పింది. నాకు నేనుగా వెళ్లి ఆ సినిమాలో యాక్ట్ చేశాను. అప్పుడు ఆమెతో ప్రారంభమైన ఆ జర్నీ ఇప్పుడు ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేలా చేసింది. రొటీన్‌కు భిన్నమైన రోల్‌ను శ్రీవిద్య నన్ను లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేసింది. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్. శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. సినిమా అందరినీ ఎంగేజ్ చేసే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఆడియెన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుంది' అని నటుడు రవివర్మ చెప్పారు.

## సినిమాలపై కంగనా సంచలన నిర్ణయం



కంగనా రనౌత్ నటించిన "ఎమర్జెన్సీ" ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా తర్వాతి ప్రాజెక్టులపై కంగనా సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో ఫ్యాన్స్ షాక్‌కు గురవుతున్నారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కథానాయికగా నటించిన 'ఎమర్జెన్సీ' సినిమా రిలీజ్ ట్రైలర్ ఇటీవల విడుదలైంది. దీనికి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రియాంక గాంధీకి కూడా ఈ ట్రైలర్ బాగా నచ్చిందని కంగనా సినిమా ప్రమోషన్లలో చెప్పుకొచ్చింది. ఎమర్జెన్సీ సినిమా పక్కా పొలిటికల్ కథ. ఈ సినిమా విడుదలకు కంగనా చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. అందుకే సమీప భవిష్యత్తులో రాజకీయాలకు సంబంధించిన కథలు చేయకూడదని ఆమె నిర్ణయించుకుంది. 'ఎమర్జెన్సీ' సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. సెన్సార్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు మొదట నిరాకరించింది. పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ కూడా సినిమాపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. సినిమా సిక్కు సమాజాన్ని అవమానించేలా ఉందని ఆరోపించారు. ఈ క్రమంలోనే కంగనా తన తదుపరి ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడింది. 'మరోసారి రాజకీయ ఆలోచనలతో సినిమాలు చేయను. ఇలాంటి చిత్రాలు తీయడం చాలా కష్టమైంది. కథపై, ముఖ్యంగా ప్రజల గురించి ఎక్కువ సినిమాలు ఎందుకు తీయలేదో ఇప్పుడు నాకు తెలిసింది. అనుమప్ ఖేర్ యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ చిత్రాన్ని రూపొందించారు. ఇది అతని బెస్ట్ సినిమా. కానీ, మళ్లీ ఇలాంటి సినిమాలు చేయను. ఈ సినిమా విజయం సాధించినప్పటికీ భవిష్యత్తులో రాజకీయ కథాంశాలతో కూడిన సినిమాలు చేయను' అని కంగనా చెప్పుకొచ్చింది. దీంతో ఆమె కామెంట్స్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్ గా మారాయి. కాగా ఇప్పుడు సినిమాలతో పాటు కంగనా ఎంపీగా బిజీ బిజీగా ఉంటున్నారు. మర్జెన్సీ సినిమాలో కంగనా నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహించింది. నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది. 'సెట్‌లో నేనెప్పుడూ సహనం కోల్పోలేదు. మీరే నిర్మాతగా ఉన్నప్పుడు సెట్‌లో సహనం కోల్పోతారా? నిర్మాతతో దర్శకుడు కొట్లాడుతాడు. కానీ, రెండు పనులూ నువ్వే చేస్తున్నప్పుడు అరవలేవు' అంటోంది కంగనా.

## గేమ్ ఛేంజర్ పబ్లిక్ టాక్





గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు యావత్ వరల్డ్ వైడ్ గా మారుమోగుతున్న పేరు. గ్లోబల్ స్టార్ గా మారిన రామ్ చరణ్..గేమ్ చేంజర్ తో మరోసారి తన సత్తా చాటేందుకు ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సంచలన దర్శకుడు శంకర్ డైరెక్షన్లో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి రేసులో బరిలోకి దిగింది. దాదాపు మూడేళ్ళ పాటు చిత్రీకరణ జరుపుకున్న ఈ మూవీ ఎలా ఉంటుందో..? రామ్ చరణ్ యాక్టింగ్ ఎలా ఉందో..? కథ ఏంటో..? శంకర్ ఏ రేంజ్ లో తెరకెక్కించాడో..? అంటూ అభిమానులు కొద్దీ రోజులుగా ఎదురుచూస్తూ వచ్చారు. ఇక ఆ ఎదురుచూపులు తెరపడింది. వరల్డ్ వైడ్ గా పలు భాషల్లో ఈ మూవీ రిలీజ్ అయ్యింది. ఇక ఈ సినిమా చూసిన అభిమానులు , సినీ ప్రేక్షకులు సినిమా ఎలా ఉందో..సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. హీరో ఎంట్రీ అదిరిపోయిందని, ఇంటర్వెల్ సినిమాకే హైలెట్ అవుతుందని , ప్రథమార్ధంలో వచ్చే డోప్ సాంగ్ పిక్చరైజేషన్, అసలు ఆ పాటను అలా ఆలోచించడం గ్రేట్ అని అంటున్నారు. ఫస్ట్ హాఫ్‌లో ఐఏఎస్‌గా రామ్ నందన్ యాక్టింగ్, కియారాతో జోడి, ఇంటర్వెల్ బ్లాక్ ఇవన్నీ సినిమాకు హైలెట్ అవుతాయని కొంతమంది అంటున్నారు. ఇక రామ్ చరణ్ యాక్టింగ్‌కు వంక పెట్టలేమని చెబుతున్నారు. అయితే కొంత మంది మాత్రం ఎమోషనల్‌గా కనెక్ట్ కాలేకపోతోంది అని చెబుతున్నారు. ఇంటర్వెల్‌కు వచ్చే ట్విస్ట్‌తో అందరికీ మైండ్ బ్లాక్ అవుతుంది. అదే ఈ ఫస్ట్ హాఫ్ మొత్తానికి హైలెట్ అవుతుందని అంతా అంటున్నారు.

## ఆడపిల్లను కాపాడుకుందాం



మంచి సందేశంతో రూపొందించిన 'నిన్ను నన్ను కన్న ఆడది.. రా' పాటను రాష్ట్ర మంత్రి సీతక్క విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ "ఒక అద్భుతమైన ఆలోచనతో సమాజంలో మార్పు తీసుకురావడానికి ఈ పాట చేసిన రమణా రెడ్డి, ఆలీకి కృతజ్ఞతలు. కామంతో కళ్ళు మూసుకునిపోయి మృగంలా ప్రవర్తించే వారిలో మార్పు రావాలి. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వీటిని అరికట్టడానికి ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ పాట ఒక మంచి తొలి అడుగులా కనిపిస్తుంది. ఈ పాట అందరిలో మార్పును తీసుకొస్తుందని కోరుకుంటున్నాను. మనం అందరం ఆడపిల్లను కాపాడుకుందాం-"అని అన్నారు. ఆలీ మాట్లాడుతూ "ఈ పాట చేయడానికి ముఖ్య కారణం మనం ప్రస్తుతం బయట చూస్తున్న పరిస్థితులు. క్యాన్సర్ కంటే దారుణంగా వ్యాపిస్తుంది ఈ రేప్ అనే వ్యాధి. నాకు ఈ పాట వినగానే యమలీల సినిమాలోని పాట గుర్తొచ్చింది. దర్శకుడు రమణా రెడ్డి ఇక్కడ నుండి అమెరికా వెళ్లి మన దేశానికి ఏమైనా చేయాలని అనుకుని తిరిగి వచ్చి ముందుగా ఈ పాటతో మొదలు పెట్టాడు. పాట విన్న వెంటనే నేను ఈ పాటని మన రాష్ట్రానికి, ఆడవారికి అంకితం చేయాలని అనుకున్నాము. ఈ పాట పూర్తిగా అన్ని చానల్స్, ఆడియో కంపెనీలకు ఉచితం. కేవలం మంచి అనేది అందరికీ వెళ్ళాలి అనే ఉద్దేశంతో చేశాం"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు రమణారెడ్డి, బీఆర్కే న్యూస్ అధినేత బొల్లా రామ కృష్ణ, నటుడు శ్రీనివాస్, నటి మంజుల, జుబేదా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ హీరోయిన్‌కు వేధింపులు



సినీ తారలు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వేధింపులు, బెదిరింపులు ఇటీవల పెరిగిపోతున్నాయి. తాజాగా హీరోయిన్ నిధి అగర్వాల్ కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. తనపై సోషల్ మీడియా ద్వారా వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను చంపేస్తానంటూ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని నిర్దేశించి నిధి ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి తనకు దగ్గరి వారిని కూడా లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఘటన తనను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేసిందని, నిందితుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నిధి అగర్వాల్ ఫిర్యాదును స్వీకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి వివరాలు సేకరించి, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిధి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ ప్రముఖ హీరోలతో పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రభాస్‌తో రాజాసాబ్, పవన్ కల్యాణ్ సరసన హరి హర వీర మల్లు చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు కూడా భారీ అంచనాలతో విడుదలకు సిద్ధమవుతున్నాయి.



# క్రీడలు



## మంధాన కెప్టెన్సీలో దూకుడుగా భారత్




వెస్టిండీస్ సిరీసలో అదరగొట్టిన భారత మహిళల జట్టు.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐర్లాండ్‌తో తొలి ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా.. శుక్రవారం జరగనున్న మొదటి వన్డేలో డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన నేతృత్వంలో భారత్ బరిలోకి దిగనుంది. వరల్డ్‌కప్ నేపథ్యంలో యువ క్రికెటర్లను పరీక్షించడానికి మేనేజ్‌మెంట్‌కు ఇదో సువర్ణావకాశం. విండీసతో టీ20 సిరీసను 2-1తో సొంతం చేసుకొన్న భారత్.. వన్డే సిరీసను 3-0తో దక్కించుకొంది. ఈ రెండు ఫార్మాట్లలోనూ పరుగుల వరద పారించిన మంధాన అదే ఫామ్‌ను కొనసాగించాలనుకొంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతినివ్వడంతో.. మిడిలార్డర్‌లో హర్లీన్ డియోల్, ప్రతీక, జెమీమా కీలకంగా మారారు. విండీసతో వన్డే సిరీసలో డియోల్ సెంచరీ నమోదు చేసింది. ఓపెనర్‌గా ప్రతీక మెరుగ్గా రాణిస్తోంది. అయితే, పేసర్ రేణుకా సింగ్ గైర్హాజరీలో టిటాస్ సాధు, సైమా ఠాకూర్‌పై భారం పడనుంది. దీప్తి శర్మ, ప్రియా మిశ్రా, తనూజ కన్వర్‌తో స్పిన్ విభాగం బలంగానే ఉంది. ఆల్‌రౌండర్లు రాఘవి బిస్త్, సయాలిపై అందరి దృష్టి ఉండే అవకాశం ఉంది. మరోవైపు గాబీ లూయిస్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఐర్లాండ్‌కు భారత్‌ను ఎదుర్కోవడం సవాలే. ఈ రెండు జట్లు వన్డేల్లో 12 సార్లు తలపడగా ఐర్లాండ్ ఒక్కసారి కూడా గెలవలేదు. అయితే, ఈసారి గెలిచి సత్తాచాటుతామని గాబీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఆల్‌రౌండర్ ఓర్లా పెండర్‌గాస్టకు బిగ్‌బాషలో ఆడిన అనుభవం ఉంది.

## క్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో చిరాగ్-సాత్విక్ 21-15, 21-15తో మలేషియాకు చెందిన టాన్-ఆయుబ్‌లను చిత్తుచేశారు. క్వార్టర్స్‌లో వీరు మలేషియాకే చెందిన ఇ.వై.టెన్-వై.ఎస్ ఆన్‌లతో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణరుకు ప్రి క్వార్టర్స్‌లో నిరాశ తప్పలేదు. మూడుసెట్ల హెూరాహెూరీ పోరులో ప్రణరు లీ(చైనా) చేతిలో ఓటమిపాలయ్యారు. హెూరాహెూరీగా సాగిన ఈ పోటీలో ప్రణరు 8-21, 21-15, 21-23తో పరాజయాన్ని చవిచూశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో మాల్విక పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో మాల్విక 18-21, 11-21తో వై.యన్(చైనా) చేతిలో ఓటమిపాలైంది. ఇక మహిళల డబుల్స్‌లోనూ త్రీసా జోలీ-గాయత్రి జంటకు నిరాశ తప్పలేదు. వీరు 21-15, 18-21, 19-21తో చైనా షట్లర్ల చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో కరుణాకరన్-ఆధ్యా, ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో జంటలు ఓటమిపాలయ్యాయి. ఈ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరిన ఏకైక జంట సాత్విక్-చిరాగ్ మాత్రమే.




## యువరాజ్‌ను జట్టు నుంచి తప్పించింది కోహ్లీనే..



ప్రస్తుతం విరాట్ కోహ్లీ పేలవమైన ఫామ్‌పై చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోనూ విరాట్ ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. ఇప్పుడు విరాట్ ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. ఇలాంటి సమయంలోనే టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప విరాట్‌పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. యువరాజ్ సింగ్‌ను విరాట్ జట్టు నుంచి తప్పించారని టీమిండియా మాజీ వెటరన్ క్రికెటర్ ఆరోపించాడు. భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప తాజాగా ఈ సంచలన విషయాన్ని వెల్లడించాడు. యువరాజ్ సింగ్ అంతర్జాతీయ కెరీర్‌ను ముందుగానే ముగించడానికి విరాట్ కోహ్లీ కారణమని ఆరోపించాడు. విరాట్ కోహ్లీ.. యువరాజ్ సింగ్‌కు సహాయం చేయలేదని, అతనిని జట్టు నుండి తొలగించాడని మాజీ వికెట్ కీపర్ సంచలన విషయాలు చెప్పాడు. దీని కారణంగా యువరాజ్‌ను భారత క్రికెట్ జట్టు నుండి తొలగించాల్సి వచ్చిందని ఉతప్ప పేర్కొన్నాడు. లాలాంటాప్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాబిన్ ఉతప్ప ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు. ఉతప్ప అక్కడ మాట్లాడుతూ.. యువీని ఉదాహరణ తీసుకోండి. క్యాన్సర్‌ను ఓడించిన అతను అంతర్జాతీయ జట్టులో పునరాగమనం చేయడానికి ప్రయత్నించాడు. అతను మాకు ప్రపంచ కప్ తెచ్చిన ఆటగాడు. ఇతర ఆటగాళ్లతో కలిసి రెండు ప్రపంచ కప్‌లు గెలిచాడు. వాటిని గెలవడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. అలాంటి ఆటగాడికి నువ్వు (విరాట్‌ను ఉద్దేశించి) కెప్టెన్ అయ్యాక జట్టులోకి వచ్చేందుకు టైమ్ ఇవ్వలేదు. అప్పటి కెప్టెన్ విరాట్ కోహ్లీకి ప్లేయర్ల ఫిట్‌నెస్, ఆహారపు అలవాట్లకు పెద్దపీట వేసేవాడు. అందరూ ఆటగాళు తనలాగే ఉండాలనుకునేవాడని అన్నారు. ఎంఎస్ ధోని సారథ్యంలో భారత జట్టు వన్డే ప్రపంచకప్ 2011 టైటిల్‌ను గెలుచుకుంది. ఈ ప్రపంచకప్‌లో యువరాజ్ బ్యాట్, బాల్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. దీంతో అతను ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా కూడా ఎంపికయ్యాడు. ఆ తర్వాత యువరాజ్ సింగ్‌కు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.

## క్వార్టర్ ఫైనల్స్‌కు హర్యానా, రాజస్థాన్



న్యూఢిల్లీ: దేశవాలి వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో రాజస్థాన్, హర్యానా జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. గురువారం జరిగిన ప్రిలిమినరీ క్వార్టర్ ఫైనల్స్‌లో రాజస్థాన్, హర్యానా జట్లు విజయం సాధించాయి. తమిళనాడుతో జరిగిన పోరులో రాజస్థాన్ 19 పరుగుల తేడాతో విజయం సాధించగా.. బెంగాల్‌పై హర్యానా 72 పరుగుల తేడాతో గెలుపొందింది. రాజస్థాన్, హర్యానా జట్ల మధ్య జరిగిన రెండో ప్రిలిమినరీ క్వార్టర్ ఫైనల్-లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 47.3 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. స్టాస్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 5 వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బకొట్టాడు. ఇక రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అభిజీత్ తోమర్ (111) సెంచరీతో చెలరేగగా.. కెప్టెన్ మహిపాల్ లోమ్రార్ (60) అర్ధ సెంచరీతో రాణించాడు. కార్తీక్ శర్మ (35), సమర్పిత్ జోషి (15) మాత్ర మే రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం 268 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ బౌలర్లలో అమన్ సింగ్ షెకావత్ మూడు వికెట్లు, అనికేత్ చౌదరీ, అజ య్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. ఖలీ ల్ అహ్మాద్ ఓ వికెట్ దక్కించుకున్నారు. తమిళనాడు ఇన్నింగ్స్‌లో ఎన్ జగదీశన్ (65) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బాబా ఇంద్రజిత్ (37), విజయ్ శంకర్ (49), మహ్మాద్ అలీ (34) ఫర్వాలేదనిపించారు.

## సెలక్టర్లను విరామం కోరిన కేఎల్ రాహుల్..



స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా జట్టును త్వరలో ప్రకటించనుంది. ఆస్ట్రేలియాతో ఘోర పరాజయం తర్వాత కెఎల్ రాహుల్ (%ఖూ ఝష్త్రబశ్రీ%) సెలెక్టర్ల నుండి విరామం కోరాడు. కంగారూ గడ్డపై ఆడిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో బ్యాట్‌తో ఏదో ఒక రూపంలో కనిపించిన అతికొద్ది మంది బ్యాట్స్‌మెన్‌లలో రాహుల్ ఒకరు. ఇటీవలి కాలంలో వన్డే క్రికెట్‌లో రాహుల్ ప్రదర్శన అద్భుతంగా ఉంది. రాహుల్ బ్యాట్‌తో పాటు వికెట్‌కీపర్ పాత్రను కూడా చక్కగా పోషించాడు. పిటిఐ కథనం ప్రకారం.. ఇంగ్లండ్‌తో సిరీస్ కోసం కెఎల్ రాహుల్ సెలక్టర్ల నుండి విరామం కోరాడు. అలసట కారణంగా రాహుల్ విశ్రాంతి కోరారు. అయితే, ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయడానికి తాను అందుబాటులో ఉంటానని సెలక్టర్లకు తెలియజేసాడు. %దీజజ×% ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. "రాహుల్ ఇంగ్లాండ్ సిరీస్‌కు విరామం అడిగాడు. అయితే అతను ఛాంపియన్స్ ట్రోఫీలో ఎంపికకు అందుబాటులో ఉంటాడు" అని తెలిపారు. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో రాహుల్ ఐదు మ్యాచ్‌ల్లో 30 సగటుతో మొత్తం 276 పరుగులు చేశాడు. తొలి రెండు టెస్టు మ్యాచ్‌ల్లో రాహుల్ అద్భుతమైన ఫామ్‌లో కనిపించాడు. ఇటీవలి కాలంలో వన్డే క్రికెట్‌లో కేఎల్ రాహుల్ ఆటతీరు అద్భుతంగా ఉంది. 2023వ సంవత్సరంలో రాహుల్ మొత్తం 24 ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ సమయంలో అతను 66.25 సగటుతో 1060 పరుగులు చేశాడు. రాహుల్ 2 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు సాధించాడు. 2024లో భారత జట్టు కేవలం 3 వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. రాహుల్‌కు 2 మ్యాచ్‌ల్లో బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. అతను 15 సగటుతో 31 పరుగులు చేశాడు.

## ఛాంపియన్ ట్రోఫీకి కమిన్స్ దూరం?



మెల్‌బోర్న్: బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో విజయం సాధించి, డబ్లుటిసి ఫైనల్‌కు దూసుకెళ్లి ఆస్ట్రేలియాకు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు సారథి ప్యాట్ కమ్మిన్స్‌కు జట్టుకు దరమయ్యాడు. పాకిస్థాన్‌లో జరిగే ఛాంపియన్ ట్రోఫీకి అందుబాటు లో ఉండటంలేదని సమాచారం. తాజాగా ఆ స్ట్రేలియా క్రికెట్ బోర్డ్.. లంకతో జరగబోయే రెండు టెస్ట్ మ్యాచుల సిరీస్ కోసం జట్టును ప్రకటించింది. ఇందులో కమిన్స్ పేరు లేదు. వ్యక్తిగత కారణాలతో అతడు అందుబాటులో ఉండట్లేదని తెలిపింది. ఎందుకంటే లంకతో సిరీస్ జరిగే సమయానికి కమిన్స్ భార్యకు రెండో డెలివరీ అయ్యే అవకాశం ఉంది.దీంతో పాటే క మ్మిన్స్‌కు ప్రస్తుతం చీలిమండ గాయమైంది. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా చీఫ్ సెలక్టర్ జార్జ్ బెలీ చెప్పాడు. కమిన్స్‌కు త్వరలోనే గాయం తీవ్రత తెలుసుకోవడానికి చికత్సకు వెళ్లనున్నాట్టు అత డు చెప్పుకొచ్చాడు. గాయం తీవ్రత ఎక్కువైతే కమ్మిన్స్ ఈ మెగా టోర్నీకి దూరమయ్యే అవకా శం ఉందని ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బెలీ మాట్టాడుతూ.. "కమిన్స్‌కు చీలమండ గాయమైంది. నాకు తెలిసి వచ్చే వారం అతడు స్కానింగ్‌కు వెళ్తాడు. రిపోర్ట్‌లో అతడి గాయం తీవ్రతపై ఓ స్పష్టత వస్తుంది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు పాల్గొంటాడా లేదా అనేది ప్రస్తుతం కచ్చితంగా చెప్పలేం' అని అన్నాడు. కాగా, ఆస్ట్రేలియా జట్టు ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్‌బిలో ఉంది. ఈ కేటగిరీలో ఇంగ్లండ్, సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్ జట్లు ఉన్నాయి. ఈ మెగా టోర్నీలో ఆస్ట్రేలియా తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది.

# అక్రమ స్థలాల విల్లాలు నెలమట్టం



**గండీ పేట మండలం ప్రజాబలం ప్రతినిధి 10** జనవరి 2025 హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిన్నటి రోజున మణికొండ పరిధి లోని నెక్నంపూర్ లో గల చిన్న చెరువును సందర్శించడం జరిగిన దరిమిలా కొంతమంది కబ్జా దారులు ఆక్రమించుకున్న స్థలాలపై నిర్మించిన అక్రమ విల్లాల నిర్మాణాలను నెలమట్టం చేయమని గతంలో హెచ్.ఎమ్.డీ.ఎ అధికారులు మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలనూ ఖాతరు చేయకుండా గాలికి వదిలి వేయడం జరిగినదని స్థానిక ప్రజలు వాపోతు హైడ్రా కమిషనర్ కు పిర్యాదు చేసినారు. అట్టి అక్రమ కట్టడాలైన విల్లాలను రంగనాథ్ గుర్తించి వెంటనే స్పందించి అట్టి విల్లా కట్టడాలను తొలగించాలని ఆదేశించడమైనది. అట్టి ఆదేశాల మేరకు 24 గంటల లోపే స్థానిక అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందో బస్తుల మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చి వేయడం జరిగినది.

# జలమండలి అధికారులను కలసిన బి.ఆర్.ఎస్ నాయకులు



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 10 జనవరి 2025** మణికొండ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి కట్టుగా ఖైరతబాదు వద్ద గల జలమండలి కార్యలయానికి వెళ్లి జలమండలికి సంబంధించిన ప్రజా సమస్యలపై ప్రత్యేకించి

1. స్థానిక ప్రజల అవసరం మేరకు మంచి నీటి సరఫరా లేదనీ వారు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం కొరకు.
2. రాబోయే ఎండా కాలంలో నీటి ఎద్దడి తట్టుకొని, పరిస్థితికి తగ్గట్టు నీటి సరఫరా ట్యాంకర్ లను ఏర్పాటు చేసుకోవాలని.
3. ఖిజ్రా కాలనీ, గోల్కొండ హిల్స్, నెక్నంపూర్, నెమలి నగర్ తది తర ప్రాంతాలలో నీటి సరఫరా పైప్ లైన్లు పూర్తిగా ఏర్పాటు చేయాలని.
4. అల్కాపూర్ స్పోర్ట్స్ పార్క్ లో గల 2.5 ఏం.ఎల్.డి మరియు కృష్ణా రెడ్డి నగర్ 0.5 ఏం.ఎల్.డి సామర్థ్యం గల రిజర్వాయర్ లు నిరూపయోగంగా ఉన్నవని, సామర్థ్యం మేర నీటి సరఫరా జరుగడం లేదనీ.
5. నెమలి నగర్ లో రిజర్వాయర్ కట్టడానికి స్థలం ఉన్నను కట్టలేదని.
6. ప్రజల వద్ద నుండి డ్రైనేజీ సిస్తు వసులు చేయడం మాత్రమే జలమండలికి తెలుసని అందుకు తగ్గట్టు ప్రజా సౌకర్యార్థం పనులు జరపకుండా మునిసిపాలిటీ వారిపై నెట్టడం.

పై విషయాలన్నీ జలమండలి అధికారి మయాంక్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈ.డి) దృష్టికి తీసుకెళ్ళడం మరియు ప్రజా సౌకర్యార్థం పనులు మెరుగు పరచాలని పిర్యాదు చేయడమైనదనీ భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలిపినారు, ఇట్టి కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, గుట్టమీధి నరేందర్, అందె లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, ఆరీఫ్ మొహమ్మద్, అష్ఫాక్ అలి, సుమనళినీ తది తరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా పంచముఖి హనుమాన్, వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకొన్న సీపీ





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 10 :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ మందమర్రి లోని పంచముఖి హనుమాన్ ఆలయం,వెంకటేశ్వర స్వామి ఆలయంకి చేరుకొన్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్,డిసిపి భాస్కర్ ఇతర పోలీస్ అధికారులు పూజారులు అనంత ఆచార్యులు,డింగరి కృష్ణకాంత్ చార్యులు, నరసింహ శాస్త్రి చార్యులు మంత్రోచ్చారణ నడుమ దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సిపి,డిసిపిలను స్వామి వారి శేష వస్త్రాలతో ఆలయ పూజారులు,కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అందరికి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. భక్తుల ఎలాంటి ఇబ్బంది లేకుండా దైవ దర్శనం కొరకు అన్ని ఆలయాల లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులు అందరూ ప్రశాంతంగా క్యూ లైన్లు పాటిస్తూ దైవ దర్శనం చేసుకోనీ ప్రశాంతంగా వెళ్లాలని కోరారు. ప్రజలు అందరు ప్రశాంతంగా, సుఖసంతోషాలతో ఉండాలని, అందరికి మంచి జరగాలని, అందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.సీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్,మందమర్రి సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్,తదితరులు ఉన్నారు.

## రాజన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు

రాజన్న సిరిసిల్ల తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి ప్రాతఃకాల పూజ నిర్వహించిన ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను పల్లకి సేవ లో ప్రతిష్టించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం రంగురంగుల పూలతో అలంకరించిన అంబారి సేవపై శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ లక్ష్మి అనంత పద్మనాభ స్వామి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి దేవాలయంలో మూడు ప్రదక్షిణలు చేసిన అనంతరం రాజగోపురం గుండా స్వామివారు బయటకు రాగానే వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ శర్మ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఈవో వినోద్ రెడ్డి లతో పాటు వేలాది భక్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వేదికగా గ్లోరియస్ మిస్, మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు...




హైదరాబాద్ వేదికగా గ్లోరియస్ మిస్, మిసెస్, రాయల్ మిస్టర్ ఇండియా పోటీలు ఏప్రిల్ మాసంలో నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ మాజీ జాతీయ అధ్యక్షుడు అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జె సి ఐ,షిమెరింగ్ స్టార్ లైట్ క్రియేషన్స్ ప్రతినిధులు స్నేహాల్, క్రాంతి కుమార్ పాల్వాయి, సబీనా, నిరూప పటేల్ లతో కలిసి పోటీలకు సంబందించిన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె సి ఐ,షిమెరింగ్ స్టార్ లైట్ క్రియేషన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ మాసంలో ఈ పోటీలు ప్రతిష్టాత్మకంగా పార్క్ హోటల్ లో నిర్వహిస్తున్నట్లు, ఇప్పటికే ఈ పోటీలకు సంబందించిన ఆన్ లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయని, ఈ పోటీల ద్వారా సమీకరించే నిధులను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పెద్ద చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు...



**తూప్రాన్, జనవరి 10 (ప్రజాబలం న్యూస్) :-** మెదక్ జిల్ల తూప్రాన్ పురపాలక సంఘానికి తలమానికగా ఉన్నటువంటి తూప్రాన్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క వేపుగా పెరిగి నీటి కాలుష్యాన్ని పెంచడమే కాకుండా నీటిలో పెరిగే సమస్త జీవరాశికి పెను ముప్పుగా ఉన్నందున ప్రజల ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ ప్రత్యేక చొరవతో గుర్రపు డెక్కను చెరువులో నుంచి తీయించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు మామిళ్ళ కృష్ణ, కమిషనర్ గణేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తూప్రాన్ మున్సిపాలిటీ అధ్యక్షులు పల్లెర్ల రవీందర్ గుప్తా, మత్స్యశాఖ నాయకులు మున్సిపల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు...



తూప్రాన్, జనవరి 10 ప్రాజబలం ప్రతినిది :-మెదక్ జిల్ల తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు పాఠశాల ఆవరణలో ముగ్గుల వేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ బహుమతులను ప్రధానం చేశారు, మొదటి బహుమతిని భవ్యశ్రీ, శ్రీవర్ష, మైథిలి, మనస్విని లు తీసుకోగా రెండవ బహుమతి హిమవర్షిణి, సాయిసుష్మిత, భవాని, నైనికా విద్యార్థులు బహుమతులు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమరవాణి, జ్యోతి, రజిత, దుర్గ, వనిత,తిరుమల, పద్మ, సుశ్రత్,అరుణ, నరేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాకీ డబ్బులు ఆడిగినందుకి కొట్టి చంపిన నిందితుడు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 10 :** మంచిర్యాలలోని లక్షెట్టిపేట మండలంలోని జెండ వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు పోచయ్య అనే 65 సంవత్సరాల వృద్ధున్ని తనకు వచ్చే బాకీ డబ్బులు 30వేలు అడిగినందుకు కర్రతో కొట్టి చంపాడు అదే గ్రామానికి చెందిన కోన శంకరయ్య అనే నిందితుడు.మృతుని మనుమడు ఎల్తపు వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఏమనగా నిందితున్నీ ఈనెల 7వ తారికు రోజున రాత్రి అందాజా 8గంటల సమయంలో మృతుడు పోచయ్య తనకు వచ్చే బాకీ డబ్బులు అడుగగా కోపోద్రేకుడైన నిందితుడు కోన శంకరయ్య అక్కడే ఉన్న కర్రతో బలంగా తలపై కొట్టడంతో తీవ్ర రక్త గాయం అయ్యింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు పోచయ్యను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈరోజు చనిపోవడం జరిగింది.హత్యకు కారకుడైన నిందితుడు కోన శంకరయ్య పై కేసు నమోదు చేయడం జరిగిందని లక్షెట్టిపేట ఎస్సై పి.సతీష్ తెలిపారు శంకర పద్దది

# బస్సులో సీట్లకోసం మహిళల సిగపట్లు

వనపర్తిఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని బస్టాం డ్ వద్ద గురువారం సాయంత్రం వన పర్తికి వెళ్లే బస్సు ప్రయాణంలో మహిళలు గొడవ పడ్డారు. చీపుర్లు, కట్టెలతో కొట్టుకునే వరకు వచ్చింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగింది. బస్సు ల్లో సీట్ల కోసం దొంతికుంట తండా మహిళలు తొందరపడి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ గంప ఎత్తుకొని దిగుతూ ఒకరినొకరు తోసుకోవడంతో గొడవ జరిగింది. మండల కేంద్రానికి చెందిన మహిళ గిరిజన మహిళపై కట్టెతో దాడి చేసింది. అక్కడే ఉన్న కొంత మంది మహిళలు చీపుర్లతో ఎదురుదాడికి దిగారు...సిగలు పట్టుకొని కొట్టుకున్నారు...దీంతో గొడవ మరింత పెద్దది కావడంతో అక్కడే ఉన్న ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణ పథకంతో బస్సుల్లో మహిళల రద్దీ ఎక్కువయ్యిందని, అందుకు తగినట్లు బస్సుల సంఖ్యను పెంచలేదని, అందువల్లే తరచూ గొడవలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సీట్లు సరిపోకపోవడంతో మహిళలతో పాటు, పురుషులు కూడా ఇబ్బంది పడ్తున్నారని చర్చించుకున్నారు. మహిళలు గొడవకు సంబంధించిన వీడియోలు వాట్సాప్ గ్రూపులో వైరల్ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది... చివరకు స్థానికులు వారిని శాంతింపచేశారు.

## జాతీయ అవార్డు గ్రహీత దాసరి శ్రావణ్ కుమార్ ను అభినందించిన సిపి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 10:మందమర్రి పట్టణంలో గల వెంకటేశ్వర టెంపుల్ ఏరియాకు చెందిన దాసరి శ్రావణ్ కుమార్ మందమర్రి పోలీస్ స్టేషన్ లో హెూంగార్డుగా పోలీసు ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నారు. సమాజ సేవలో సాగుతూ బ్లడ్ డొనేట్ క్యాంప్ లు, సామాజిక సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ శ్రావణ్ కు అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డును అందించింది. శుక్రవారం సిపి కార్యాలయంలో రామగుండం కమిషనరేట్ సి. పి ఏం. శ్రీనివాస్ దాసరి శ్రావణ్ కుమార్ ను అభినందిస్తూ సామాజిక సేవలకు గుర్తింపుగా అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నందుకు ఆభినందించారు. ఓవైపు హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నందుకు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏసీపీ సుందర్, అర్.ఐ దామోదర్, ఏం.టి. ఓ , అర్.ఐ సంపత్ లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం లో మాజీ సైనికులకు పెరుగుతున్న ప్రాముఖ్యత

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి





ప్రజావాళం ప్రతినిధి ఉప్పల్ జనవరి 11:కాంగ్రెస్ ప్రభుత్వం లో మాజీ సైనికులకు ప్రాముఖ్యత పెరుగుతుందని మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయ ఉద్యోగుల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షుడు మాజీ సైనికుడు గిరి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ లతోపాటు ఎన్నికలో ఎన్నికైన వారిని ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి లు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో మాజీ సైనికులకు ప్రాముఖ్యత లేదని, పట్టించుకోలేదన్నారు. నేడు సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గా మాజీ సైనికుడు గెలవడం హర్షించదగ్గ విషయమన్నారు. మాజీ సైనికుడు అధ్యక్షుడిగా గెలవడం, మాజీ సైనికుడికి పార్టీ లో సంయుక్త కార్యదర్శి గా పదవి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం లో మాజీ సైనికులకు పెరుగుతున్న ప్రాముఖ్యత నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నవీన్, అయేషా, తబూస్సం, అదనపు కార్యదర్శి భూక్యా, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, నీరజ, వంశీధర్, యామిని, రాజేశ్వర్, కోశాధికారి కైలాసం లు పాల్గొన్నారు

## ఆలయాల్లో రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 10:ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ మందమర్రిలోని పంచముఖి హనుమాన్ ఆలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంకి చేరుకొన్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, డిసిపి భాస్కర్ ఇతర పోలీస్ అధికారులు పూజారులు అనంత ఆచార్యులు, డింగరి కృష్ణకాంత్ చార్యులు, నరసింహ శాస్త్రి చార్యులు మంత్రోచ్చారణ నడుమ దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిపి, డిసిపిలను స్వామి వారి శేష వస్త్రాలతో ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అందరికి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. భక్తుల ఎలాంటి ఇబ్బంది లేకుండా దైవ దర్శనం కొరకు అన్ని ఆలయాల లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులు అందరూ ప్రశాంతంగా క్యూ లైన్లు పాటిస్తూ దైవ దర్శనం చేసుకోనీ ప్రశాంతంగా వెళ్లాలని కోరారు. ప్రజలు అందరు ప్రశాంతంగా, సుఖసంతోషాలతో ఉండాలని, అందరికి మంచి జరగాలని, అందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. సీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ శివనీతి రాజశేఖర్, తదితరులు ఉన్నారు.



## ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ జనవరి 10:వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నాచారం ఎచ్ ఏం టీ నగర్ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఉత్తరం ద్వారం దర్శనం చేసుకుని ప్రత్యేక పూజకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, చంద్రమౌళి, హన్మంత్ బిరాదర్,శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి,గందమల్ల గోపి శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్ రెడ్డి,సురేందర్, రమేష్, క్రాంతికుమార్, మోర నర్సింహారెడ్డి,నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు,మంజులవాణి తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం

## ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా మాదారపు హరినాథ్ ఎన్నిక



ఖమ్మ ప్రతినిది జనవరి10 (ప్రజాబలం) ఖమ్మం తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా మాదారపు హరినాథ్ ఎన్నికయ్యారు నన్ను ఎన్నుకున్నందుకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తున్నానని తెలిపారు నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారికి ఎటువంటి సమస్య వచ్చిన తక్షణమే పెద్దలైన డిప్యూటీ సీ.ఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తారని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు నా సంఘం ప్రజలకు ఎప్పుడు అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తారని ఈ సందర్భంగా వారు తెలియజేసినారు

## అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

## -ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టరు కుమార్ దీపక్ దంపతులు



మందమర్రి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం ప్రజలు క్యూ లైన్ లో ఉండి చేసుకున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపి శ్రీనివాస్ .జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏరియా జిఎం దేవేందర్, అంజనీపుత్ర డైరెక్టర్ పిల్లి రవి లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకే ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు మరియు దర్శనం నిర్వహించారు. ఆలయ పూజారులు అనంత చారి నరసింహచార్యులు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఆలయ ముఖ ద్వారంను సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ముఖ ద్వారం నుండ క్యూలో ఉంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎవరికి ఇబ్బంది



కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఎన్ పి సి సిబ్బంది పోలీసులు సమన్వయంతో మరియు ఆలయ వాలంటీర్లు సేవా సభ్యులు తమ సేవలను వినియోగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం సాఫీగా సాగేందుకు నిరంతరం కృషి చేశారు సీఐ. శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్.ఐ శివనీతి రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ లు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా బ్రహ్మంగారి ఆలయంలో పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు .ఈ సందర్భంగా అనంత చారి నరసింహచార్యులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని ముక్కోటి దేవతలను పూజించిన పుణ్యం లభిస్తుందని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## జమ్మిబండ నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ లో అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబురాలు








ఖమ్మం ప్రతినిధి జనవరి10 (ప్రజాబలం) ఖమ్మం సంక్రాంతి వేడుకలు ఏజీఎం రాంకి ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహంగాఅంగరంగ వైభవంగా జరిగాయి ఈ కార్యక్రమం విజయవంతంగా పల్లెటూరి వాతావరణాన్ని తిరిగి సృష్టించింది రోలు రోకలి నవ్వారు మంచం ,కోడిపుంజులు గోవులు హరి దాసు వేషాలు ధాన్యం చెరకు గడలతో అరటి మట్టలతో పూర్తిగా వేసిన సెట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులకు రంగోలి పోటీలు బాలురకు గాలిపటాలు ఎగరేయడం పోటీలు నిర్వహించి పండుగ శోభను మరింత పెంచారు చిన్న పిల్లలకు భోగి పల్లు పోసి వారికి దీవెనలందించారు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన నృత్యాలు హైలెట్గా నిలిచాయి ఈ సందర్భంగా ఏజీఎం యస్.రాంకి మాట్లాడుతూ పిల్లలు సంప్రదాయాల విలువను అర్థం చేసుకోవడానికి మరియు అభినందించడానికి సంక్రాంతి వంటి పండుగలను జరుపుకోవడం మన సంప్రదాయాలను గౌరవించడం ఈ తరం పిల్లలకు చాలా అవసరం అని తెలిపారు . రంగోలి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన స్థానిక కార్పొరేటర్ సరిపుడి రమాదేవి ప్రత్యేక అతిథిగా హాజరై కార్యక్రమం మరింత శోభాయమానంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్ఐ యం. క్రాంతి కుమార్ హై స్కూల్ జోనల్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ చాంప్స్ కో ఆర్డినేటర్ వినోద లక్ష్మి కిడ్స్ జోనల్ కో ఆర్డినేటర్ నీలిమ ప్రిన్సిపల్ రేఖ ఏఓ నర్సింహారావు వీపీలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు విద్యను సాంస్కృతిక విలువలతో మిళితం చేయడంలో పాఠశాల నిబద్ధతకు ఈ వేడుక నిదర్శనం పండుగ మరియు సాంస్కృతికంగా సుసంపన్నమైన అనుభవాన్ని ప్రతి ఒక్కరికీ మధురమైన జ్ఞాపకాలను మిగిల్చింది అని అన్నారు

# చిత్తారి సింహాద్రి యాదవ్ కి పితృవియోగం

## భౌతిక కాయానికి నివాళులర్పించి అంత్యక్రియలలో పాల్గొన్న మేకల మల్లి బాబు యాదవ్ చిలకల వెంకట నరసయ్య



**ఖమ్మం ప్రతినిధి జనవరి 10 (ప్రజాబలం)** ఖమ్మం అఖిలభారత యాదవ మహాసభ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ తండ్రిగారైన చిత్తారు హుస్సేన్ అనారోగ్యంతో మరణించారు. వారి భౌతికకాయాన్ని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య సందర్శించి పూలమాలవేసి నివాళు లర్ప%శీ% చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. కన్న తండ్రి లేని లోటు ఏ కుమారుడికైనా తీవ్ర దిగ్భ్రాంతికల విషయమని, లోటును ఎవరు పూడ్చలేరని కానీ కాల నిర్ణయానికి ఎవరు అతీతులు కాదని, ధైర్యంగా ఉండాలని సింహాద్రి యాదవ్, చిత్తారి విశ్వనాథ%శీ% ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లోడిగ వెంకన్న కనక బండి విజయలక్ష్మి పద్మ జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, చేతుల నాగేశ్వరరావు యాదవ్, పగడాల నాగరాజు, బమ్మిడి శ్రీను పొదిలి సతీష్ వాగదాని పుల్లారావు, మొరి మేకల కోటయ్య సత్తి వెంకన్న మేకల నాగేశ్వరరావు, తోడేటి లింగరాజు, బండారు ప్రభాకర్, ఫంకు మురళి, బొల్లి సైదులు పల్లెబోయిన పుల్లారావు, తెల్లబోయిన రమణ పుచ్చకాయల వెంకటేశ్వర్లు పుచ్చకాయల కృష్ణ, పుచ్చకాయల వీరభద్రం, కొప్పుల నర్సింగరావు చింతలచెరువు కోటేశ్వరరావు, ఎర్రబోయిన చిన్న వెంకటయ్య వాగదాని రామాంజనేయులు, యాదవ సంఘం ముఖ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల ఎదుగుదలకు బాలవికాస్.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.





**తూప్రాన్, జనవరి,10. ప్రాజబలం ప్రతినిధి :-** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల ఎదుగుదలకు బాలవికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. శుక్రవారం నాడు మెదక్ జిల్ల తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆర్డీఓ జయచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా చిన్నపిల్లల యొక్క ఎదుగుదలను తల్లిదండ్రులు ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో చిన్న పిల్లలతో డాన్సు, నృత్యం కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరవ తూప్రాన్ మున్సిపల్ చైర్పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, ఆర్డిఓ జయచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీ పాతూరి గణేష్ రెడ్డి లు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# పారిశ్రామిక సంబంధాలు పరిశ్రమల్లో రక్షణ ఆరోగ్యంపై సదస్సు

## -సదస్సులో పాల్గొన్న ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 10:**విజయవాడలో పారిశ్రామిక సంబంధాలు, పరిశ్రమల్లో రక్షణ మరియు ఆరోగ్యం అనే అంశంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మొదటి రోజు అర్థవంతంగా ముగిసిందని ఐఎన్టియుసి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ తెలిపారు. విజయవాడలోని పార్క్ ఎన్ హెటల్ లో జపాన్ కు చెందిన 'జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్' ఐ. ఎన్.టి.యూ.సి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో జిల్లా ఏంటిసి అధ్యక్షుడు రామిశెట్టి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు పరిశ్రమల్లో ఉద్యోగుల ఆరోగ్యం మరియు రక్షణ పై జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అధ్యక్షుడు యసునోబు అహిర సాన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ హితోషి సుజుకి సాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యుకో కటో సాన్, పవన్ కుమార్ ఐ.టి. సి జి. ఏం ( ఎంప్లాయి రిలేషన్స్ )చే కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. డాక్టర్ కె. మహేశ్వర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ( సెంట్రల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్- గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ) వీరాస్వామి ఐ.టి. సి - ఏ.డి.బి వైస్ ప్రెసిడెంట్( హెచ్.అర్) చే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం వచ్చిందని తనకు ఈ గొప్ప అవకాశం ఇచ్చినందుకు జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డికి మరియు సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెక్రటరీ జనరల్, ఐ. ఎన్.టి.యూ.సి జాతీయ కార్యదర్శి మరియు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నరేందర్ తెలిపారు.

# రిటైర్ సింగరేణి కార్మికులకు ఫిబ్రవరిలో కొత్త పెన్షన్

## -సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం వినతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 10:** 2021 నుంచి 2024 మధ్యలో సింగరేణిలో రిటైర్మెంట్ అయినా కార్మికులకు 11వ వేచి బోర్డు పెన్షన్తో పాటు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని మందమర్రి సింగరేణి రిటైర్మెంట్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రీజినల్ కమిషనర్ పచోరి కి వినతి పత్రాన్ని అందజేశారు అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ పోయిన నెల 19వ తారీఖున మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయానికి విచ్చేసినప్పుడు మొదటిగా సింగరేణి. రిటైర్మెంట్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది అప్పుడు పది రోజుల్లో చెల్లించేందుకు ఆయన మాట ఇచ్చారు కానీ ఇచ్చిన గడువు దాటిపోయిన కూడా కార్మికులకు చెల్లించకపోవడంతో నిన్న గోదావరిఖనిలో ఆయన చాంబర్లో కలిసి మళ్ళీ ఒకసారి గుర్తు చేయడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఫిబ్రవరి నెలలో కొత్త పెన్షన్ తో పాటు ఏరియాస్ ను కూడా చెల్లించేందుకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. గోదావరిఖని రీసన్లలో సుమారు నాలుగువేల పెన్షన్లు ఉంటే అవి ఇప్పటివరకు రెండు వేలు మాత్రమే. వెరిఫికేషన్ చేశారు మిగతావి కూడా పూర్తిచేసి ఫిబ్రవరిలో చెల్లించేందుకు కృషి చేస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో వినతిపత్రం అందించిన వారిలో సింగరేణి. రిటైర్మెంట్ కార్మిక సంఘం మందమర్రి పట్టణ అధ్యక్షుడు వాసాల శంకర్. వైస్ ప్రెసిడెంట్ జక్కం రాజయ్య అలాగే శనిగారపు రాజేష్. ప్రచార కార్యదర్శి లు దాసరి ఎల్లారం. నాయిని శంకర్. కోశాధికారి ఆసం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 23న రవీంద్రభారతి వేదికగా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ...



ఫిల్మ్ మేకర్లకు పండగలాంటి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ ఈ యేడు మార్చి 23 నుండి 26 వరకు రవీంద్ర భారతి వేదికగా నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఫౌండర్ బొంగు ప్రసాద్ గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుండి పలువురు ఫిల్మ్ మేకర్లు ఈ ఫెస్టివల్ లో పాల్గొననున్నారని, ఈ ఫెస్టివల్ లో ప్రదర్శించిన చిత్రాలలో ప్రతిభ ఆధారంగా ఉత్తమ షార్ట్ ఫిల్మ్, ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరి, యాడ్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియో, యానిమేషన్ ఫిల్మ్ వంటి పలు కేటగిరి లలో అవార్డు లను ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.కళాకారులకు తమ కళలను ప్రదర్శించుకోవడానికి ఇటువంటి వేదికలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ సత్యనారాయణ , జాతీయ ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి,రాఘవేందర్, దిలీప్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డా సుహాసిని భరత నాట్య ప్రదర్శన



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**ప్రముఖ వైద్యులు డా? వేణుగోపాలకృష్ణ.డా. నీలిమ ల కూతురు డా.సుహాసిని హైదారాబాద్ లో "వైద్య విద్య నభ్య సిస్తున్నారు.ప్రేమతో నాన్న.చిత్రానికి ఉత్తమ నటిగా నంది పురస్కారాలు అందుకున్నారు.వైద్య విద్యలో వుంటూ సుహాసిని అనేక లఘు చిత్రాల్లో నటిస్తూ ఉత్తమ నటిగా,తండ్రి డా.వేణుగోపాలకృష్ణ బాటలో ఎదుగుతున్నారు. భరతనాట్యం,వేద పఠనంలో చక్కని ప్రావిణ్యం కలిగివున్నారు.రాష్ట్ర స్థాయి వేదికలపై సుహాసిని భరత నాట్య ప్రదర్శన చేస్తున్నారు. వైద్య విద్య,కళలు రెండింటినీ గౌరవిస్తూ సుహాసిని మంచి పేరు తెచ్చుకున్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా

సుహాసిని నిర్మల్ కళా వేదిక పై అద్భుతంగా భరత నాట్యం. ప్రదర్శించి,అందరి మన్ననలు లు పొందారు. మాజి మంత్రి వర్యులు శ్రీఅల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి అభి లాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్,ఆర్ డి ఓ రత్ కుమారి,పలువురు అదికారులు, నయకులు పాల్గొని. డా.సుహాసినీ వేణుగోపాలకృష్ణ ను అభినందించారు .

## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కన్నులపండుగగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

### వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన స్వామివారు

యాదాద్రి శుక్రవారం ముక్కోటి ఏకాదశి కావడంతో వేకువజామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు యాదాద్రి కి చేరుకొని స్వామివారి ని ఉత్తర ద్వారం ప్రత్యేక క్యూ లైన్ మార్గమున దర్శించుకున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శ్రీ స్వామి వారు ఉదయం ఐదు గంటల 27 నిమిషాలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గరుడ వాహనంపై భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు... ఉదయం నుండి భక్తులు ప్రత్యేక క్యూలైన్లర ఉత్తర ద్వార నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.... భక్తులు ఇలాంటి ఇబ్బందిలే తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు... స్వామి వారి ఉత్తర ద్వార దర్శనంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, పాలు ఈఓ భాస్కరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు...

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com